అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 18-01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 20 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల: 6.50

కొలువు దీరారు

తెలంగాణలో రెండవ శాసనసభ



స్పీకర్‌గా పోచారం

ఒకే ఒక నామినేషన్

ఏకగ్రీవం లాంఛనమే...

కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ మద్దతు

సుదీర్ఘ రాజకీయ అనుభవానికి పెద్దపీట

వివరాలు 9లో

ఉత్తమ్ వద్దకు సీఎం...



సభ ప్రారంభం కాగానే ముఖ్యమంత్రి కేసీఆర్..హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ సభ్యుల స్థానాల వైపునకు వెళ్లారు. అక్కడి స్థానాల్లో ఉన్న ఉత్తమ్‌నూ, భట్టి విక్రమార్కనూ పలకరించి కరచాలనం చేశారు. అక్కడే ఉన్న ఇతర కాంగ్రెస్ సభ్యులకూ నమస్కరిస్తూ ముందుకెళ్లిపోయారు. ప్రతిగా వారందరూ సీఎంకు నమస్కరించారు.

తెలుగులో కేసీఆర్.. ఇంగ్లీషులో ఉత్తమ్...

ఎమ్మెల్యేలుగా ప్రమాణం

- ఎంఐఎం నేత అక్బర్, బీజేపీ సభ్యుడు రాజాసింగ్ సహా మొత్తం ఐదుగురు గైర్హాజరు
- తెలుగులో 103, ఇంగ్లీషులో 8 మంది, ఉర్దూలో ముగ్గురు ప్రమాణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముందస్తు ఎన్నికల అనంతరం తెలంగాణ శాసనసభ గురువారం కొలువుదీరింది. ముఖ్యమంత్రి కేసీఆర్.. శాసనసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. 'కల్వకుంట్ల చంద్రశేఖరరావు అనే నేను...' అని తెలుగులో మొదలుపెట్టిన ఆయన దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు మొత్తం 115 మంది సభ్యులు ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. వీరిలో ఆంగ్లో ఇండియన్ సభ్యుడు ఎల్వీ స్టీఫెన్‌సన్ కూడా ఉన్నారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యే జాఫర్ అహ్మద్, గోషామహల్ నుంచి గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, సండ్ర వెంకటవీరయ్య (టీడీపీ), మాధవరం కృష్ణారావు



ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్

(టీఆర్ఎస్) ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. వీరందరూ వ్యక్తిగత కారణాల వల్ల గైర్హాజరయ్యారని సమాచారం.

తొలుత ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గురువారం నాటి సభా కార్యక్రమాలను, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని, ఆ క్రమంలో వారు పాటించాల్సిన నియమ నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులను ప్రొటెం స్పీకర్ చదివి వినిపించారు. అనంతరం శాసనసభ్యుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రమాణం చేశారు. ఆయన తర్వాత మహిళా సభ్యులైన అజ్మీరా రేఖానాయక్ (టీఆర్ఎస్), ధనసరి అనసూయ (సీతక్క-కాంగ్రెస్), గొంగిడి సునీత (టీఆర్ఎస్), బానోతు హరిప్రియ (కాంగ్రెస్), పద్మా దేవేందర్‌రెడ్డి (టీఆర్ఎస్), సబితా ఇంద్రారెడ్డి (కాంగ్రెస్)లతో ప్రమాణం చేయించారు. అనంతరం తెలుగు అక్షర క్రమంలో మిగతా వారితో ప్రమాణం చేయించారు. వీరిలో 103 మంది తెలుగులోనూ, 08 మంది ఇంగ్లీషులోనూ, ముగ్గురు ఉర్దూలోనూ ప్రమాణం చేశారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంగ్లీషులో ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ్యులుగా ప్రమాణం చేసిన తర్వాత ప్రతీ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం 1.45 గంటల వరకూ కొనసాగిన సభ.. శుక్రవారానికి వాయిదా పడింది.

వీల్‌ఛైర్‌లో సాయన్న...

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న (టీఆర్ఎస్) వీల్‌ఛైర్‌లో సభకు హాజరయ్యారు. కాలికి దెబ్బ తగలటంతో ఆయన ఈ విధంగా సభకు వచ్చారని తెలిసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం ...9లో



సీఎల్పీ నేతగా భట్టి?



నేడు సస్పెన్స్‌కు తెర 9లో

- ఎంపిక బాధ్యత రాహుల్‌దే...
- ఏకవాక్య తీర్మానం పంపిన నేతలు

అత్యంత సీనియర్ కేసీఆర్...

ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీఎం 9లో

- అత్యంత పెద్ద వయస్కుడు వనమా...పిన్న వయస్కురాలు బానోతు హరిప్రియ

అంతా మాఇష్టం

రెండేండ్లుగా ఆర్థిక నివేదికలు ఇవ్వని అమిత్ షా తనయుడి సంస్థ

- నివేదిక సమర్పించకుండా కొనసాగింపు..
- తమ వారికి ఒకలా.. ఇతరులకు మరోలా..!




న్యూఢిల్లీ: ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నివేదిక సమర్పించని కంపెనీలపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంసీఏ) కఠిన చర్యలు తీసుకునేందుకు పూనుకుంది. అయితే ఈ నిబంధన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కొడుకు జయ్ షా కంపెనీకి మాత్రం వర్తించకపోవడం గమనార్హం. ఎంసీఏ సమాచారం ప్రకారం.. కుసుమ్ ఫైన్‌సర్వ్ వరుసగా 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో ఆర్థిక నివేదికను అందించలేదని వెల్లడవుతున్నది. సాధారణంగా ప్రతియేడాది అక్టోబర్ 30 కల్లా కంపెనీలు, లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్(ఎల్ఎల్‌పీ)లు తమ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఒక వేళ ఈ నివేదిక సమర్పించడంలో విఫలమైతే ఎల్ఎల్‌పీ యాక్ట్ కింద రూ. 5లక్షల జరిమానా కట్టాల్సి ఉంటుంది. గతేడాది జూన్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఓ ప్రకటనలో.. ఎంసీఏ పర్యవేక్షణలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్(ఆర్ఓసీ).. ఈ నివేదిక సమర్పించని 2.26లక్షల కంపెనీలను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి తొలగించినట్టు వెల్లడించింది. ఈ ఎంసీఏ డ్రైవ్‌లో భాగంగానే ఆర్ఓసీ సుమారు మూడు లక్షల మంది డైరెక్టర్లపై అనర్హత వేటువేసినట్టు తెలిపింది. అంతేకాదు రెండో దఫా డ్రైవ్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపడుతున్నట్టు ఆ ప్రకటన వివరించింది. కాగా, నివేదిక సమర్పించని కంపెనీలపై బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధం కాగా.. కుసుమ్ ఫైన్‌సర్వ్ మాత్రం కీలకమైన ...9లో

బీజేపీ విరాళాల వాటా 93శాతం

జాతీయ పార్టీలన్నింటికి మొత్తం.469.89 కోట్లు

- బీజేపీకి రూ.437 కోట్లు, మిగతా పార్టీలకు రూ.33 కోట్లు
- కార్పొరేట్ల నుంచే అధిక మొత్తం: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని జాతీయ పార్టీల మొత్తం విరాళాల వాటా కన్నా బీజేపీకి 93 శాతం విరాళాల ఉన్నదని..ఇది 12 రెట్లు అధికమని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం(2017-18)లో బీజేపీకి అందిన విరాళాల మొత్తం రూ.437 కోట్ల 4 లక్షలు. కాగా,బీజేపీసహా జాతీయ పార్టీల విరాళాల మొత్తం 469 కోట్ల 89 లక్షలు అని ఏడీఆర్ తెలిపింది. అంటే మిగతా పార్టీలన్నిటికీ అందిన మొత్తం రూ.32.85 కోట్లు మాత్రమే. ఏటా ఎన్నికల కమిషన్‌కు జాతీయ పార్టీలు ఇచ్చే సమాచారం ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలను వెల్లడించింది. ఏడీఆర్ నివేదిక ప్రకారం కాంగ్రెస్‌కు రూ.26.658 కోట్లు, ఎన్సీపీకి రూ.2.087 కోట్లు, సీపీఐ(ఎం)కు



రూ.2.756 కోట్లు, సీపీఐకి రూ.1.146 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.20 లక్షల విరాళాలు అందాయి. రూ.20 వేలకుపైగా విరాళాలుగా అందిన వివరాలనే ఆయా పార్టీలు ఎన్నికల కమిషన్‌కు అందిస్తాయన్నది గమనార్హం. బీఎస్పీకి రూ.20 వేలకుపైగా విరాళాలు అందినట్టు రికార్డుల్లో లేదు. బీజేపీ, కాంగ్రెస్‌కు అధిక మొత్తంలో ...9లో

ఇరవై రోజుల్లోపే..

డీజిల్‌పై రూ. 2.31, పెట్రోల్‌పై రూ.1.94 పెంపు



న్యూఢిల్లీ: ఇంధన ధరలపై పెంపు కొనసాగుతూనే ఉంది. ఈనెల 10 నుంచి వరుసగా పెరుగుతున్న పెట్రో ఉత్పత్తుల ధరలు.. గురువారం కూడా అదే బాటలో కొనసాగాయి. ఈ ఏడాది ప్రారంభమైన ఇరవై రోజులలోపే లీటరు డీజిల్ ధరలు రూ. 2.31 పెరగగా, పెట్రోల్ దాదాపు రూ. 2 (రూ. 1.94 పైసలు) ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి పెరుగుదలను, మడి చమురు ఉత్పత్తుల ధరల పెంపును సాకుగా చూపుతూ మోడీ సర్కారు చమురు ఉత్పత్తుల ధరలను ఎడాపెడా పెంచుతోంది. దీని భారం ప్రత్యక్షంగా ప్రజలపై పడుతున్నా బీజేపీ సర్కారు పట్టించుకోవడం లేదు. ఎన్నికలు వేళ చమురు ఉత్పత్తుల ధరలు స్వల్పంగా తగ్గించి.. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఇలా పెంచడంపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉండగా, గురువారం దేశవ్యాప్తంగా పెట్రోల్‌పై రూ. 0.14, డీజిల్‌పై రూ. 0.20 పైసలు పెంచుతున్నట్టు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. సవరించిన ధరల ప్రకారం ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ. 70.47 లకు చేరింది. డీజిల్ రూ. 64.78గా ఉంది. ఇవే ధరలు హైదరాబాద్‌లో రూ. 74.76, రూ. 70.42 గా నమోదయ్యాయి. పెట్రోల్‌తో సమానంగా డీజిల్ ధరలు అంతకంతకూ పెరుగుతుండటంతో వాటి ప్రభావం నిత్యావసర వస్తువుల మీద పడి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీబీఐ నుంచి విమానయానశాఖకు...

రాకేశ్ ఆస్తానాతో సహా మరో ముగ్గురు అధికారులపైనా బదిలీ వేటు



న్యూఢిల్లీ: ఓ దర్యాప్తు విషయంలో లంచం తీసుకున్నట్టు ఆరోపణలున్న సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్తానాను పౌర విమానయాన శాఖ భద్రతా విభాగానికి బదిలీ చేశారు. సీబీఐలోని మరో ముగ్గురు అధికారులను కూడా వేరే శాఖల్లోకి బదిలీ చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. బదిలీ అయినవారిలో సీబీఐ జాయింట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీశ్‌కుమార్ సిన్హా, ఎస్పీ జయంత్ జె నైక్నావారే ఉన్నారు. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మపై ఆస్తానా ప్రత్యారోపణలు చేసిన నేపథ్యంలో వీరిద్దరినీ కేంద్ర ...9లో

హెచ్‌సీయూలో ఉద్రిక్తత

రోహిత్‌వేముల వర్ధంతి సభకు అంతరాయం

- వర్సిటీ గేటువద్ద ఖాకీల అడ్డగింత
- రోహిత్ తల్లి రాధికకు అనుమతి నిరాకరణ
- విద్యార్థుల ఆందోళనతో అనుమతి

వివరాలు 9లో



ప్రయివేటు బీమా కంపెనీలకు లాభాలు 3000 కోట్లు..

ఏడాదిలో పంటల బీమా పథకం కింద..

- ప్రభుత్వరంగబీమా కంపెనీలకు నష్టం 4000 కోట్లు : ఐఆర్‌డీఏఐ
- మోడీ పాలనలో అన్నదాత సొమ్ము కార్పొరేట్ల పాలు..



న్యూఢిల్లీ: పంటల బీమా పథకం అమలులో ఓవైపు ప్రభుత్వరంగ బీమా కంపెనీలు నష్టపోతుండగా, ప్రయివేట్ రంగ సంస్థలు వేల కోట్ల లాభాలను ఆర్జించినట్టు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) తన వార్షిక నివేదికలో వెల్లడించింది. 11 ప్రయివేట్ కంపెనీలు రైతుల పంట పొలాలకు ప్రీమియం కింద రూ.11,905 కోట్ల 89 లక్షలు సేకరించగా, నష్టపోయిన రైతులకు క్లెయిమ్‌ల ...9లో

మహిళలు ఉద్యోగాలు కోరుకోవడంలేదా?

కేంద్రమంత్రి వ్యాఖ్యల్లో నిజమెంత..



దేశంలో మహిళలు పనిచేయకూడదనుకుంటున్నారు. వాస్తవ ఉద్యోగ సంఖ్య నిరుత్సాహకరంగా ఉండటానికి అదొక కారణం..అయితే వారిని నిరుద్యోగులుగా మనం వర్గీకరించలేం.

\- కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్

మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ఏటా రెండుకోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకూ ఎన్ని ఉద్యోగాలిచ్చారు..ఎంతమందికి ఉపాధి కల్పించారో చెప్పలేకపోతున్నది. పార్లమెంట్ సాక్షిగా ఆ వివరాలు తమ వద్దలేవని బీజేపీ సర్కారులోని కేంద్రమంత్రులే ప్రకటించారు. వాస్తవానికి మోడీ అధికారపగ్గాలు చేపట్టాక.. ఉపాధి,ఉద్యోగ గణాంకాలను దాచిపెడుతున్నది. కోట్లాదిమంది రోడ్డునపడ్డారన్న ప్రభుత్వ,ప్రయివేటు సంస్థల అధ్యయనాలు వెల్లడవుతున్నా.. జవదేకర్ లాంటి మంత్రులు మహిళలు ఉద్యోగాలే కోరుకోవటంలేదంటూ తిమ్మినిబమ్మిని చేసేలా తెరపైకి వస్తున్నారు.

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కార్ రెండు ధోరణులు కనిపిస్తాయి. ఓ వర్గం మోడీని అహా ఓహా అంటుంది. మరోవర్గం బీజేపీ పాలనపై అసంతృప్తిగా ఉన్నట్టు మీడియా ముందుకు వస్తుంది. ఈ కోవలోకి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వస్తే..తాజాగా మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి జవదేకర్ అసంతృప్తిగా ఉన్నట్టు మాట్లాడటం గమనార్హం.. తమ ప్రభుత్వం అనేక మంచి పనులు చేస్తున్నప్పటికీ.. చెడు ప్రచారంవైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని తెగబాధ పడిపోతున్నారు.. ఉపాధి అంశాన్ని పరిశీలిస్తే.. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తున్నది. సీఐఐ నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో జవదేకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ...9లో





దేశరాజధాని రాజ్‌పథ్‌లో గురువారం జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల రిహార్సల్స్‌లో బ్రహ్మోస్ టీ-90 యుద్ధ టాంకులు

మూతపడిన చక్కెర మిల్లు భూములు పంచాలి

- ప్లాసీలో వేలాది రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రదర్శన

ప్లాసీ(పశ్చిమ బెంగాల్) : ప్లాసీ రైతాంగ డిమాండ్లను తుంగలో తొక్కే రీతిలో పారిశ్రామికవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని, మూతపడిన చక్కెర మిల్లు మిగులు భూములను పంచాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మికుల సంఘం (ఏఐఏడబ్ల్యుయూ) డిమాండ్ చేశాయి. ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యుయూ రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం 15వేల మందికి పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని లోక్‌నాథ్‌పూర్, రామ్‌నగర్ ఘాట్ నుంచి నాడియా-ముర్షిదాబాద్ జిల్లా సరిహద్దులోని ప్లాసీకి ర్యాలీ నిర్వహించారు. అనంతరం 34వ నెంబరు జాతీయ రహదారికి పక్కనే గల ప్లాసీ అలెయా హై మద్రసా గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు నృపేన్ చౌదరి ఈ సభకు అధ్యక్షత వహించారు. ఏఐకేఎస్ జాయింట్ సెక్రటరీ బిజూ కృష్ణన్, మరో నేత అమల్ హల్దార్, ఏఐఏడబ్ల్యుయూ అధ్యక్షులు తుషార్ ఘోష్, కార్యదర్శి అమియో పాత్రా ప్రసంగించారు. 34వ నెంబరు జాతీయ రహదారిపై 5 కిలోమీటర్ల పొడవునా సాగిన లాంగ్‌మార్చ్‌తో ఆ ప్రాంతమంగా అరుణారుణమైంది. పోలీసులు, ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞలను ధిక్కరించి మరీ ఈ ప్రదర్శనలో పాల్గొన్న ప్రజలు తమ నిరసనను తీవ్ర స్థాయిలో వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేబూని, సాంప్రదాయ గిరిజన నృత్యాలతో ఆద్యంతం ప్రదర్శన సాగింది. మూతపడిన చక్కెర మిల్లుకు చెందిన దాదాపు 7వేల ఎకరాల మిగులు భూములను రైతాంగానికి పంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మూత పడిన మిల్లును వెంటనే తెరవాలని, తమ 12 డిమాండ్లను వెంటనే అమోదించకపోతే ఆ మిగులు భూముల్లో అరుణ పతాకాలు ఎగురవేస్తామని ఏఐకేఎస్ అధ్యక్షుడు అమల్ హల్దార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మేఘాలయ కోల్‌మైన్‌లో మృతదేహం లభ్యం

- కొనసాగుతున్న గాలింపు చర్యలు

షిల్లాంగ్: మేఘాలయలో తూర్పు జాంతియా హిల్స్‌లోని ఒక అక్రమ బొగ్గు గనిలో గతనెల 13న చిక్కుకున్న 15మంది కార్మికుల్లో ఒకరి మృతదేహం ఆచూకీ లభించిందని భారత నేవీ వెల్లడించింది. ఈ మృతదేహాన్ని 160 నుంచి 210 అడుగుల లోతులో కనుగొన్నట్టు తెలిపింది. నీటితో నిండిపోయిన ఈ గని పై భాగం వరకు మృతదేహాన్ని తీసుకొచ్చారని, డాక్టర్ల సమక్షంలో వెలుపలికి తీసుకువస్తారని నేవీ అధికారులు వివరించారు. కాగా, మిగతా 14మంది గని కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్టు తెలిపారు. లుమ్థారి గ్రామంలోని బొగ్గుగనికి చెందిన గుహల్లోకి గతనెలలో లెయిటెన్ నది నీరు చేరడంతో గనిలో పనిచేస్తున్న 15మంది కార్మికులు చిక్కుకుపోయారు. దాదాపు 33రోజుల తర్వాత తాజాగా ఒక మృతదేహం ఆచూకీ లభించింది. స్థానిక కార్మికుల బృందం, ఎన్డీఆర్ఎఫ్, కోల్ ఇండియా, నేవీ ఇండియాలు సంయుక్తంగా వీరికోసం గాలింపు చర్యలు చేపడుతున్నాయి.

రాజకీయ 'సంకల్పం'తోనే 10 శాతం రిజర్వేషన్లు : ప్రధాని

అహ్మదాబాద్ : జనరల్ కేటగిరిలో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న 'రాజకీయ సంకల్పంతోనే తమ ప్రభుత్వం రాజ్యాంగ సవరణను చేపట్టిందని ప్రధాని మోడీ గురువారం అన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండే ఈ రిజర్వేషన్లు అమలుకానున్నాయని తెలిపారు. మొత్తం 900 యూనివర్సిటీ పరిధిలోని 40 వేల కళాశాలల్లో ఈ నూతన రిజర్వేషన్లను అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఇందుకోసం కళాశాల, విశ్వవిద్యాలయాల్లో 10 శాతం సీట్లను పెంచనున్నామని ఇక్కడి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవ సందర్భంగా మోడీ పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న సామాజిక రిజర్వేషన్లపై ప్రభావం పడకుండా ఆర్థిక రిజర్వేషన్లు ఇచ్చామని అంటూ అన్ని తరగతుల వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పుకొచ్చారు..

డ్యాన్సింగ్ బార్లపై ఆంక్షలు సడలించిన సుప్రీం

ముంబయి : డ్యాన్సింగ్ బార్‌లపై మహారాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను సుప్రీంకోర్టు సడలించింది. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనవసరంలేదని, అలాగే మద్యంను అనుమతించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. నిబంధనలు ఉండవచ్చు కాని పూర్తిస్థాయిలో నిషేధం విధించ కూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. మహిళల భద్రత చట్టం 2016 ప్రకారం సీసీటీవీల ఏర్పాటు, డాన్స్ ఫ్లోర్లను, బార్ రూమ్స్‌లను వేర్వేరుగా నిర్వహించాలంటూ గతంలో దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆంక్షలను వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎకె.సిక్రీతో కూడిన ధర్మాసనం డ్యాన్స్ బార్‌లను సాయంత్రం ఆరుగంటల నుండి 11 .30 గంటల వరకు అనుమతించవచ్చని, అలాగే మద్యాన్ని కూడా సరఫరా చేయవచ్చని పేర్కొంది.

కర్నాటక ఎన్నికల ప్రచారంలో రూ.122 కోట్లకు పైగా బీజేపీ ఖర్చు

- 'ఈశాన్యం'లో మరో 14 కోట్లు



న్యూఢిల్లీ: గతేడాది కర్నాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసింది. ఎన్నికల్లో ప్రచారం కోసమే ఏకంగా రూ. 122 కోట్లకు పైగా వెచ్చించింది. అలాగే ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, త్రిపుర, నాగలాండ్‌ల ఎన్నికల్లో ప్రచారాల్లో మరో 14 కోట్ల రూపాలయను ఆ పార్టీ ఉపయోగించింది. నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో ఖర్చు చేసిన వివరాలను ఈసీకి బీజేపీ ఇటీవల సమర్పించిన సమాచారం ఆధారంగా ఈ విషయం వెల్లడైంది.

గతేడాది మేలో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ రూ. 122.68 కోట్లను(ఇందులో రూ. 16 కోట్లు స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం కోసమే) ఖర్చు చేసింది. అలాగే గతేడాది మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీ చేసిన మొత్తం ఖర్చు రూ. 14.18 కోట్లుగా ఉన్నది. ఇందులో మేఘాలయలో రూ.3.8 కోట్లు, త్రిపురలో రూ.6.96 కోట్లు, నాగలాండ్‌లో రూ.3.36 కోట్లు ఖర్చు చేసింది. ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్లు, మీడియా, పబ్లిసిటీ, హెలికాప్టర్లు, ఎన్నికల సామాగ్రి, నాయకులు, అభ్యర్థుల రోడ్డుప్రయాణాలు వంటి ఇతర అవసరాలపై ఈ ఖర్చు చేసినట్టు ఈసీకి సమర్పించిన నివేదికలో బీజేపీ పేర్కొన్నది.

సర్కారుపై గళం విప్పితే దేశద్రోహమా?

అణచివేతలు పోరాటాన్ని ఆపలేవు : బృందా కరత్




నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కారుకు వ్యతిరేకంగా గళం విప్పితే దేశద్రోహం కేసులు బనాయిస్తున్న భయంకర పరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొన్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల సమయంలో మోడీ దేశ ప్రజానీకానికి ఇచ్చిన హామీల గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే... నిర్బంధాలు ఏంటని ప్రశ్నించారు. గురువారం జేఎన్‌యూలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సమావేశంలో బృందాకరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మోడీ పాలనలో రోజురోజుకి నిర్బంధం పెరిగిపోతోందని వివరించారు. జేఎన్‌యూలో మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఘటనకు తాజాగా అభియోగ పత్రం నమోదు చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చని మోడీ సర్కారు, దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ చర్యకు ఒడిగట్టిందన్నారు. జాతీయతను మరొకసారి చర్చనీయాంశం చేసి ఓట్లు రాజేసుకునేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత ఎవ్వరూ ఆనందంగా లేని దుస్థితి ఉందని వివరించారు. రాజ్యాంగ సంస్థలన్నీ ప్రణాళిక ప్రకారమే ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామిక నిర్ణయాలకు మోడీ తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తున్న జేఎన్‌యూ విద్యార్థులకు తమ పార్టీ తరపున సంఘీభావం ఉంటుందని హామీనిచ్చారు. సీపీఐ(ఎంఎల్) పొలిట్‌బ్యూరో సభ్యురాలు కవిత కృష్ణన్ మాట్లాడుతూ జేఎన్‌యూ విద్యార్థులు కన్నయ్య, ఉమర్, అనిర్బన్‌లపై కేంద్రం దేశద్రోహం కింద చార్జీషీట్ దాఖలు చేయడం హేయమైన చర్యని అభిప్రాయపడ్డారు. కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానంలో వాస్తవాలు బహిర్గతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మోడీ సర్కారును ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఇంతటి అరాచక పాలన దేశం ఎప్పుడూ చూడలేదని తెలిపారు. ఎమర్జెన్సీనే తిప్పికొట్టిన చరిత్ర భారత ప్రజానీకానికి ఉందని గుర్తు చేశారు. జేఎన్‌యూ ఎస్ఎఫ్ఐ స్టూడెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అజజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై కేసులతో బెదిరించడం దారుణమన్నారు. అయితే, మోడీ సర్కారు బెదిరింపులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. తమ యూనివర్సిటీ విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకునేవరకు పోరాటం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. తమ పోరాటానికి అన్ని పార్టీల మద్దతు కోరనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాభివృద్ధిపై

కేంద్రం వద్ద వాస్తవ సమాచారం లేదు

- ఎంఎం జోషీ నేతృత్వంలోని ప్యానెల్



న్యూఢిల్లీ: దేశంలో ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. దేశంలో ఉద్యోగాభివృద్ధిపై కేంద్రం వద్ద ఎలాంటి వాస్తవ సమాచారమూ లేదు. దీనిపై బీజేపీ అగ్రనాయకుడు మురళీ మనోహర్ జోషి నేతృత్వంలోని పార్లమెంటరీ ప్యానెల్.. తన నివేదికలో ఈ విషయాన్నే తెలియజేయనున్నది. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో కొత్తగా సృష్టించిన ఉద్యోగాలపై మోడీ ప్రభుత్వం వద్ద ఎలాంటి సమాచారం లేదని పేర్కొంటూ తన నివేదికకు తుది రూపు ఇవ్వనున్నది. కాగా,విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ నివేదికను లోక్‌సభ ముందు ప్రవేశపెట్టడానికి జోషి సిద్ధంగా ఉన్నారు. ఇదిలా ఉండగా ప్యానెల్‌పై అసంతృప్తిని వెళ్లగక్కుతూ కమిటీలోని ముగ్గురు బీజేపీ నాయకులు రాజీవ్ ప్రతాప్ రూఢీ(ఈయన కమిటీ ఏ సమావేశానికీ హాజరుకాలేదు), నిశికాంత్ దూబే, రమేశ్ బిధురీలు లేఖలు సమర్పించారు. భారత్‌లో ఉపాధిని అంచనా వేసే విశ్వసనీయతగల యంత్రాంగాలు లేవనడాన్ని వారు అంగీకరించలేదు. అంచనాల కమిటీ 'తన పరిధిని అధిగమిస్తోంది' అని వారు అన్నారు. ఈ లేఖలను నివేదికకు అనుబంధంగా లోక్‌సభ ముందుకు ప్రవేశపెట్టాలని జోషి నిర్ణయానికి వచ్చారు.

అయితే జోషి మాత్రం ఉద్యోగ సమాచార సేకరణపై సంప్రదాయక పద్ధతులనే కఠినంగా పాటించారు. ఇందులో నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్(ఎన్ఎస్ఎస్ఓ) బయటపెట్టే సమాచారాన్ని కూడా కమిటీ ఆశ్రయించింది. అయితే 2011-12 ఏడాది తర్వాత నుంచి కేంద్రం వద్ద ఎన్ఎస్ఎస్ఓ సమాచారం లేదు. ప్రతి ఐదేండ్లకోసారి నిర్వహించే ఎన్ఎస్ఎస్ఓ సర్వేను గతేడాది చివరనాటికి విడుదల చేస్తామని కేంద్రం తెలిపినప్పటికీ అది కూడా ఆలస్యమైంది. అలాగే ఆలిండియా యాన్యువల్ లేబర్ బ్యూరో సర్వేలను కూడా కేంద్రం అధికారికంగా విడుదల చేయలేదు. అయితే గతేడాది మీడియాకు లీక్ చేసిన ఈసర్వే సమాచారం మేరకు 2016-17లో నిరుద్యోగం నాలుగేండ్ల గరిష్టానికి చేరింది. ఈసర్వే సమాచారాన్ని మోడీ ప్రభుత్వం, కార్మిక శాఖలు పార్లమెంటరీ కమిటీకి అందించలేదు.

దీంతో ప్యానెల్ చైర్మెన్ జోషీ.. 2011-12 ఎన్ఎస్-ఎస్ఓ సర్వే అనంతరం ఉద్యోగాభివృద్ధిపై కేంద్రం వద్ద ఎలాంటి సమాచారం లేదని ముగింపునకు వచ్చారు. అలాగే ఈపీఎఫ్ఓల కొత్త రిజిస్ట్రేషన్లు పెరిగిపోవడాన్ని వాస్తవ ఉద్యోగాభివృద్ధిగా పరిగణించాలన్న మోడీ ప్రభుత్వ వాదనను ఆమోదించడానికి జోషి వ్యతిరేకించారు. ఇదిలా ఉండగా సార్వత్రిక ఎన్నికలకు ముందు జోషి ప్యానెల్ నివేదిక ద్వారా ఎదురయ్యే నష్టతీవ్రతను తగ్గించేందుకు బీజేపీ, కేంద్రం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

దాడుల నుంచి రక్షణ కల్పించండి

- సుప్రీంను ఆశ్రయించిన శబరిమలలోకి ప్రవేశించిన మహిళలు

న్యూఢిల్లీ : ఇటీవల శబరిమల ఆలయంలోకి వెళ్లి చరిత్ర సృష్టించిన ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందులు తమకు రక్షణ కల్పించాలంటూ సుప్రీంకోర్టును గురువారం ఆశ్రయించారు. తక్షణ విచారణ చేపట్టాలంటూ దాఖలైన ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణకు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గోగోయ్ అంగీకరించారు. దాడుల నుండి భద్రత కల్పించాలని, వారిని సురక్షితమైన రహస్య ప్రదేశంలో ఉంచాలని వారి తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు. వయస్సుకు సంబంధించిన ఆంక్షలతో పాటు అవరోధాలు లేకుండా ప్రతి మహిళ శబరిమల ఆలయంలోకి ప్రవేశించడానికి అనుమతినివ్వాలని, స్వేచ్ఛాయుతంగా, ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా భవిష్యత్తులో మహిళలు ఆలయంలోకి ప్రవేశించాలంటే తగిన భద్రత, పోలీసుల రక్షణ అవసరమని పిటిషన్‌లో పేర్కొన్నారు. దేవాలయాన్ని శుద్ధి చేయడం, మూసివేయడం వంటి చర్యలకు పాల్పడరాదని, అలా చేయడం వల్ల మహిళల గౌరవాన్ని, మత స్వేచ్ఛకు భంగం కలిగిందని, ప్రాథమిక హక్కులను ఆలయ నిర్వాహకులు ఉల్లంఘించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్ దారులైన ఇద్దరు మహిళల్లో ఒకరిపై సొంత ఇంటివారే దాడి చేయగా.. మరొకరు తన జీవితం ప్రమాదంలో ఉందని భయపడుతున్నారని న్యాయవాది జైసింగ్ అన్నారు.

డేరాబాబాకు జీవితఖైదు

- జర్నలిస్టు హత్య కేసులో శిక్ష ఖరారు చేసిన సీబీఐ కోర్టు

న్యూఢిల్లీ: జర్నలిస్టు రాంచంద్ర ఛత్రపతి హత్యకేసులో గుర్మీత్ రాం రహీమ్(డేరా బాబా)కు జీవితఖైదును హర్యానాలోని సీబీఐ కోర్టు గురువారం ఖరారు చేసింది. పూరా సచ్ అనే పత్రిక జర్నలిస్టు రాంచంద్ర ఛత్రపతిపై దాడి కేసులో అతనితో పాటు మరో ముగ్గురు నిందితులకు కోర్టు శిక్ష విధించింది. సిర్సా, హర్యానాల్లోని గుర్మీత్ రాం రహీమ్‌కు చెందిన ఆశ్రమాల్లో మహిళలపై జరిగిన లైంగికదాడులపై ఆయన సంచలన కథనాలు రాశారు. దీంతో రాంచంద్రపై 2002లో దాడికి దిగారు. అనంతరం ఆయన తీవ్రగాయాలతో మరణించారు. దీంతో గుర్మీత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని రాంచంద్ర కుటుంబ సభ్యులు హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2006లో ఈ కేసును సీబీఐకి కోర్టు బదిలీ చేసింది. ఈ కేసులో వాదనలు ముగియడంతో గుర్మీత్ తో పాటు నిర్మల్ సింగ్, కుల్‌దీప్ సింగ్, కిషన్‌లాల్‌లకు శిక్ష విధించింది.

'కతువా ఘటన'కు ఏడాది..

- బాధిత కుటుంబం సామాజిక వెలివేత
- భయం భయంగా జీవనం
- కొనసాగుతున్న కేసు విచారణ



శ్రీనగర్: దేశాన్ని ఒక కుదుపు కుదిపిన కతువా లైంగికదాడి ఘటనకు ఏడాది నిండింది. జమ్మూకాశ్మీర్‌లోని కతువాలో లైంగికదాడి, హత్యకు గురైన ఎనిమిదేండ్ల బాలిక మృతదేహం గతేడాది జనవరి 17న లభించింది. అనంతరం దేశంలోని అన్నివర్గాల నుంచి పెద్దఎత్తున ప్రజలు ఏకమై బాలిక కుంటుంబానికి న్యాయం జరగాలని రోడ్లనెక్కారు. జాతీయ, అంతర్జాతీయ సమాజం ఈ ఘటనను ఖండించింది. అయితే ఈ ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా.. ఆ చిన్నారి కుంటుంబం ఇప్పటికీ భయాందోళనల్లోనే ఉన్నది. కతువాలోని రసాన గ్రామంలో నివసిస్తున్న బకర్వాల్ తెగకు చెందిన ఆ కుటుంబం ఒంటరితనాన్ని, ఒకరకమైన సామాజిక వెలివేతను అనుభవిస్తున్నది. ఇరుగు పొరుగు తమతో మాట్లాడటం కాదు కదా.. కనీసం కన్నెత్తి కూడా చూడట్లేదని వివరిస్తున్నారు. పోలీసు పోస్టును ఏర్పాటుచేసినా తాము అభద్రతా భావానికి లోనవుతున్నామని అంటున్నారు. హిందు మెజార్టీ ఏరియాలో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం.. తమ పశువులకు మేత తీసుకురావడం కూడా పెద్ద సవాలుగా మారిందని చెబుతుండటం వారి పరిస్థితిని వివరిస్తున్నది. 'నిత్యావసర వస్తువులను అమ్మడానికి పొరుగువారు నిరాకరిస్తున్నారు. ఏది కొనాలన్నా.. కోటా గ్రామానికి వెళ్తున్నామ'ని చెప్పారు నిస్సహాయంగా.

ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో విచారణ జరుగుతుం దని హామీనిచ్చినా.. కేసు విచారణలో తీవ్ర జాప్యం నెల కొంటున్నదని ఆ చిన్నారి తండ్రి తెలిపారు. '90 రోజుల్లో తమకు న్యాయం జరుగుతుందని చెప్పారు. నేటికి ఏడా ది గడిచింద'ని గుర్తు చేశారు. కోర్టులో ఏం జరుగు తుందో ఎవరికి తెలుసు అని అన్నారు. అయితే వారిని ఎక్కువగా భయపెట్టే విషయం ఏమిటంటే.. ఈ కేసులో తీర్పు కంటే ముందే నిందితులు ఎక్కడ విడు దలవుతారోనని ఆందోళన చెందుతున్నారు. 'కేసులోని నిందితులు విడుదలవుతారు. వారు మిమ్మల్ని వదిలిపెట్టబోరని కొందరు చెబుతున్నార'ని చిన్నారి తల్లి భయం భయంగా చెప్పారు. ఏడాది క్రితం హిందు మెజార్టీ ప్రాంతం నుంచి ముస్లిం కమ్యూనిటీకి చెందినవారిని వెళ్లగొట్టేందుకు ఎనిమిదేండ్ల చిన్నారిని అపహరించి, ఓ గుడిలో బంధించి, లైంగికదాడికి పాల్పడి హత్య చేసినట్టు తేలడంతో దేశప్రజానీకం విస్మయానికి గురైన సంగతి తెలిసిందే. కాగా, ఆ నిందితులకు మద్దతుగా హిందుత్వవాదులు, అప్పటి బీజేపీ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇద్దరు మంత్రులు ర్యాలీలో పాల్గొన్నదీ విదితమే. వీరిపై చార్జిషీటు దాఖలు చేయడాన్ని అడ్డుకునేందుకు దర్యాప్తు అధికారులను కోర్టుకు హాజరుకాకుండా కతువా న్యాయవాదులు అడ్డుకోవడమూ తెలిసిందే. కాగా, ఈ కేసు దర్యాప్తు.. ఎలాంటి ఒత్తిడికిలోను కాబోదని, ఈ కేసు దర్యాప్తును జమ్మూకాశ్మీర్ హైకోర్టు, సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తున్నదని క్రైం బ్రాంచ్ తెలిపింది.

అమెరికా కంపెనీలకు భారత్ ప్రయోగశాల

- యూఎస్ నిపుణులు

హోస్టన్ : 'అమెరికా కంపెనీలకు భారత్ ఒక ప్రయోగశాలగా మారింది' ఈ వ్యాఖ్యలను భారత్‌కు చెందిన ఏ ఆర్థిక వేత్త లేదా.. ఏ రాజకీయ వేత్తో చేయలేదు. అమెరికాకు చెందిన నిపుణుడే ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఇటీవల 3వ ఐసీసీఆర్-హోస్టన్ ఇండియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రపంచబ్యాంక్ సలహాదారుడు, పెన్సిల్వేనియా యునివర్సిటీ అధ్యాపకులు డిజోర్జజిజా పెట్‌కోసక్ మాట్లాడుతూ అమెరికా కంపెనీలకు భారత్ ఒక ప్రయోగశాలగా మారిందని తెలిపారు. అలాగే అమెరికా కంపెనీలు కేవలం తమ ఉనికిని చాటుకోవడానికి మాత్రమే కాకుండా.. తమ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, తమ మోసపూరితమైన సాంకేతికను ఉపయోగించుకోవడానికి భారతదేశాన్ని వినియోగించుకుంటున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో భారత్-అమెరికాకు చెందిన పారిశ్రామిక రంగ ప్రతినిధులతో పాటు ఇరుదేశాల నుంచి పలువురు ఉన్నతస్థాయి అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రధాన సలహాదారుడు సంజీవ్ సంయాల్ మాట్లాడుతూ నూతన భారత్ నిర్మాణానికి పిలుపు ఇచ్చారు. చట్టానికి లోబడి ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక ఆవిష్కరణలు జరగాలని తెలిపారు. భారత్‌లో ఆర్థిక ప్రాథమిక అంశాలు చాలా బలంగా ఉన్నాయని, సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి పథంలోకి సాగుతోందని అన్నారు. ఈ సమావేశంలో భారత్-అమెరికా మధ్య ఆర్థిక బంధాన్ని మరింత విస్తరించడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. డిజిటల్ పేమెంట్స్, ఈ-కామర్స్- స్టార్టప్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టడంపైనా చర్చించారు.

పంజాబ్‌లో మూడో ఫ్రంట్ : ఆర్మీ మాజీ చీఫ్

చండీగఢ్ : రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసేలా నిర్ణయాత్మక శక్తిగా - 'పంజాబ్ డెమోక్రటిక్ అలయన్స్' పేరుతో మూడవ ఫ్రంట్ ఏర్పాటు చేయనున్నట్టు ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ జెజె సింగ్ గురువారం తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్‌పై పోటీ చేసిన ఆయన మరోసారి రాజకీయాలలో కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నానని, ఇది చారిత్రాత్మకమౌతుందని సింగ్ పేర్కొన్నారు. తాను కూడా ఇదే ఫ్రంట్‌లో కొనసాగనున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల శిరోమణి అకాలీ దళ్‌కు సింగ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. భవిష్యత్ ప్రణాళికల కోసం పలువురు మేధావులతో తాము చర్చించనున్నట్టు సింగ్ తెలిపారు.

మీకు నచ్చకుంటే వెళ్లిపోండి

- శత్రుఘ్న సిన్హాకు తేల్చి చెప్పిన బీజేపీ



పాట్నా: బీజేపీ ఎంపీగా ఉండి మోడీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్న వెటరన్ నటుడు, పాట్నా ఎంపీ శత్రుఘ్న సిన్హాపై వేటు వేసేందుకు ఆ పార్టీ రంగం సిద్ధం చేసింది. ఆయనకు నచ్చకుంటే బీజేపీ నుంచి వెళ్లిపోవాలని సూచించింది. ఈ మేరకు బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం పాట్నాలోని ఓ కార్యక్రమానికి హాజరైన సుశీల్ మాట్లాడుతూ.. 'కొన్ని రోజులుగా ఆయన తీరేం బాగాలేదు. పదే పదే బీజేపీని టార్గెట్ చేస్తున్నారు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. బీజేపీ ఆయనకు చాలా గౌరవమిచ్చింది. ఆయనకు నచ్చకుంటే పార్టీ నుంచి వెళ్లిపోవచ్చు' అని శత్రుఘ్న సిన్హాను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా మాటలకు ప్రభావితమై ఆయన ఈ విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. అంతేగాక, గత ఎన్నికలలో ఆయన విజయానికి బీజేపీ కృషి చేసిందని.. తన పాపులారిటీపై నమ్మకం ఉంటే మరోసారి ఇక్కడి నుంచి పోటీ చేసి గెలవాలని సిన్హాకు సవాల్ విసిరారు. పార్టీ ఆదేశిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికలలో పాట్నా నుంచి పోటీ చేస్తానని తెలిపారు. సిన్హా... రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారని బీజేపీ కొంతకాలంగా ఆరోపిస్తున్నది. దీంతోపాటు ఆయన లాలూ ప్రసాద్ యాదవ్‌ను పలుమార్లు కలవడం, రాహుల్ గాంధీని పొగడడాన్నీ బీజేపీ జీర్ణించుకోలేకపోతోంది. కాగా, మోడీ సర్కారు తీసుకున్న పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, పెట్రో ధరల పెంపు, రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం, విజయ్ మాల్యా పరారీ వంటి పలు అంశాలపై సిన్హా పలుసార్లు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడిన విషయం విదితమే.

గాంధీ శాంతి బహుమతుల ప్రకటన

- నాలుగేండ్ల తర్వాత కేంద్రం ప్రకటన



న్యూఢిల్లీ: నాలుగేండ్లకు గానూ మహాత్మా గాంధీ శాంతి బహుమతులను కేంద్రం బుధవారం ప్రకటించింది. ఈ మేరకు 2015 నుంచి గతేడాది వరకు శాంతి బహుమతులు పొందిన వ్యక్తుల, సంస్థల పేర్లను విడుదల చేసింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సేవలందిస్తూ గాంధేయ వాద విధానాలను అనుసరిస్తున్న వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రధానం చేస్తున్నారు. 2015కు గానూ కన్యాకుమారికి చెందిన వివేకానంద కేంద్రానికి ఈ అవార్డు దక్కింది. గ్రామీణ అభివృద్ధి, విద్య వంటి రంగాలలో ఈ సంస్థ సేవలందిస్తోంది. దేశంలోని పేద పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్, పారిశుధ్య రంగంలో విశేష సేవలందిస్తున్న సులభ్ ఇంటర్నేషనల్‌లు సంయుక్తంగా 2016 గాంధీ శాంతి బహుమతికి ఎంపికయ్యాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాలలోని చిన్నారులకు ఉచిత విద్యనందిస్తున్న 'ఎకై అభియాన్ ట్రస్ట్'కు 2017కు గానూ అవార్డు దక్కింది. కుష్టు వ్యాధి నిర్మూలన కోసం పాటుపడుతున్న యొహేయి ససకవా 2018 గాంధీ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. జపాన్‌కు చెందిన ససకవా.. కుష్టు వ్యాధి నిర్మూలనకు డబ్ల్యూహెచ్‌వో తరఫున బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నారు. కాగా, గాంధీ 125వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 1995 నుంచి కేంద్రం ఆయా రంగాలలో విశేష సేవలందించిన వ్యక్తులకు, సంస్థలకు ఈ అవార్డులను ప్రధానం చేస్తోంది.

కేరళ ప్రభుత్వంపై మోడీ అక్కసు బహిర్గతం

- మోడీ శబరిమల వ్యాఖ్యలపై సీపీఐ కార్యదర్శి నారాయణ ఆగ్రహం



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యయుతంగా సాగుతున్న కేరళ ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోడీ మరోసారి అక్కసు వెల్లగక్కారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శబరిమల ఘటనకు సంబంధించి ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తుంటే తప్పు పడతారా అని నిలదీశారు.

ఇటీవల కేరళ పర్యటనకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కమ్యూనిస్టులకు సంస్కృతి తెలియదంటూ వ్యాఖ్యానించడాన్ని ఆయన ఖండించారు. ప్రధాని స్థాయి వ్యక్తి అర్థం లేని భాష మాట్లాడటం బాధాకరమన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించమని దేశానికి మోడీ సంకేతమిస్తున్నారా? అని ప్రశ్నించారు. శబరిమలలోకి మహిళల ప్రవేశంపై విమర్శలు చేస్తున్నారంటే మహిళలకు సమాన హక్కులు ఇవ్వడం తప్పా అని అడిగారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ, పార్లమెంటుకు సంఘర్షణ తలెత్తే విధంగా ఉన్నాయని అన్నారు. భారత్ వంటి లౌకిక దేశంలో అటువంటి వ్యాఖ్యలు చేయడం హానికరం అన్నారు. మహారాష్ట్ర శని సింగాపూర్‌లోని శనీశ్వరుడి ఆలయ ప్రవేశానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మాట్లాడని వారు కేరళలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తుంటే వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు.

ధర్మాసనం ఆదేశాలను అమలు చేయకపోతే కమ్యూనిస్టులకు రాజ్యాంగ వ్యవస్థ మీద నమ్మకం లేదని, ఆ ప్రభుత్వాన్ని రద్దు చేయమని డిమాండ్ చేస్తారని, అమలు చేస్తుంటే అవకాశవాదం, సంస్కృతికి వ్యతిరేకం అంటూ ఆరోపణలు చేస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రికి శబరిమల మీద ప్రేమ మర్యాద ఏమాత్రం లేదని, ఆయన భక్తి అంతా కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టడం మీదేనని నారాయణ ఘాటుగా స్పందించారు. నరేంద్ర మోడీ గుజరాత్‌లోని ఓ మున్సిపాలిటీ కమిషనర్‌లా మాట్లాడుతున్నారే తప్ప ప్రధానమంత్రిలా మాట్లాడట్లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రధాని తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అరబ్ దేశాలకు..

వలస వెళ్లిన రైతులను రక్షించండి

ప్రభుత్వానికి సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బతుకుదెరువు కోసం అరబ్ దేశాలకు వలస వెళ్లిన రైతులను రక్షించాలని సీపీఐ (ఎం) ప్రభుత్వానికి విజ్ఞపి చేసింది. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టి వారిని దేశానికి తీసుకువచ్చి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం నుంచి వేలాది మంది ఉపాధి కోసం వలసలు పోతున్నవారి సంఖ్య పెరుగుతున్నదని పేర్కొన్నారు. రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఆమోదించిన ఏజెంట్లతో వలసలు వెళ్లినవారు కొంత ఆర్థికంగా మెరుగుపడటంతో స్థానికంగా ఉపాధి లేకపోవడం, అప్పుల పాలు కావడంతో విదేశాలకు వలస వెళ్లాలన్న మోజు పెరిగిందన్నారు. కరీంనగర్ పశ్చిమ ప్రాంతం, మెదక్ జిల్లాలోని సిద్దిపేట, జనగామ జిల్లాల్లో నీటి వనరులు లేక, పంటలు లేక అరబ్ దేశాలకు వెళ్లాలన్న ఆలోచన ప్రజల్లో నెలకొందని చెప్పారు. దీనిని అవకాశంగా తీసుకుని ప్రభుత్వ లైసెన్స్ పొందని వారు ఏజెంట్ల అవతారం ఎత్తి లక్షల్లో ఆదాయం వస్తుందంటూ ఆశలు కల్పించి రైతుల వద్ద నుంచి రూ.20 నుంచి 30లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. సరైన వీసాలు లేకుండానే వారికి అరబ్ దేశాలకు పంపిస్తున్నారని, ఇది ప్రభుత్వానికి తెలియనిదేమి కాదని గుర్తు చేశారు.

ఆస్తులు తాకట్టు

ఏజెంట్ల భ్రమల్లో పడ్డ ఆయా కుటుంబాలు తమ ఆస్తులను తాకట్టు పెట్టడం, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఏజెంట్లకు అప్ప జెప్పుతున్నారు. విదేశాలకు వెళ్లిన తర్వాత తాము మోస పోయినట్టు గుర్తి స్తున్నారు. మరికొందరిని స్వదేశంలోనే రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ విదేశాలకు పంప కుండానే ఏజెంట్లు డబ్బులు కాజేస్తున్నారని వివరించారు. ఈ విషయంపై నిలదీస్తే వారిని చిత్రహింసలకు గురి చేస్తున్నారని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లిన వారు సరైన వీసా లేని కారణంగా అక్కడ జైళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడు తున్నదని తెలిపారు. బాధితులు అక్కడి నుంచి ఇక్కడి విదేశాంగ శాఖకు తమ గోడు వెళ్లబోసుకున్నా ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదన్నారు. వలసలు వెళ్లిన వారి సమస్యలు వెంటనే పరిష్కరి స్తామని



టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న వాగ్దానాలు పత్రికల్లో వస్తున్నప్పటికీ ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ నుంచి ఎంతమంది కూలి పనికి అరబ్ దేశాలకు వెళ్లారో సమగ్ర సమాచారాన్ని సేకరించి, అక్కడి నుంచి వారిని స్వదేశానికి రప్పించాలని, అక్రమ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐఎంఓలో ప్రతిభ చాటిన నారాయణ

హైదరాబాద్: సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఢిల్లీ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్(ఐఎంఓ) ఎగ్జామ్ 2018-19 మొదటి దశ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు తమ సత్తా చాటారు.14 దేశాల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో 3,4,5,6 తరగతుల్లో అంతర్జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంతో పాటు 10లోపు ర్యాంకుల్లో 2633 ర్యాంకులు తమ విద్యార్థులే స్వాధీనం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. అదేవిధంగా టాప్50 ర్యాంకుల్లో 5888 ర్యాంకులు, టాప్ 100 ర్యాంకుల్లో 7673 తమవే కావటం ఎంతో గర్వకారణంగా ఉందని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా. సింధూర నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ...ఇంటిగ్రేటెడ్ సిలబస్ తోపాటు విశ్లేషణాత్మకంగా బోధించే ఉపాధ్యాయులు, అనుభవజ్ఞులచే రూపొందించిన స్టడీ మెటీరియల్స్ తమ విజయాల్లో కీలక భూమిక పోషిస్తోందన్నారు. ఏ పోటీపరీక్ష నిర్వహించిన అత్యుత్తమ ప్రతిభ కనబరచడానికి తమ విద్యాసంస్థల సుపీరియర్ ప్లానింగ్, సూపర్లేటివ్ టీచింగే కారణమన్నారు. ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

అంతరాష్ట్ర బదిలీల గడువు పొడిగింపు

- తెలుగు రాష్ట్రాల సీఎస్‌లు ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగుల అంతరాష్ట్ర బదిలీల కోసం రెండు తెలుగు రాష్ట్రా లు గడువు పొడిగించాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు గడువు పొడిగిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు గురువారం ఉత్త ర్వులు జారీ చేశాయి. గతంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికే పొడిగించిన గడువు వర్తిస్తుందని ఇద్దరు సీఎస్‌లు స్పష్టం చేశారు. జూన్ నెలాఖరు వరకు అంతరాష్ట్ర బదిలీలను పూర్తి చేయాలని ఆదేశించారు.

కౌలు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-యాచారం

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ మధుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దొడ్డి మల్లేశ్(41) మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. సాగు కోసం రూ.3లక్షల వరకు అప్పులు అయ్యాయి. పంట దిగుబడి సరిగా లేక, పెట్టుబడి ఎల్లలేదు. అప్పులు తీర్చే మార్గం లేక మన స్తాపానికి గురైన మల్లేశ్ వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. రైతుకు ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

పంచాయతీలు ఏకగ్రీవం

నవతెలంగాణ - విలేకరులు

సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో నూతనంగా ఏర్పడ్డ గిరాయిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాశపురం సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో పిచెరగడి తండా, కొత్తూర్ (కె)రఘురాసంగం మండలంలో బొరెగావ్, గంగాపూర్ గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో రాంరెడ్డిపల్లి, చిన్న ముద్దునూర్, తాడూర్ మండలంలో లచ్చిరాం తండా, అంతరం, వెల్దండ మండలంలో కేస్లీ తండా, శంకర బండ తాండ, ఎంజీ కాలనీతండా, సీలోనిబావి తండా, చారకొండ మండలంలో బైరాంతండా, రాంచంద్రాపురం, శాంతిగూడెం, కమాల్‌పూర్‌తండా, శేరిఅప్పారెడ్డిపల్లి, మర్రి పల్లి తండా, కల్వకుర్తిలో లింగాసానిపల్లి, తుర్కపల్లి, వెంకటాపూర్‌తండా, తర్నికల్ తండా, ఊర్కొండ మండలంలో బాల్యాలోక్యా తండా ఏకగ్రీవమయ్యాయి.వనపర్తి జిల్లాలో అమరచింత, ఆత్మకూర్ మండలంలో నందిమల్ల ఎక్స్‌రోడ్, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి, మిట్ట నందిమల్ల, ధర్మాపూర్, కిష్టంపల్లి, పామిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కొత్తకోట మండలంలో ముమ్మళ్ళపల్లి, సత్యహళ్లి, విలియంకొండ, పాలెం ఏకగ్రీవమైంది. మదనాపురం మండలంలో శంకరమ్మపేట, కొన్నూరు పెద్ద తాండ, నెల్విడి, గోపాన్‌పేట గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. పెద్దమందడి మండలంలో మంగంపల్లి, మనిగిల్ల, స్కూల్ తండా, ముందరి తండా ప్రజలు సర్పంచులు, వార్డు సభ్యుల ఏకగ్రీవానికి మొగ్గు చూపారు. గద్వాల జిల్లా అయిజలో కొత్తపల్లి, కుర్వపల్లి, కిష్టాపురం, నౌరోజీక్యాంపు, గుడిదొడ్డి, మల్దకల్ మండలంలో మేకల తొంపల్లి, మంగంపేట, అడవి రావులచెరువు, నెతాన్‌పల్లి, బులిగెపల్లి, మద్దెలబండ, వడ్డెపల్లిలో తిమ్మాజిపల్లి, వెంకట్రామనగర్, రాజోలిలో పి.గార్లపాడు ఏకగ్రీవమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 55 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఆంధ్రాలో టీడీపీ, కాంగ్రెస్ ఓటమి ఖాయం


- ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-క్లాక్‌టవర్

తెలంగాణలో ప్రజలు టీడీపీ, కాంగ్రెస్‌లను ఎలా ఓడించారో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్తారని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని తన నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌లో భాగంగానే వైఎస్ఆర్‌సీపీ నేత జగన్‌ను కలిశారన్నారు. జగన్‌కు వస్తున్న ప్రజాధరణ చూడలేకనే టీఆర్ఎస్‌తో పొత్తు అంటూ టీడీపీ విషప్రచారం చేస్తోందన్నారు. టీడీపీ నేతలకు మతిభ్రమించిందని విమర్శించారు. బీజేపీతో నాలుగేండ్లు సంసారం చేసి ప్రస్తుతం టీడీపీ నేతలు శ్రీరంగ నీతులు చెబుతున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు రాష్ట్ర ప్రజల బాగోగుల గురించే నిరంతరం ఆలోచిస్తారన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక పథకాలు ప్రవేశపెట్టనున్నారన్నారు. ఈ సమావేశంలో తిప్పర్తి ఎంపీపీ పాశం రాంరెడ్డి, నల్లగొండ ఎంపీపీ దైద రజిత, మున్సిపల్ మాజీ చైర్మన్ పుల్లెంల వెంకటనారాయణగౌడ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

నూరేండ్ల అమరత్వం



వందేండ్ల క్రితం1919 జనవరి15న బెర్లిన్‌లో ఇద్దరు కమ్యూనిస్టు విప్లవ యోధులు హత్యకు గురయ్యారు. పర్యవసానంరీత్యా చూసినప్పుడు ప్రపంచ చరిత్రలో జరిగిన భయంకరమైన హత్యలలో అవి కూడా ఉంటాయి. ఆ రోజు సైనికులు అంతకు రెండు వారాల ముందే స్థాపించ బడిన జర్మన్ కమ్యూనిస్టు పార్టీ(కేపీడి) నాయకులైన రోజా లక్సెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్‌లను అరెస్టు చేశారు. 48సంవత్స రాల రోజా లక్సెంబర్గ్ ఆ శకంలో అత్యం త ప్రతిభావంతురాలైన మార్క్సిస్టు విప్లవకారిణి. ఎడ్వర్డ్ బెర్న్‌స్టైన్ రివిజని జాన్ని, సోషల్ డెమోక్రాట్ల మొదటి ప్రపంచ యుద్ధ అనుకూల విధానాలను సైద్ధాంతికంగా ఆమె చీల్చిచెండాడిన తీరుతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులకు ప్రీతిపాత్రమైంది. ఎస్‌పిడి విప్లవ విభాగానికి, ఆ తరువాత స్పార్టకస్ లీగ్ కి ఆమె తిరుగులేని సైద్ధాంతికవేత్త అయింది. జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఎస్‌పీడీ నిర్మాతయైన విల్‌హెల్మ్ లీబ్‌నెక్ట్ తనయుడే కార్ల్ లీబ్‌నెక్ట్. ఆయన, రోజా సమవయస్కులు. వీరిద్దరూ యుద్ధోన్మాదంమీదా, మిలిటరిజంమీదా రాజీలేని పోరాటం చేశారు. అత్యంత అణచివేత ఉన్నప్పటికీ ఎస్‌పీడీ పార్లమెంట్ సభ్యుడిగా యుద్ధాన్ని వ్యతిరేకించి, యుద్ధ పద్దులను తిరస్క రించటం ద్వారా తన పార్టీమీదనే కార్ల్ లీబ్‌నెక్ట్ నిశ్చయాత్మకమైన పోరాటం చేసి కోట్లాది కార్మికుల మన్ననలను పొందాడు. 1918లో జర్మనీలో సంభవించిన నవంబరు విప్లవంలో ఆయన పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటానికి పోరాటం చేశాడు. నవంబరు 9వ తేదీన ఒక ప్రజా ప్రదర్శన ముందు ఆయన ఫ్రీ సోషలిస్టు రిపబ్లిక్ ఆఫ్ జర్మనీని ప్రకటించాడు. అరెస్టు అయిన తరువాత రోజాను సైనికులు హోటల్ ఈడెన్‌కు తీసికెళ్ళారు. ఆ హెూటల్ రిసెప్షన్ హాలులో రైఫిల్ మడిమతో మోదటంతో బక్కపలచగా ఉండే రోజా కుప్పకూలింది. అలా పడిపోయిన రోజా ను ఒక కారులోకి తీసుకొచ్చి కాల్చి చంపారు. ఆ తరు వాత ఆమె మృతదేహాన్ని లాండ్‌వేర్ కాలువలోకి విసిరి వేశారు. అలా విసిరివేయబడిన ఆ విప్లవకారిణి మృతదేహాన్ని నెలల తరువాత బయటకు తీయటం జరిగింది. అలాగే కార్ల్ లీబ్‌నెక్ట్‌ని టియర్‌గార్టెన్ పార్క్‌లో సమీపంలోనుంచి మూడుసార్లు కాల్చి చంపారు. పారిపోతున్న కార్ల్ లీబ్‌నెక్ట్‌ని కాల్చిచంపటం జరిగిందని, రోజాను కోపోద్రిక్తులైన ప్రజాసమూహం తొక్కి చంపిందని మీడియాలో వార్తలు వచ్చాయి. రోజా, లీబ్‌నెక్ట్‌ల కిరాతక హత్యలతో ప్రతీఘాత విప్లవ హింస ఒక నూతనదశకు చేరుకుంది. అంతకు ముందు 1871లో పారిస్ కమ్యూన్ పరాజయం తరువాత జరిగినట్టుగా బూర్జువా రాజ్యం సోషలిస్టులను, విప్లవకారులైన కార్మికులను సామూహికంగా హత్యలు చేసింది. అయితే ఒక విప్లవ పార్టీ నాయకులను ఎటువంటి విచారణ లేకుండా, కోర్టు తీర్పు లేకుండా రాజ్యాంగయంత్రాంగం హత్య చేయటం సరికొత్త విషయం. తరువాత ఇతరులు దీనిని ఉదాహరణగా తీసుకుని అనుసరించారు. రష్యాలో జారిస్టు నియంతలు కూడా సోషలిస్టులను సాధారణంగా సైబీరియాకు ప్రవాసం పంపేవారు. అయితే రష్యాలో విప్లవం విజయం సాధించటంలో కర్తృత్వ కారకాలయిన లెనిన్ పాత్ర, బోల్షివిక్ పార్టీ పటిమలు ప్రధాన పాత్రవహించాయని జర్మన్ పాలకవర్గం గ్రహించింది. రష్యాలోవలే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటానికి నవంబరులో జర్మనీ వ్యాప్తంగా చెలరేగిన విప్లవ జ్వాలలను ఆర్పటానికి రోజా, లీబ్‌రెక్ట్‌లను హతమార్చాలని జర్మన్ పాలకవర్గం భావించింది. విప్లవ ప్రభావంతో హెూహెన్‌జోల్లర్న్ పాలన అంతమైంది. అయితే ఆ పాలనకు సామాజిక పునాదిగా ఉన్న పారిశ్రామిక, ద్రవ్య పెట్టుబడిదారులు, బడా భూస్వాములు, మిలిటరీ, ప్రగతి నిరోధక న్యాయవ్యవస్థ, పోలీసు, పాలనా యంత్రాంగం అంతా తమ సామాజిక అంతస్తును రక్షించుకోవటానికి కృతనిశ్చయులై ఉన్నారు. అందుకోసం ఎస్‌పీడీ నాయకుడైన ఫ్రెడ్రిక్ ఎబర్ట్‌తో 1918వ సంవత్సరం నవంబరు 9వ తేదీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించారు. ఆ తరువాత విప్లవాన్ని అణచివేయటానికి ఎబర్ట్ సైన్యంతో మిలాఖత్ అయ్యాడు. ఆ విధంగా మొదటి విప్లవ కెరటం క్రూరంగా అణచివేయబడింది. అయితే అది ఏ వర్గం పరిపాలించాలనే విషయాన్ని తేల్చలేకపోయింది.

రోజా లక్జెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్‌లు హతులైన తరువాత వందేండ్లకు కూడా అంతర్జా తీయ సంబంధాలలో జాతీయ వాదం, వాణిజ్య యుద్ధాలు, యుద్ధాల రూపంలో హింస ఎక్కువ అయింది. అనేక దేశాలలో మితవాద, ఫాసిస్టు శక్తులు విజృంభిస్తున్నాయి. ఇది రోజా, లీబ్‌నెక్ట్‌ల త్యాగమయ జీవితాల ప్రాసంగితను తెలియజేస్తుంది.

ఎస్‌పీడీ ద్రోహాన్ని అధిగమించటానికి 1919 ఆరంభంలో కేపీడీని స్థాపించటం జరిగింది. ఆ పార్టీ కార్యక్రమాన్ని రోజా లక్సెంబర్గ్ రూపొందించింది. బూర్జువావర్గ పాలనను అంతమొందించటమే కార్యక్రమంగా కేపీడీని నిర్మించటం జరిగింది. మనముందున్న ప్రత్యామ్నాయం సంస్కరణా లేక విప్లవమా అన్నది కాదు. మనం తెల్చుకోవలసింది సోషలిజమా లేక ఆటవిక పాలనా అనేదేనని కేపీడీ కార్యక్రమం ప్రకటించింది. 14ఏండ్ల తరువాత జర్మనీలో ఫాసిజం అధికారంలోకి రావటంతో 1945వ సంవత్సరం దాకా పెట్టుబడిదారీ వ్యవస్థలోగల వైరుధ్యాల వల్ల ప్రపంచ చరిత్రలో ఎన్నడూ జరగని హింస జరిగింది. అలా రోజా చేసిన హెచ్చరిక నిజమైంది.

రోజా లక్జెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్‌లు హతులైన తరువాత వందేండ్లకు కూడా అంతర్జాతీయ సంబంధాలలో జాతీయవాదం, వాణిజ్య యుద్ధాలు, యుద్ధాల రూపంలో హింస ఎక్కువ అయింది. అనేక దేశాలలో మితవాద, ఫాసిస్టు శక్తులు విజృంభిస్తున్నాయి. ఇది రోజా, లీబ్‌నెక్ట్‌ల త్యాగమయ జీవితాల ప్రాసంగితను తెలియజేస్తుంది. 1918లో రోజా అన్నట్టుగా నేడు ప్రపంచం తెల్చుకోవలసింది సోషలిజమా లేక ఆటవిక పాలనా అనేదే.

మీడియా గొంతు నొక్కుతున్న బీజేపీ



కొండూరి వీరయ్య

"పత్రికా రంగమే ప్రజాస్వామ్య పరిరక్షకురాలు. ప్రజాస్వామ్య పరిణతిని కొలిచే బారో మీటర్. పత్రికా రంగం, విలేకరులు ఎంత శక్తివంతంగా ఉంటారో ప్రజాస్వామ్యం అంత ఆరోగ్యంగా ఉంటుంది. నిజాయితీతోకూడిన పాత్రికేయ వృత్తి దేశాన్ని శక్తివంతం చేస్తుంది. నా అభిప్రాయంలో జర్నలిజం నిస్పాక్షికమైనదిగాను, ధైర్యంగానూ, జాతీయ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునేదిగానూ ఉండాలి." ఇవేవో మెగస్సేసే అవార్డు వితరణ సభలో మీడియా అగ్రజులు మాట్లాడిన మాటలు కాదు. కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉపన్యాసం. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఏటా నిర్వహించే రామనాథ్ గోయెంకా అవార్డుల ఉత్సవం దీనికి సందర్భం. ఈ ఉపన్యాసం వింటే పత్రికా స్వేచ్ఛ పట్ల, ప్రత్యేకించి నిస్పాక్షికంగా పని చేసే పత్రికా రంగం పట్ల బిజెపి ప్రభుత్వానికి ఎంత ప్రేమో అనిపిస్తుంది. కాని ఇలాంటి కపటత్వం ప్రదర్శించటంలో బీజేపీకి సాటి వచ్చే రాజకీయ పార్టీ దేశంలోనే లేదు. ఉదాహరణకు రాజ్యసభలో బీజేపీ నేత అరుణ్‌జైట్లీ నోరెత్తితే ఎమర్జెన్సీని గుర్తుకు తెస్తారు. కాంగ్రెస్ తన హయాంలో పత్రికా స్వాతంత్ర్యాన్ని ఉరితీసిందని విమర్శిస్తారు. ప్రజాస్వామ్యానికి ఊపిరి పోసిన ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటపటిమ నేటి బీజేపీ నేతలదే అని జబ్బలు చరుస్తారు.

ఈ నేపథ్యంలోనే బీజేపీ పాలనలో అమిత్‌షా మోడీ ద్వయం మీడియా పట్ల అనుసరిస్తున్న కక్షపూరిత అణచివేత వైఖరి అంతర్జాతీయంగా విమర్శలనెదుర్కొంటోంది. ఇదేదో ప్రధాన స్రవంతి ఇంగ్లీషు, హిందీ మీడియా సంస్థలకే పరిమితం కాలేదు. ప్రాంతీయ భాషా ప్రతికలు, టీవీలు చివరకు సోషల్ మీడియా సాధనాలు కూడా ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రసారం చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్న సందర్భాలు మీడియా నిపుణులకు సుపరిచితమే. ఒకవైపున స్వతంత్రమైన, నిస్పాక్షికమైన జాతీయ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని వ్యవ హరించే జర్నలిజం కావాలంటూనే మరోవైపు ఈ కోవకు చెంది న మీడియా సంస్థలను సాధ్య మైనన్ని మార్గాల్లో నిర్వీర్యం చేయ టం భారత ప్రజాస్వా మ్యానికి పొంచి ఉన్న ముప్పును తెలియచేస్తోంది.

రాజకీయాల్లో ఏ పార్టీ తీసుకునే వైఖరులైనా ఆయా సమయాల్లో ఆయా పార్టీలు ఆశించే ప్రయోజనాల ఆధారంగానే ఉంటాయి. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శతృవులు ఉండరు అన్నది పాత మాట. రాజకీయాల్లో శాశ్వత వైఖరి అంటూ ఉండదన్నది తాజా నానుడి. ఒకప్పుడు పత్రికా స్వేచ్ఛే ప్రజాస్వామ్యానికి కొలమానమని వీధుల్లోకి వచ్చిన బీజేపీ నేతలు నేడు అదే పత్రికా స్వేచ్ఛ పట్ల వ్యవహరిస్తున్న వైఖరే ఇందుకు తిరుగులేని ఉదాహరణ. ఎన్డీయే 2 పరిపాలనలో పత్రికా స్వేచ్ఛతో పాటు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కూడా అత్యంత ప్రమాదకర స్థితికి చేరుకుంది. గత నాలుగున్నరేండ్లలో ఈ ప్రమాద హెచ్చరికలు పతాక స్థాయికి చేరాయి. మోడీ మిత్రుడు, సన్నిహితుడైన అదానీ గుట్టు విప్పిన ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకుడు పరంజయ్ గుహ ఠాకూర్‌దా రాజీనామాతో మొదలైన ఈ హెచ్చరికలు హిందూస్తాన్ టైమ్స్ సంపాదకుడి రాజీనామా, ఎబిపి టివి ఛానల్ ఎడిటర్ ప్రసూన్ బాజ్‌పాయిని ఇంటికి పంపటం, ఎన్డీటీవిలో సీనియర్ న్యూస్ రీడర్ రావిష్ తివారీ రాజీనామా వరకు అనేక సందర్భాలు ఉదహరించుకోవచ్చు. వీటన్నింటినీ పరిశీలించాక 'శక్తివంతమైన నిస్పాక్షికమైన మీడియా ప్రజాస్వామ్య పరిరక్షకురాలు' అంటున్న రాజ్‌నాథ్ సింగ్ చిత్తశుద్ధిని ప్రశ్నించకుండా ఉండలేము.

అంతే కాదు. ఇప్పటి వరకు ప్రభుత్వాలు మీడియా గొంతు నులమాలంటే కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, ప్రచార ప్రకటనలు మాత్రమే నిలిపి వేసేవి. ఈ దాడి పత్రికా యాజమాన్యానికి ప్రభుత్వానికి మధ్య పోరాటంగా మాత్రమే ఉండేది. వీలేకరుల జీవితాలను ప్రభావితం చేసేది కాదు. కానీ బీజేపీ ప్రభుత్వం బహుముఖ దాడి వ్యూహాన్ని అనుసరిస్తోంది. మీడియా సంస్థల ఆదాయ వనరులను నిర్వీర్యం చేయటంతో పాటు విలేఖరుల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తోంది. అంతర్జాతీయ జర్నలిజం ప్రమాణాలు పాటించటానికి ప్రయత్నం చేసిన స్వాతి చతుర్వేది వంటి విలేకరులను ఆరెస్సెస్ 'కర'సేనలు ఇంటర్నెట్‌లో ఎంతగా వేధించింది బహిరంగ రహస్యమే. ఇంకా ప్రపంచం దృష్టికి రాని ఇలాంటి విలేకరులు వందల సంఖ్యలో ఉన్నారు. ఈ ఇంటర్నెట్ సైన్యం ఏకంగా విలేకరుల వ్యక్తిత్వ హననానికి సైతం వెనకాడటం లేదు. గౌరీ లంకేష్ విషయంలో సోషల్ మీడియాలో జరిగిన దుష్ప్రచారం దీనికి ఉదాహరణ. ఇవన్నీ చాలవన్నట్లు ఏకంగా మీడియా సంస్థలపై పరువు నష్టం కేసులు దాఖలు చేయటం, వందలు వేల కోట్ల రూపాయల పరువు నష్టం చెల్లించాలని కోర్టులనాశ్రయించటం మీడియా గొంతు నులమటానికి బీజేపీ మాత్రమే ఉపయోగిస్తున్న సాధనం. ఇప్పటికే అనేక మీడియా సంస్థలపై బీజేపీ నేతలు వందల కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని కోరుతూ కేసులు వేశారు. అంతే కాదు. కీలకమైన నేతలు, వారి ఆశ్రితుల అవినీతికి సంబంధించిన వ్యాజ్యాలను పత్రికల్లో రిపోర్ట్ చేయరాదంటూ కోర్టుల ద్వారా ఆదేశాలు జారీ చేయించటం మోడీ హాయంకు మాత్రమే పరిమితమైన శైలి.

మీడియా స్వాతంత్ర్యంపై బీజేపీ సాగిస్తున్న బహుముఖ దాడిలో చివరిది అత్యంత కీలకమైనది సమాచార నియంత్రణకు సంబంధించింది. 2013-2014 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న అవినీతిపై సమాచార హక్కు ఉపయోగించుకుని పెద్ద పెద్ద కుంభకోణాలను బయటకు తీయగలిగారు జర్నలిస్టులు. 2014 ఎన్నికల్లో మోడీ ఫిరంగిని పేల్చటానికి ఉపయోగించిన మందుగుండు సామాగ్రి ఆ విధంగా వెలుగు చూసిన కుంభకోణాలే. అటువంటి స్వతంత్ర పాత్రికేయవృత్తికున్న శక్తి సామర్థ్యాలు, పదును, సామాజిక గుర్తింపు గౌరవాలను ధ్వంసం చేయటమే ఎన్డీయే 2 ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తోంది. 2012లో ఆగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కుంభకోణాన్ని బయటికి తీయటానికి జాతీయ భద్రతా ప్రయోజనాలు ఆటంకం కాలేదు. కానీ అదే జాతీయ భద్రత ప్రయోజనాలు నేడు రాఫెల్ గుట్టు రట్టు చేయటానికి ఆటంకమవుతున్నాయి. పెద్దనోట్ల లెక్క తీయటానికి కూడా జాతీయ భద్రత కారణాలు అడ్డుపడ్డాయి. సమాచార హక్కు చట్టంలో " జాతీయ సార్వభౌమత్వం, సమగ్రతలకు, శాస్త్ర సాంకేతిక పురోగమనానికి, దౌత్య సంబంధాలకు భంగం కలిగే సమాచారమైతే బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు" అన్న షరతు ఉంది. అయితే ఈ షరతును అమల్లోకి తేవాలా వద్దా అన్నది నిర్ణయించేది మాత్రం ఆయా సంస్థల్లో సమాచార అధికారులే. అంటే కేంద్ర ప్రభుత్వంలోనో, రాష్ట్ర ప్రభుత్వంలోనో ఓ విభాగంలో దిగువ స్థాయిలో ఉండే అధికారి ఏ సమాచారం వల్ల దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, దౌత్య సంబంధాలకు భంగం కలుగుతుందో అంచనా వేసుకునేంత కీలకమైన



బాధ్యతను మోస్తున్నాడు. బీజేపీ ప్రభుత్వం ఈ షరతును అడ్డుపెట్టుకుని అనేక కీలక అంశాలకు, పరిణామాలకు సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయాల్సిన బాధ్యతనుండి తప్పుకుంటున్నది.అయితే ఈ విధంగా ప్రజల మధ్యకు రావల్సిన సమాచారాన్ని అదుపు చేసినంతనో, నియంత్రించినందువల్లనో ప్రభుత్వం చేసే తప్పులు ఒప్పులైపోవు. మోడీ ప్రభుత్వం గత నాలుగున్నరేండ్లుగా అనుసరిస్తున్న ఈ వైఖరి కండ్లు మూసుకుని పాలుతాగే పిల్లి ఆలోచనా స్థాయిని మించి ఎదగలేదన్న విషయం పదే పదే రుజువు చేస్తున్నది. తాజాగా మరో ఉదాహరణను కూడా ఇక్కడ ప్రస్తావించుకోవటం అవసరం. అది రాఫెల్ వివాదంతో ముడిపడి ఉన్న అంశం. 2017లోనే కొందరు విలేకరులు సమాచార హక్కు చట్టం కింద భారత వైమానిక దళ అధికారులను ఆశ్రయించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు అయిన ఖర్చును తెలపాలంటూ అర్జీలు దాఖలు చేసుకున్నారు. అప్పట్లోనే వైమానిక దళ ప్రతినిధులు ఈ సమాచారం జాతీయ భద్రతతో ముడిపడి ఉందనీ, బహిరంగంగా చర్చించే అంశం కాదనీ శెలవిచ్చారు. అక్టోబరు నుండీ నేటి వరకు సుప్రీం కోర్టు నుండీ పార్లమెంట్ వరకు మోడీ ప్రభుత్వం ఇదే వాదనను తలకెత్తుకున్నది. సుప్రీం కోర్టులో దాఖలైన వ్యాజ్యంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరి తీసుకున్నది. రాఫెల్ యుద్ధ విమానాల ధరలు నిర్ణయించిన పద్ధతి బయటికి పొక్కితే దేశ భద్రత ప్రమాదంలో పడుతుందన్నది వారి వాదన. ఈ వాదన ఆధారంగా సుప్రీం కోర్టులో కేసు గెలిచాక నెల కూడా తిరక్కుండానే రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాఫెల్ వివాదంపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో పాల్గొంటూ భారత వైమానిక దళం కోసం హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కంపెనీకి పంపిన ప్రతిపాదనల గురించి ప్రస్తావించారు. చర్చ ముగిసిన మరునాడే ఏ తరహా సాయుధ వైమానిక సేవల కోసం ఎంతెంత ధర నిర్ణయించారో వివరంగా తెలియచేస్తూ రెండు పేజీల పట్టికలు సోషల్ మీడియాలో స్వైర విహారం చేశాయి.


దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటి? కేవలం రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఖర్చు మాత్రమే దేశ భద్రతతో ముడిపడి ఉన్న అంశం. దేశీయంగా తయారయ్యే ఆయుధ సేవల గురించిన సమాచారం, ఈ సేవలు వినియోగించుకోవటానికి అయ్యే ఖర్చు గురించిన సమాచారం బయటకు పొక్కితే దేశభద్రతకు ఎటువంటి ముప్పు లేదని స్వయంగా రక్షణశాఖ ప్రకటనలే రుజువు చేస్తున్నాయి. అంటే... ఏ సమాచారాన్ని ఎందుకు విడుదల చేయాలి, ఎందుకు దాయాలో ప్రభుత్వానికి ఓ లెక్క జమ ఉంది. ఇటువంటి అనేక అడ్డదిడ్డమైన వాదనలతో వాస్తవాలు మీడియా ద్వారా ప్రజలముందుకు రానీయకుండా ప్రభుత్వం అడ్డు కట్ట వేస్తోంది. ఏ కపటత్వాన్ని కాచుకోవటానికీ, అవినీతిని దాచుకోవటానికి ఈ ప్రభుత్వం మీడియా గొంతు నొక్కుతుందో అర్థం చేసుకునే బాధ్యత పాఠకులకే వదిలేద్దాం. ఈ నేపథ్యంలోనే బీజేపీ పాలనలో అమిత్‌షా మోడీ ద్వయం మీడియా పట్ల అనుసరిస్తున్న కక్షపూరిత అణచివేత వైఖరి అంతర్జాతీయంగా విమర్శలనెదుర్కొంటోంది. ఇదేదో ప్రధాన స్రవంతి ఇంగ్లీషు, హిందీ మీడియా సంస్థలకే పరిమితం కాలేదు. ప్రాంతీయ భాషా ప్రతికలు, టీవీలు చివరకు సోషల్ మీడియా సాధనాలు కూడా ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రసారం చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్న సందర్భాలు మీడియా నిపుణులకు సుపరిచితమే. ఒకవైపున స్వతంత్రమైన, నిస్పాక్షికమైన జాతీయ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని వ్యవ హరించే జర్నలిజం కావాలంటూనే మరోవైపు ఈ కోవకు చెంది న మీడియా సంస్థలను సాధ్యమైనన్ని మార్గాల్లో నిర్వీర్యం చేయ టం భారత ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న ముప్పును తెలియచేస్తోంది.

సెల్ : 9871794037

మెయిల్ @ నవతెలంగాణ

ముఖ్యమంత్రి గారూ..

'పత్తిపాక' ప్రజలను డేంజర్ జోన్ నుంచి గట్టెక్కించండి...



రాజేందర్ దామెర

ఖనిజ సంపద పుష్కలంగా ఉన్న దేశం మనది. ఇక్కడ మైనింగ్ పరిశ్రమ చాలా ముఖ్యమైనది. మైనింగ్ కార్యక్రమాల ప్రభావం వల్ల నీరు, గాలి, భూమి, భూసారం, అడవులు, పర్యావరణం మీద మాత్రమే కాకుండా మనుషుల ఆరోగ్యాల మీద, జనవాసాల మీద కూడా తీవ్ర ప్రభావం చూపుతుందనేది జగమెరిగిన సత్యం. దుమ్ము, దూళీ, వాయువులు, శబ్దాలు మొదలగు వాటి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

అసలు విషయానికి వస్తే.... వరంగల్ రూరల్‌జిల్లా పరిధిలోని శాయంపేట మండలంలో సహజ సంపదలైన గుట్టలు పుష్కలంగా ఉన్నాయి. ఈ మండలంలోని పత్తిపాక గ్రామం చుట్టుపక్కల కూడా పుష్కలంగా గుట్టల సముదాయం ఉంది. గత కొన్నేండ్లుగా ఇక్కడ క్రషర్ల నిర్వహణ సాగుతోంది. శాయంపేట మండలానికి పక్కనే ఉన్న ఆత్మకూర్ మండలంలోనూ క్రషర్లు, డాంబర్‌ప్లాంట్ల నిర్వహణ సాగుతుంది. సుమారు ఏడు వేల పై చిలుకు జనాభా కలిగిన పత్తిపాక గ్రామ గుట్టల పరిసర ప్రాంతమంతా వ్యవసాయ భూములు కావటంతో నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలతో పంట పొలాలతో, వాణిజ్య పంటలతో పచ్చదనం ఉంటుంది. అయితే ఈ గుట్టల సముదాయంలోనే గ్రామానికి సుమారు రెండున్నర కిలో మీటర్ల దూరంలోని ఓ గుట్టకు క్రషర్ ప్రారంభమైంది. గత ఆరెండ్ల కిందట ప్రారంభమైన క్రషర్ వల్ల ప్రస్తుతం ఇక్కడి గుట్ట ఆనవాళ్ల కూడా లేవు. గుట్ట అడుగు భాగం కూడా కిలో మీటర్ నుంచి రెండు కిలో మీటర్ల లోతులో తొలచబడింది. దీనికి తోడు ఇదే స్థానంలో డాంబర్‌ప్లాంట్ నిర్వహణకు కూడా క్రషర్ యాజమాన్యం సిద్ధపడటం గ్రామానికి భవిష్యత్‌లో అనారోగ్యాన్ని బహుమతిగా ఇవ్వటానికి సంకేతంగా భావించాల్సి వస్తోంది. అయితే వరంగల్ రూరల్ జిల్లాలోని పత్తిపాక క్రషర్, డాంబర్ ప్లాంట్ మైనింగ్ తరహా అంత కాకపోయినప్పటికీ గుట్టలను తరగదీయటం, ఆ ప్రాంతంలోని పర్యావరణానికి, భూభాగానికి, ప్రజల ఆరోగ్యాలకు, పంటలకు, భూగర్భ జలాలు అడుగంటి పోవటానికి కూడా నిర్వహణ కారణమవుతున్నదని గుర్తించాలి. అంతిమంగా డాంబర్ ప్లాంట్ వల్ల మనుషుల ఆరోగ్యాలకు అనార్థాలు తప్పవని గమనించాలి. పత్తిపాక శివారులో ఒక గుట్ట క్రషర్ నిర్వహణతో కనుమరుగైంది. ఇదే తరహాలో మరో గుట్ట కూడా భవిష్యత్‌లో కనుమరుగు కానుందంటే సందేహించాల్సిన అవసరం లేదు. ఈ లెక్కన పత్తిపాక గ్రామ భవిష్యత్ తరాలకు ఇక్కడ గుట్టలున్నాయనే విషయం కూడా తెలియకుండా పోతుందనటంలోనూ ఆశ్చర్యం లేదు.

ఇప్పటికే చుట్టుపక్కల పంట భూముల పరిస్థితిని, భూసారాన్ని, భూగర్భ జలాల స్థితిని, దుమ్ము, దూళీతో నిత్యం ఆ ప్రాంతంలో పనులు చేసే రైతులు, వ్యవసాయ కూలీల ఆరోగ్యాలను, జీవన స్థితి గతులను ఓ సారి పత్తిపాక ప్రజలు పరిశీలించుకోవాల్సిన అవసరముంది. క్రషర్లు, డాంబర్‌ప్లాంట్ వల్ల ఏలాంటి నష్టం లేదని భావించి నిర్వహకులకు వత్తాసు పలికే వారు సైతం భవిష్యత్తులో వీటి నిర్వహణ వల్ల కలిగే అనార్థాలను గ్రహించకుంటే ఆ గ్రామ భవిష్యత్ తరాలను పెను ప్రమాదంలోకి నడిపిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ సంబంధిత శాఖల పర్మిషన్‌తోనే కదా వీటిని నిర్వహించేది అనే ప్రశ్నలు ఉత్పన్న మవుతాయి. నిజమే కానీ జనానికి, ఆ ప్రాంతానికి నష్టం చేసే పర్మిషన్లు గురించి ఆలోచించటం, ఆ ప్రాంతానికి, జనానికి కలిగే అనార్థాలను పరిగణలోకి తీసుకొని వీటి నిర్వహణను అడ్డుకోవాల్సిన అవసరముంది. సంబంధిత శాఖలు గుట్టలను తరిగించె క్రషర్లకు, డాంబర్ ప్లాంట్లకు పర్మిషన్లు ఇవ్వనీవ్వ గాక, కానీ అందుకోసం మనుషుల ఆరోగ్యాలను పనంగా పెట్టడం ఎంత వరకు సమంజసం. ఇది మనుషుల జీవించే హక్కుకు భంగం కలిగించటం కాదా..? ప్రజల ఆయుష్యును తగ్గించే చర్యలు కావా...? ప్రజలకు నష్టం చేసే వాటికి పర్మిషన్లు ఇవ్వటం ఎందుకు...? క్రషర్లు, డాంబర్‌ప్లాంట్ల నిర్వహణకు పర్మిషన్లు ఇచ్చే ముందు సంబంధిత శాఖలు ఇవ్వన్నీ దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముంది. పర్మిషన్లు ఇచ్చే అధికారం ఉంది కదా...అని అడ్డగోలుగా పర్మిషన్లు ఇచ్చే ముందు సంబంధిత శాఖలు ఒక్క సారి మనుషులుగా ఆలోచించాల్సిన అవసరముంది. సంబంధిత శాఖలు పర్మిషన్లు ఇచ్చాయంటూ పత్తిపాక గ్రామ ప్రజల భవిష్యత్తుకు ఆరోగ్యాలకు, ఆ ప్రాంత వ్యవసాయ భూములకు నష్టం చేసే విధంగా క్రషర్, డాంబర్ ప్లాంట్ నిర్వహించే చర్యలపై ప్రభుత్వ అధినేత కేసీఆర్ గారు దృష్టి సారిస్తే తప్ప పత్తిపాక గ్రామ ప్రజల భవిష్యత్‌కు భరోసా ఉండదు. ఇక్కడి అధికారులు, నిర్వహకులు వారికి వత్తాసు పలికే పెద్దలు అందరూ కలిసి గ్రామస్తులకు భవిష్యత్‌ను డెంజర్ జోన్‌లోకి నెట్టేసే విధంగానే వ్యవహరిస్తున్నారు. ఇక ప్రభుత్వ పెద్ద ముఖ్యమంత్రి కేసీఆరే గ్రామాన్ని కాపాడాలి.

సెల్ : 8096202751

బీజేపీకి గుబులు పుట్టిస్తున్న ఎస్‌పీ, బీఎస్‌పీల మైత్రి...

వేదుల రామక్రిష్ణ

పొత్తు వార్తతో ఇప్పటికే బీజేపీ ఒత్తిడిలో పడింది. అందుకే ఎస్‌పీ -బీఎస్‌పీసహా ప్రతిపక్షాలన్నిటినీ తిరిగి ఒత్తిడిలో ఉంచటానికి బీజేపీ రాజకీయ ఆయుధంగా సీబీఐని రంగంలోకి దింపింది. విశ్లేషకుల అభిమతం ప్రకారం మామూలుగానే ప్రస్తుతం బీజేపీ పరిస్థితి సజావుగా లేదు. ముఖ్యంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవటం బీజేపీ పరిస్థితిని మరింత దిగజార్చింది.

బీజేపీని ఇరకాటంలో పెట్టే విధంగా ఉత్తర్ ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్‌పీ జత కట్టాయి. అదే సమయంలో అఖిలేశ్ సింగ్ యాదవ్‌పై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కసితో వేటు వేయటానికి ప్రయత్నిస్తోంది. గత శనివారం అనగా జనవరి 5న ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ కలుపుకుని కనీసం 14 స్థానాల్లో సీబీఐ సోదా చేసింది. బీఎస్‌పీ, ఎస్‌పీలు రాబోయే లోకసభ ఎన్నికల్లో సీట్లు సర్దుబాటు చేసుకుని పోటీ చేయాలనుకుం టున్నాయి. ఈ వార్త ప్రచారంలోకి రాగానే సీబీఐ అధికార్లను రంగంలోకి దింపింది మోడీ ప్రభుత్వం.

ఈ రెండు ప్రతిపక్ష పార్టీల మధ్య లోకసభ సీట్లకు సంబంధించి అవగాహన కుదరటంతో బీజేపీ శిబిరం భయపడుతున్నదనేది స్పష్టంగా తెలుస్తోంది. వారు భయపడిన తీరు సీబీఐని రాజకీయ ఆయుధంగా చేసుకుని అఖిలేశ్ యాదవ్, ఎస్‌పీ పార్టీ మంత్రివర్గ మాజీ సభ్యురాలు గాయత్రి ప్రజాపతిని ఇబ్బంది పెట్టటంలో ప్రతిబింబిస్తోంది. అఖిలేశ్‌తో పాటే మాయావతిని కూడా ఒత్తిడిలో ఉంచే ఎత్తుగడకు పూనుకుంటున్నది కేంద్ర ప్రభుత్వం. సీబీఐ తరపు నుంచి జనవరి 2న అఖిలేశ్ యాదవ్, గాయత్రిపై చట్ట విరుద్ధ గనుల వ్యాపారం చేస్తున్నారనే అభియోగంతో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. 2012 నుంచి జూన్ 2013 వరకు అప్పటి ముఖ్యమంత్రి అఖిలేశ్ గని శాఖ అదనపు బాధ్యత చేపట్టారని సీబీఐ వాదన. ఏ ఇసుక గనులకు సంబంధించి సీబీఐ అభియోగం పెట్టిందో అవి పాత కేసులు. ఈ కేసుల ఆధారంగానే జనవరి 2న సీబీఐ ఎఫ్ఐఆర్. జనవరి 2 ఎఫ్ఐఆర్ తరవాత అతి త్వరగా జనవరి 5 శనివారం నాడు ఉత్తర్ ప్రదేశ్‌లో బుందేల్‌ఖండ్ ప్రాంతం, ఢిల్లీలో కలిపి 14 స్థానాల్లో సీబీఐ సోదాలకు దిగింది. అఖిలేశ్ యాదవ్, గాయత్రి ప్రజాపతి కాకుండా సమాజ్‌వాదీ నాయకులు రమేశ్ కుమార్ మిశ్రా, ఐఎఎస్ అధికారి చంద్రకళ సహా చాలామంది వ్యక్తుల ఇండ్లపై కూడా సీబీఐ సోదా చేసింది. ఉత్తర్ ప్రదేశ్ ప్రతిపక్ష రాజకీయ నాయకులు సీబీఐ సోదాలను విమర్శిస్తు మాయావతితో పాటు అఖిలేశ్ యాదవ్‌ని ఒత్తిడిలో ఉంచే ఎత్తుగడతో బీజేపీ సీబీఐని రంగంలోకి దింపిందని అన్నారు. విస్తృతంగా విమర్శలు వస్తున్న నేపథ్యంలో బీఎస్‌పీ నాయకురాలు మాయావతిపై కూడా పాత కేసుల్లో మరలా



ఇరికిస్తామని సీబీఐ బెదిరించింది. కేంద్ర విచారణ సంస్థ ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టటానికి పెద్ద ఎత్తున ప్రణాళికతో రంగంలోకి దిగిందని ప్రతిపక్షాలు అనుకుంటున్నాయి.

సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రాజేంద్ర చౌదరి సీట్ల సర్దుబాటు అవగాహన వార్త తెలియజేస్తు 80 సీట్లలో బీఎస్‌పీ, ఎస్‌పీలు సమాన సంఖ్య సీట్లలో పోటీ చేస్తాయని విలేకర్లకు చెప్పారు. 3 సీట్లు అజిత్ సింగ్ రాష్ట్రీయ లోకదళ్‌కు కేటాయిస్తారు. ఉత్తర్ ప్రదేశ్ 2017 శాసనసభ ఎన్నికల్లో 312 సీట్లు గెల్చుకుని బీజేపీ అధికారంలోకి వచ్చింది. పొందిన ఓట్ల శాతం 39.62. సమాజ్‌వాదీకి 47 సీట్లు వచ్చాయి. ఓట్ల శాతం 21.82. బీఎస్‌పీకి 19 సీట్లు వచ్చాయి. ఓట్ల శాతం 22.23. ఎస్‌పీ, బీఎస్‌పీ కలిసి పొందిన ఓట్ల శాతం 45.05. 2014 లోకసభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిపి పొందిన ఓట్ల శాతం 42.12. బీజేపీ ఒంటరిగానే పొందిన ఓట్లు 42.63 శాతం. ఉత్తర్ ప్రదేశ్‌లో గత లోకసభ ఎన్నికల్లో ఉన్న 80 సీట్లకు బీజేపీ 71 సీట్లు పొందింది. తరవాత కాలంలో ఆ రాష్ట్రంలో 3 లోకసభ స్థానాలు, ఒక శాసనసభ స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలో బీజేపీ ఓడిపోయింది.

ఈ ఫలితాల ఆధారంగానే ప్రతిపక్షాలు పొత్తు కుదుర్చుకోవటానికి ఉత్సాహాన్ని పొందాయి. పొత్తు తుది రూపం తీసుకుంటే బీజేపీకి ప్రమాద సంకేతమే అవుతుంది. పొత్తు వార్తతో ఇప్పటికే బీజేపీ ఒత్తిడిలో పడింది. అందుకే ఎస్‌పీ -బీఎస్‌పీసహా ప్రతిపక్షాలన్నిటినీ తిరిగి ఒత్తిడిలో ఉంచటానికి బీజేపీ రాజకీయ ఆయుధంగా సీబీఐని రంగంలోకి దింపింది. విశ్లేషకుల అభిమతం ప్రకారం మామూలుగానే ప్రస్తుతం బీజేపీ పరిస్థితి సజావుగా లేదు. ముఖ్యంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవటం బీజేపీ పరిస్థితిని మరింత దిగజార్చింది. ఉత్తర్ ప్రదేశ్‌లో ఎస్‌పీ, బీఎస్‌పీ నాయకులపై పాత కేసులను తిరగతోడి సీబిఐని ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందటానికి అదే పాత పద్ధతిలో బీజేపీ రంగంలోకి దిగింది. కాని దీనివల్ల అది గట్టెక్కుతుందా అనేదే ప్రశ్న.



"ప్రేమ బందీలను చేయదు.
విముక్తులను చేస్తుంది.
జీవితాన్ని ప్రేమించండి
దానిలో నిమగ్నమైపోండి.
మీరు ఇవ్వగలిగినదంతా
దానికి ఇవ్వండి.
బోలెడంత అభినివేశంతో ప్రేమించండి.
ఎందుకంటే...
మీరు ఇచ్చినదంతా జీవితం
మీకు తిరిగి ఇస్తుంది.
మళ్ళీ..మళ్ళీ."
- మాయా ఏంజిలో...

గుడ్డులో ఏముంది?



కొందరు గుడ్డు వేడి చేస్తుందంటారు.. ఇంకొందరేమో అరగదంటారు.. మరికొందరేమో గుండెకు హాని చేస్తుందంటారు. అయితే ఇవన్నీ అపోహలేనని వైద్యులు కొట్టిపారేస్తున్నారు. ఎందుకంటే .. గుడ్డు వేడి చేస్తుందనడంలో అర్థమే లేదట. ఇక అరగకపోవడమంటే సరిగా ఉడికించకుండా తినడం వల్ల కొన్ని సార్లు అరగకపోవచ్చు. గుడ్డు సొనలో కొవ్వు శాతం ఎక్కువే. కానీ ఆ కొవ్వు పదార్థాలు రక్తనాళాలు తేలికగా పనిచేసేలా ఉపకరిస్తాయి. గుండెకు ఎలాంటి హానీ చెయ్యవు.

కొలిన్: పచ్చసొనలో కొలిన్ (విటమిన్ బిలో ఉండే ఒక పదార్థం) ఉంటుంది. ఇది పోషక పదార్థం. మన శరీరం సహజంగా దీని తయారుచేసుకోలేదు. అది లోపిస్తే నాడీ సంబంధ, మెదడు పనితీరు మందగించడం లాంటి సమస్యలు వేధిస్తాయి. గుడ్డు ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోవచ్చు.

విటమిన్ ఎ: చూపు మందగించడం, శుక్లాలు వంటి కంటి సమస్యలు దరిచేరవు.

విటమిన్ డి: దీనివల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి. మధుమేహం వంటి వ్యాధులు రాకుండా చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

అమైనో ఆమ్లాలు: వీటిలో అన్ని రకాలూ గుడ్డులో ఉంటాయి. ఇవి శారీరక శ్రమ చేసేవాళ్లకి తక్షణ శక్తినిస్తాయి.

సల్ఫర్, విటమిన్లు, లవణాలు: జుట్టు చక్కగా ఎదుగుతుంది. గోళ్లు చిట్లిపోకుండా ఆరోగ్యకరంగా ఉంటాయి.

ఇనుము: రక్తహీనత కలగదు. గుడ్డులోని ఇనుమును శరీరం సులభంగా గ్రహిస్తుంది.

ఉదయం అల్పాహారం: గుడ్డును తీసుకుంటే ఎక్కువసేపు ఆకలి వేయదు.

పౌష్టికాహారం: రోజూ ఓ గుడ్డును ఏదో రూపంలో తీసుకుంటే శరీరానికి కావాల్సినవన్నీ పోషకాలు అందుతాయి. పౌష్టికాహార లోపం తలెత్తదు.

బరువు: గుడ్డులో ఉండే ప్రోటీన్లు కొద్దిగా తినగానే కడుపునిండిన భావన కలిగిస్తాయి. అందువల్ల పరిమిత ఆహారంతో బరువును నియంత్రించుకోవచ్చు.

❄



ఆర్థిక స్వేచ్ఛతో అనర్థాలు...

నేటి యువత ఆర్థిక స్వేచ్ఛను తొందరగా అందిపుచ్చుకుంటున్నది. అయితే.. ఇది చాలాసార్లు అనర్థాలకు దారి తీస్తున్నది. డబ్బు చేతికందటంతో అధిక ఖర్చు చేస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. ఇదే కొనసాగితే భవిష్యత్ గందరగోళం అవుతుంది. ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. అవి రాకుండా ఉండాలంటే...



డబ్బు చేతికి వచ్చిందంటే.. ఆలోచనల్లోనూ అనేక మార్పులు వస్తాయి. అవసరానికి చేసే ఖర్చు కాస్తా కోరికలకు చేసే వ్యయంగా మారుతుంది. దీనికి తగ్గట్టుగానే మార్కెట్‌లో కూడా పలు సంస్థలు యువత జేబులో నుంచి డబ్బును తీసుకునేందుకు అనేక ఉపాయాలను పన్నుతుంటాయి. భవిష్యత్తులో అనేక అవసరాలు.. ఆశలు, లక్ష్యాలు ఉన్న నేపథ్యంలో నేడు చేసే ఒక్కో రూపాయి పొదుపు కూడా ఎంతో ముఖ్యం అని గుర్తించాలి.

ఆలోచించి ముందడుగు...

ఇప్పుడు పెట్టుబడి పథకాల గురించి చాలా సమాచారం అందుబాటులో ఉంది. వయసును బట్టి పెట్టుబడి పద్ధతులూ మారుతున్నాయి. పాతతరం వాళ్లు.. దీర్ఘకాలం మదుపు చేసి, మంచి రాబడిని సంపాదించాలని ఆలోచిస్తే.. నేటితరం యువత వేగంగా రాబడిని కోరుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో, అత్యున్నత సేవలతో ఉన్న పెట్టుబడి పథకాలు కావాలని భావిస్తున్నారు. ఎప్పటికప్పుడు తమ డబ్బు గురించి సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.. అంతా తెలుసుకొని మదుపు చేయడం ఎప్పుడూ మంచిదే. యువత చేయాల్సిన పనేమిటంటే.. ఒక పెట్టుబడి పథకం గురించి పూర్తి సమాచారాన్ని విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకోవాలి. ఒకవేళ ఆర్థిక సలహాదారుడిని సంప్రదిస్తే.. వారు సూచించిన పథకాలను ఎంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆ విషయాలను ధ్రువీకరించుకోవాలి. ఆయా పథకాల్లో ఉన్న ఖర్చులు, పారదర్శకతను గమనించాలి. అప్పుడే మీరు ఎంచుకున్న పథకం మీ లక్ష్య సాధనలో ఉపయోగపడుతుంది.

క్రెడిట్ జోలికి వెళ్లొద్దు...

పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకొని, వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసర ముంది. నేటి యువత ఉన్నత విద్యాభ్యాసం కోసం విద్యారుణం తీసుకుంటున్నారు. ఉద్యోగం రాగానే చేయాల్సిన మొదటి పనేమిటంటే.. ఆ రుణాన్ని సాధ్యమైనంత తొందరగా తీర్చే యడం. చాలామంది యువత ఈ రుణాన్ని తీర్చేందుకు ప్రాధాన్యం ఇవ్వకుండా.. విలాసవంతంగా ఖర్చు చేసేం దుకే ఇష్టపడతారు. క్రెడిట్ కార్డులతోపాటు, వ్యక్తిగత రుణా లను కూడా తీసేసుకుంటారు. ఇవన్నీ కూడా ఒకదానితో ఒకటి చేరి, యువతను అప్పుల ఊబిలోకి దింపేస్తాయి. అందుకే, సాధ్యమైనంత వరకూ అప్పులను తీర్చేయడం తోపాటు, కొత్త అప్పుల జోలికి వెళ్లకుండా చూసుకోవాలి.

మిగిలిన డబ్బుతోనే...

ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క చూపెట్టాలంటే నేటి యువతకు నచ్చదు. కానీ, ఇది తప్పనిసరి అవసరంగా గుర్తించాలి. సంపాదించిన మొత్తంలో మీ తప్పనిసరి ఖర్చులు ముందుగా తీసేయాలి. అత్యవసర నిధి కోసం ఏర్పాటు చేసుకోవాలి. పదవీ విరమణ తర్వాత నిధి కోసం కొంత పక్కన పెట్టాలి. ఇంకా మీ స్వల్పకాలిక లక్ష్యాలను కూడా చూసుకోవాలి. వీటన్నింటికీ సరిపోగా మిగిలిన డబ్బును మీ ఇష్టానుసారం ఖర్చు చేయండి. క్రమం తప్పకుండా మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయడం ఒక అలవాటుగా మారాలి. చిన్న వయసులో ఉన్నప్పుడు నష్టభయం భరించే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఈక్విటీ ఫండ్లు లేదా నేరుగా షేర్లలోనూ మదుపు చేయవచ్చు.

భరోసా కల్పించాలి...

తన కోసం ఎంతో చేసిన కుటుంబానికి, తనపైన ఆధారపడిన వారికీ ఓ ఆర్థిక భరోసా ఎప్పుడూ కల్పించాలి. ఇది కేవలం బీమాతోనే సాధ్యం. చిన్న వయసులో ఉన్నప్పుడు బీమా ప్రీమియం కూడా తక్కువగానే ఉంటుంది. వార్షికాదా యానికి 15 రెట్ల వరకూ బీమా ఉండేలా చూసుకోవడం ఎప్పుడూ ముఖ్యమే. మీ ఆదాయం పెరుగుతున్న కొద్దీ బీమా కూడా పెరగాలి. నేటి ఆధునిక యువత ఒకే ఉద్యోగంలో స్థిరంగా ఉండటం కూడా కష్టమే. అయితే, ఉద్యోగం మారినప్పు డల్లా.. భవిష్య నిధిని వెనక్కి తీసుకోవద్దు. ఉద్యోగం చేస్తున్న చోటకు ఆ ఖాతాను బదిలీ చేసుకుంటూ ఉండాలి.

పన్ను ఆదాకోసం...

పన్ను ఆదాకోసం అనేక పథకాలు ఉన్నప్పటికీ తప్పనిసరిగా పరిశీలించాల్సిన వాటిల్లో బీమా పాలసీలు ఒకటి. చాలా మంది తమ పేరుమీద జీవిత, ఆరోగ్య బీమా పాలసీలను తీసుకోవడానికి ఆసక్తి చూపించరు. వైద్య ఖర్చులు పెరిగిపోతున్నాయి. కొన్ని వ్యాధులూ వచ్చే ప్రమాదం ఉంది. వీటన్నింటికీ అయ్యే ఖర్చు తట్టుకోవాలంటే.. వైద్య బీమా పాలసీ తప్పనిసరి. జీవిత బీమా పాలసీ ఉండాల్సిందే. దీనివల్ల అనుకోనిదేదైనా జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థిక అండ లభిస్తుంది. బీమా దీర్ఘకాలిక పొదుపు పథకం కాబట్టి, భవిష్యత్తులో పదవీ విరమణ తర్వాత జీవితం గడపడానికి అవసరమైన నిధిని సమకూర్చి పెడుతుంది.

అయితే, జీవిత బీమా పాలసీ ఎంపిక అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఆదాయం, ఖర్చులు, అప్పులు, లక్ష్యాలు ఇలా అన్నింటినీ బేరీజు వేసుకొని ఎంత మొత్తానికి పాలసీ తీసుకోవాలన్నది నిర్ణయించుకోవాలి. పెద్ద మొత్తంలో పాలసీ తీసుకోవాలని అనుకున్నప్పుడు తక్కువ ప్రీమియంతో లభించే టర్మ్ పాలసీలను ఎంపిక చేసుకోవచ్చు. ఏళ్ల దీర్ఘకాలిక లక్ష్యంతో పాలసీని తీసుకో వాలని అనుకున్నప్పుడు యూనిట్ ఆధారిత బీమా పాలసీలనూ పరిశీలించవచ్చు. పన్ను ఆదా అనేది ఈ పాలసీలు అందించే అదనపు ప్రయోజనంగానే భావిం చాలి. అందువల్ల అన్ని విషయాలూ, మీ అవసరాలూ పరిశీలించాకే పాలసీని తీసుకోవాలి.

ఏ పథకంలో మదుపు చేసేటప్పుడైనా దాని గురించి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ఒక నిర్ణయం తీసు కోవాలి. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలూ అంతే. ఎప్పటికప్పుడు జీవిత బీమా అవసరాలను సమీక్షిం చుకోవాలి. అవస రాన్ని బట్టి, పాలసీ మొత్తాన్ని పెంచు కోవాలి. పన్ను ఆదా చేసుకోవడం ఎంత ముఖ్యమో.. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం అంతకన్నా ప్రధానం అని మర్చిపోకూడదు.

జారి పడకుండా...



స్నానాల గదిలో జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గచ్చుకు ఉపయోగిస్తున్న టైల్స్ చాలావరకు కారణం అవుతున్నాయి. జారుడును నిరోధించే టైల్స్ ఇప్పుడు చాలా దొరుకుతున్నాయి. సరైనవాటి ఎంపికతో సురక్షితంగా ఉండొచ్చు. ఇంటి నిర్మాణంలో స్నానాల గది అంటే చాలామందికి చిన్నచూపు. ఇరుకిరుకుగా ఏదో కట్టేశాం అన్నట్లుగానే ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా వరండా, పడక గది గచ్చు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించే వారు సైతం స్నానాల గది వచ్చేసరికి రాజీపడిపోతుంటారు. ఇక్కడ గడిపేది రోజులో కొద్ది సమయమే కదా అనేది వారి భావన. ముఖ్యంగా గచ్చు విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే జారే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది.

- స్నానాల గదుల్లో గచ్చుకు ఉపయోగించే టైల్స్‌లో జారిపడకుండా పలు రకాలు మార్కెట్లో ఉన్నాయి. సిరామిక్, విట్రిఫైడ్‌లోనే ఎన్నో డిజైన్లు వచ్చాయి. స్లిప్ షీల్డ్ ఫ్లోర్ టైల్స్ మార్కెట్లో ఉన్నాయి. ఇవి జారుడును నిరోధిస్తాయి. టైల్స్ ఉపరితలం తడి, సబ్బు నురగ ఉన్నప్పుడు కూడా ఘర్షణను అధికంగా చేసేందుకు ఈ టైల్స్‌కు పూత పూస్తారు. దీనివల్ల తడి ఉన్నప్పుడు కూడా కాలు పట్టు తప్పకుండా ఉంటుంది. స్నానాల గదుల్లోనే కాదు బయట నీరు నిలిచే ప్రాంతాల్లోనూ ఈ టైల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. గోధుమ, బూడిద, క్రీమ్, తెలుపు రంగుల్లో ఈ పలకలు అందుబాటులో ఉన్నాయి.
- స్నానాల గదిలో గచ్చు దృఢంగా ఉండాలనుకునే వారు విటిఫ్రైడ్ పలకలను వేయించుకోవచ్చు. అధిక బరువును ఇవి తట్టుకోగలవు. వీటిపైన నీరు అస్సలు నిలవకుండా ఉండేలా గచ్చు గరుకుగా ఉంటుంది. రాతి పలక మాదిరి ఫినిషింగ్‌తో చూసేందుకు ఆకర్షణగా ఉంటుంది. సిరామిక్‌తో పోలిస్తే ధర కాస్త ఎక్కువే పెట్టాలి. పలకలపై తేమను నిరోధిస్తుంది. ఫలితంగా బ్యాక్టీరియా చేరదు. వీటిని శుభ్రం చేయడం సులువు. నిర్వహణ చాలా తేలిక. మ్యాట్, రస్టిక్ ఫినిష్‌లలో లభిస్తున్నాయి. బూడిద రంగు, ముదురు బూడిద, నలుపు రంగుల్లో అందుబాటులో ఉన్నాయి.
- స్నానాల గదిలో కేవలం జారిపడకుండా ఉండే పలకలు పరిస్తే సరిపోదు. తగిన గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. సహజ వెలుతురు ఉండాలి. ఫలితంగా గచ్చుపై, టైల్స్‌పై తడి లేకుండా ఎప్పటికప్పుడు ఆరిపోతాయి. తేమ లేకుండా పొడిగా ఉంటాయి. బ్యాక్టీరియా చేరదు. సరైన వెలుతురు లేక విద్యుత్తు వెలుగే అనివార్యంగా ఉన్న గదుల్లో తడి ఉన్న విషయమూ స్పష్టంగా కనిపించదు. దీంతో జారి పడే ప్రమాదాలు ఉంటాయి కాబట్టి విశాలంగా ఉండేలా చూసుకోవాలంటున్నారు ఆర్కిటెక్చర్లు. కారే నల్లాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించడాన్ని అలక్ష్యం చేయొద్దు.
- బడ్జెట్‌లో సిరామిక్‌లో ఎక్కువ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కొత్త రకాలు వచ్చాయి. ఫోర్సలీన్, సాటిక్ మ్యాట్, మెటాలిక్ ఫినిష్‌లలో దొరుకుతున్నాయి. వీటి నిర్వహణ కూడా తేలిక. నీరు టైల్స్‌పై పడగానే నిల్వ ఉండకుండా పల్లానికి చేరుతుంది. చిన్నచిన్న నీటి బిందువులుగా విడిపోతుంది. దీంతో గచ్చుపై తడి లేకుండా కాలు పట్టు నిల్చేలా చూస్తుంది.

❄

ప్రసవం తరువాత...



ప్రసవం తర్వాత చాలా మంది లావైపోతుంటారు. అందుకు కారణాలు అనేకం. కొందరు గర్భధారణ తరువాత పౌష్టికాహారం బాగా తీసుకుంటారు. దీంతో బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే ప్రసవం తర్వాత సరైన జాగ్రత్తలు పాటించకపోతే ఎంత స్లిమ్‌గా ఉన్న వారైనా లావైపోవడం ఖాయం.

- బరువు పెరిగిపోయామని వెంటనే డైట్ స్టార్ట్ చేయకూడదు. బిడ్డకు పాలను ఇస్తున్న కాలంలో బరువు తగ్గేందుకు ప్రయత్నాలు అస్సలే చేయకూడదు. అలా చేస్తే బేబీకి పాలు తక్కువవుతాయి. అందువల్ల బిడ్డ కాస్త తినడం ప్రారంభించాక బరువు తగ్గేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాలి.
- రోజూ పొద్దున్నే రాగి జావ తీసుకుంటే మంచిది. అలాగే కొన్ని పాలు తాగాలి. ఏదైనా ఒక పండును తీసుకోవాలి. ఉదయం టిఫిన్‌లో భాగంగా ఇడ్లీ తీసుకుంటే మంచిది. ఇక లంచ్‌లో వెజ్ సలాడ్‌తో పాటు కాస్త అన్నం తీసుకుంటే మంచిది. రాత్రి పుల్కాలు తింటే మంచిది. అలాగే తరుచూ మజ్జిగ తాగుతూ ఉండాలి.
- బరువును తగ్గించడంలో నిమ్మ చాలా మేలు చేస్తుంది. నిమ్మరసంలో కాసింత తేనే కలుపుకొని తాగుతుంటే బరువు తగ్గే అవకాశం ఉంది. ఈ డైట్ ప్రసవం అయిపోయిన వెంటనే స్టార్ట్ చేయొచ్చు. రోజూ పొద్దున్నే తేనె కలిపిన నిమ్మరసం తీసుకుంటే చాలా మంచిది.
- ప్రసవం తర్వాత ఆడవారు రోజూ వేడినీళ్లు తాగుతుంటే బరువు తగ్గే అవకాశం ఉంది. అలాగని ఎక్కువ మోతాదులో తాగకూడదు. రోజుకు మూడు గ్లాసుల కంటే ఎక్కువ తాగడం మంచిది కాదు. వీలైతే కాస్త నిమ్మరసం కూడా అందులో కలుపుకోండి.
- లవంగాలు లవంగాలకు కూడా బరువును తగ్గించే గుణం ఉంది. కొంత నీటిలో లవంగాలు, దాల్చిన చెక్క వేసి వేడి చేసుకోండి. ఆ నీటిని కాస్త చల్లారాక వడగట్టుకుని తాగుతూ ఉండండి. ఇలా నెల రోజుల పాటు చేస్తే ప్రసవం తర్వాత కడుపు దగ్గర పేరుకుపోయిన కొవ్వు మొత్తం కరిగిపోతుంది.
- ఫ్యాట్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటే మంచిది. పాలు దాని సంబంధిత పదార్థాలతో పాటు గుడ్లు, మాంసాహారాన్ని చాలా తక్కువగా తీసుకోవాలి.

❄

ఆయిల్ మసాజ్‌తో...



ఉరుకులు పరుగుల జీవితం వల్ల చాలామందికి తలకు నూనె పెట్టుకునే తీరికే ఉండటం లేదు. దానికి తోడు తలకు నూనె పెట్టడం వల్ల ముఖం జిడ్డుబారి అంద విహీనంగా కనిపిస్తామంటూ మరికొందరు కొబ్బరి నూనె ఊసే ఎత్తడానికి చిరాకుపడతారు. కానీ దాని విలువ తెలిస్తే మాత్రం ఆలోచనల్లో మార్పు తెచ్చుకోవడం ఖాయమని నిపుణులు అంటున్నారు.

- తలకు తరచూ నూనె పట్టించి మర్దన చేయడం వల్ల కాల క్రమంలో ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. తల వెంట్రుకలు తెల్లబడకుండా ఉండటంలో కొబ్బరినూనె పాత్ర మరిచిపోలేనిది. శాస్త్రీయంగా రుజువు కానప్పటికీ తలకు క్రమం తప్పకుండా కొబ్బరి నూనె రాయడం వల్ల చిన్న వయసులోనే వెంట్రుకలు నల్లపడకుండా నిరోధించవచ్చు. తలకు నూనె పెట్టడం వల్ల మాడు చల్లపడుతుంది. జుట్టు బలంగా పెరుగుతుంది. అంతేకాదు తలకు సంక్రమించే ఫంగల్, చుండ్రు సమస్యల నుండి కూడా కొబ్బరినూనె కాపాడుతుంది.
- తలకు క్రమంగా నూనె దట్టించడం వల్ల అది కాలుష్యం నుండి మన తలను కాపాడుతుందనే సంగతి చాలా మందికి తెలియదు. ముఖాన్ని ఎప్పటికప్పుడు కడుక్కున్నట్లు తలను రోజులో మూడు నాలుగు సార్లు కడగడం కుదరని పని. అదే నూనె రాయడం వల్ల, అది వెంట్రుకలపై ఒక పొరలా ఏర్పడి కాలుష్య కారకాల వల్ల జుట్టు పాడవకుండా కాపాడుతుంది. అతి నీలలోహిత కిరణాల భారి నుండి కూడా కాపాడుతుంది.
- వేడి వాతావరణం నుండి మన తలను కొబ్బరినూనె కాపాడుతుంది. అంతే కాదు, రెగ్యులర్‌గా నూనె పట్టించడం వల్ల కుదుళ్ల బలపడతాయి. బలంగా పెరుగుతాయి. మీ జుట్టు పొడిబారిపోతుంటే తలకు నూనె పట్టించి, వేడి నీటిలో ముంచిన తువ్వాలును ముంచి నీటిని పిండిన తరువాత దాన్ని తలకు చుట్టుకోండి. కొద్ది సేపటి తరువాత నూనె మీ పొడిబారిన జుట్టు కుదుళ్లలోకి వెళ్లి పరిస్థితిలో మార్పు వస్తుంది. తలకు నూనె పట్టించడం వల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. దాని వల్ల జుట్టు రాలడం ఆగిపోతుంది. అంతాకాదు జుట్టు ఆకర్షణీయంగా, నల్లగా మారుతుంది.

ఇట్లు చేద్దాం

- సిల్క్, ఉన్ని, రేయాన్ దుస్తులను ఇస్త్రీ చేసేటప్పుడు అడుగున అల్యూమినియమ్ ఫాయిల్‌ని పరవాలి. చిన్న చిన్న ముడతలు కూడా పోయి ఇస్త్రీ పని త్వరగా పూర్తవుతుంది.
- వెండి పాత్రలు కొత్తగా మెరవాలంటే ఉప్పువేసి అల్యూమినియమ్ ఫాయిల్‌తో రుద్ది, నీళ్లతో శుభ్రపరచాలి.
- అల్యూమినియమ్ ఫాయిల్‌ను కత్తిరిస్తే బ్లేడ్స్ పదునుపెరుగుతాయి.

ద్రాక్ష తిందామా..!



- నల్ల ద్రాక్షలోని యాంటీయాక్సిడెంట్లు గుండెను కాపాడతాయి. రోజూ అరకప్పు ద్రాక్షను తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు.
- పరగడుపున తీసుకునే చిక్కని ద్రాక్ష రసం మైగ్రేన్ తలనొప్పిని తగ్గిస్తుంది.
- ద్రాక్షలో ఉండే రిస్ అనే పాలీఫినాల్ మతిమరుపు రాకుండా చేసి మెదడు చురుగ్గా ఉండేలా చేస్తుంది.
- ద్రాక్షలో ఉండే టిరోస్టిల్‌బీన్ అనే పదార్థం రక్తంలో కొవ్వు మోతాదును తగ్గించి రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది.
- పెద్దవాళ్ల కంటిలో శుక్లాలు ఏర్పడి చూపు మందగిస్తుంది. రోజూ ద్రాక్షను తీసుకుంటే శుక్లాలు ఏర్పడే అవకాశాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చు. పిల్లల కంటి చూపు కూడా మెరుగుపడుతుంది.
- ద్రాక్షలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేసి వైరల్ జ్వరాలు రాకుండా అడ్డుకుంటాయి.
- ఉబ్బసం, అజీర్తి, మలబద్ధకం, డయేరియా వంటి వ్యాధులు, దంత సంబంధ వ్యాధులను అరికట్టడంలో ద్రాక్ష ఎంతగానో ఉపయోగపడుతుంది.

❄

ఏయూ వీసీ నాగేశ్వరరావుకు కల్నల్ హోదా

- గెజిట్ విడుదల చేసిన భారత ప్రభుత్వం



విశాఖ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు కల్నల్ హోదాను పొందారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ విభాగంలో గౌరవ హోదాలో ఆయనను కల్నల్‌గా నియమించారు. ఇటీవల భారత ప్రభుత్వం ఈ మేరకు గెజిట్ ఉత్తర్వులను విడుదల చేసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆచార్య జి.నాగేశ్వరరావు ఒక్కరికే ఈ గౌరవం దక్కింది. ఇక నుంచి విశ్వవిద్యాలయానికి కల్నల్ కమాండెంట్‌గా వ్యవహరిస్తారు.

ట్రంప్ ప్రసంగాన్ని వాయిదా వేసుకోమన్న పెలోసీ

వాషింగ్టన్ : సరిహద్దు గోడ కోసం లక్షలాది మంది ఉద్యోగుల ఉసురు తీస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 29న అమెరికన్ కాంగ్రెస్‌లో చేయాల్సి వున్న వార్షిక ప్రసంగాన్ని వాయిదా వేసుకోవాలని ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సి పెలోసి ఆయనకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ షట్‌డౌన్ ఇంకా కొనసాగుతుండడం వల్ల భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆమె అన్నారు. తాను, ట్రంప్ కలసి మాట్లాడుకుని కొత్త తేదీని నిర్ణయిస్తామని ఆమె చెప్పారు. ట్రంప్ తన ప్రసంగాన్ని వాయిదా వేసుకునేందుకు అంగీకరించని పక్షంలో దానిని లిఖిత పూర్వకంగా సమర్పించ వచ్చని పెలోసి సూచించారు. హోమ్‌లాండ్ సెక్యూరిటీ మంత్రి కిర్‌స్టీన్ నీల్సన్ మాత్రం అధ్యక్షుని యూనియన్ ఆఫ్ స్టేట్ ప్రసంగానికి తాము అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

చింతపండు రైతుల ఆందోళన

- ఒత్తిడితో ఈ-నామ్‌లో పాల్గొన్న వ్యాపారులు

అనంతపురం: అనంతపురం జిల్లాలో చింతపండు రైతులు గురువారం ఆందోళనకు దిగారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి... వ్యాపారులు ఈ-నామ్‌లో పాల్గొనకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని గతంలో డీడీఎం లావణ్య హెచ్చరించారు. గురువారం అధికారులు బహిరంగ వేలాన్ని నిషేధించి, ఈ-నామ్ విధానాన్ని అమలు చేశారు. అప్పటికే అప్రమత్తమైన వ్యాపారులు సిండికేట్‌గా మారారు. చింతపండు ధరను గతవారం కంటే 60 నుంచి 70 శాతం తగ్గించారు. వ్యాపారులు ఒక్కసారిగా చింతపండు ధరను తగ్గించడంతో ఆగ్రహించిన రైతులు వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఈ-నామ్ విధానం అధికారులు అమలు చేయడంతో కర్పూరి చింత పండు రూ.7 వేల నుంచి రూ.10 వేలు, పువ్వు చింత పండు రూ.3 వేల నుంచి రూ.4 వేల ధర పలుకుతోందని రైతులు పేర్కొన్నారు. సీఐలు మార్కెటింగ్ శాఖ డీడీఎంకు విషయాన్ని వివరించారు. ఆమె వ్యాపారులను కార్యాలయానికి పిలిపించి ఈ-నామ్ విధానం అమలులో ధరలు ఎందుకు తగ్గిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విధానంలో పాల్గొనపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆగ్రహానికి గురైన వ్యాపారులు కూడా గంట పాటు రోడ్డుపై భైఠాయించారు. కొద్దిసేపు డీడీఎం, వ్యాపారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు హిందూపురం తహశీల్దార్ చల్లా విశ్వనాథ్‌ను పిలిపించారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ప్రమీల, టీడీపీ నాయకులు నాగరాజు అక్కడికి చేరుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ఈ-నామ్ విధానాన్ని రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు జ్యోతిబసు

విశాఖ : భారత రాజకీయాల్లో జ్యోతిబసుది ప్రత్యేక అధ్యయమని, దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో ప్రముఖులని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కొనియాడారు. విశాఖ జిల్లా మద్దిలపాలెంలోని సీపీఐ(ఎం) నగర కార్యాలయంలో పార్టీ ఆ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జ్యోతిబసు తొమ్మిదో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, సమకాలిన రాజకీయ నాయకుల్లో సుదీర్ఘకాలం ప్రజా జీవితం గడిపిన జ్యోతిబసు చరిష్మా వన్నెతగ్గనిదన్నారు. సమైక్యంగా మెలగడం, ముక్కుసూటిగా వ్యవహరించడం, కష్టపడేతత్వం మెండుగాగల పరిపాలనాదక్షులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు జిఎస్.రాజేశ్వరరావు, అప్పారావు, నరేంద్ర, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన ర్యాలీ

నెల్లూరు: నెల్లూరులోని వింజమూరులో మద్యం ఇసుకమాఫియా నాయకులు బుధవారం ఆంధ్రప్రభ రిపోర్టర్ రవీంద్రరెడ్డి, ప్రజాశక్తి రిపోర్టర్ హజరత్‌రెడ్డి ఇండ్లపై దాడులకు దిగారు. వీటిని ఖండిస్తూ గురువారం ఏపీయూడబ్ల్యుజే, ఏపీడబ్ల్యుజేఎఫ్, ఏపీజేఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా గెస్ట్‌హౌస్ నుంచి పోలీసుస్టేషన్ వరకూ భారీ నిరసన ర్యాలీ చేసి, దాడికి దిగిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం అమ్మకాలు, ఇసుక మాఫియాల విషయమై రెండ్రోజుల క్రితం ప్రజాశక్తి, ఆంధ్రప్రభలో వచ్చిన వరుస కథనాలతో వాటికి సంబంధించిన మాఫియా నాయకులు ఈ దాడులకు పాల్పడ్డారు.

ఉద్యోగం ఆశచూపి...

ఢిల్లీలో ఫ్యాక్టరీ ఓనర్, ఆయన మిత్రుడి అఘాయిత్యం

న్యూఢిల్లీ: భర్తతో కలహాలేర్పడి ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ఓ మహిళపై.. ఆమె అవసరాన్నే అదునుగా చేసుకుని ఇద్దరు దుండగులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఉద్యోగం పెట్టిస్తానని నమ్మించి తన మిత్రుడి ఫ్యాక్టరీకి రమ్మని సదరు వివాహితపై ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటన తూర్పు ఢిల్లీలోని ఫ్రెష్ బజార్ ఏరియాలో ఈ నెల 10న జరిగింది. కాగా, నిందితులు ఫ్యాక్టరీ ఓనర్ నజకత్ అలీ, ఆయన మిత్రుడు షకీల్ అహ్మద్‌లను మంగళవారం అరెస్టు చేశారు. ఢిల్లీలోని సీలంపూర్‌కు చెందిన మహిళ(28) తన భర్తతో విభేదాలు ఏర్పడటంతో పిల్లలను తీసుకుని తల్లితో ఉంటున్నది. అయితే ఉద్యోగం వెతుకుతుండగా షకీల్ పరిచయమై.. తన మిత్రుడి ఫ్యాక్టరీలో నౌకరి ఉన్నదని, అక్కడకు రావల్సిందిగా కోరాడు. దీంతో ఆమె ఆ కార్ఖానాకు వెళ్లింది. వెంటనే నజకత్ అలీ, షకీల్ బలవంతంగా ఆమెను ఒక గదిలోకి తీసుకెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని డీసీపీ మేఘనా యాదవ్ తెలిపారు.

ఒంటేరు, సండ్ర ఒకేసారి..

- కారెక్కనున్న నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గులాబీ బాస్, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కాంగ్రెస్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం టీఆర్ఎస్ కండువా కప్పుకోనున్నట్టు తెలిసింది. అయితే ఇప్పటి వరకూ ఈ చేరికపై అటు కాంగ్రెస్, టీడీపీ అధిష్టానాలు, టీఆర్ఎస్ నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు. ఒంటేరుకు ఎమ్మెల్సీ లేదా నామినేటెడ్ పదవి హామీ ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

సండ్ర కూడా కారెక్కుతురా..!

ఖమ్మం జిల్లా టీడీపీ నుంచి ఇద్దరు మాత్రమే ఎమ్మెల్యేలుగా గెలిచిన సంగతి తెలిసిందే. వారిలో ఒక్కరైన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సైకిల్ దిగి కారెక్కుతారాని గతకొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ పుకార్లు రావడానికి కారణాలు కూడా చాలానే ఉన్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం మొదటిసారిగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సండ్ర రాకపోవడం.. కనీసం ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించకపోవడంతో, ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్టయింది. కాగా ఐదుగురు మినహా గెలిచిన అభ్యర్థులంతా ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు.అందులో సండ్ర లేరు.

సండ్రతో టీఆర్ఎస్ నేతల చర్చలు..!

ఇప్పటికే పలుమార్లు ఈ పుకార్లను ఖండించిన సండ్ర వెంకట వీరయ్య.. మొదటి రోజు అసెంబ్లీకి రాకపోవడంతో పక్కాగా కారెక్కుతారని తెలుస్తోంది. కేసీఆర్ సమక్షంలో ఒంటేరుతో పాటు శుక్రవారం నాడే సండ్ర కూడా పార్టీలో చేరతారని తెలుస్తోంది. మరోవైపు సండ్ర చేరిక నిజమేనని ఖమ్మం జిల్లా టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సత్తుపల్లికి చేరుకున్న పలువురు టీఆర్ఎస్ నేతలు సండ్రతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. అయితే ఈ చర్చలు, చేరిక ఎంత మేరకు నిజం..? అనేది తెలియాలంటే శుక్రవారం వరకు వేచి చూడాల్సిందే మరి.

రాజుకున్న వేడి

బాబు దావోస్ పర్యటన రద్దు

- అదే బాటలో జగన్ లండన్ టూర్
- జనసేన పార్లమెంటరీ కసరత్తు పూర్తి
- ఎన్నికల వ్యూహాల్లో నేతలు బిజీ బిజీ



అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల వేడి ఒక్కసారిగా రాజుకుంది. శరవేగంగా మారతున్న రాజకీయ పరిణామాలు ఎటువంటి మలుపు తిరుగుతాయోనన్న ఆందోళన అగ్రనేతల్లో నెలకొంది. దీంతో ముందుగా ఖరారు చేసుకున్న కార్యక్రమాలను సైతం రద్దు చేసుకుని ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమవుతున్నారు. ఈ దిశలో గురువారం చోటు చేసుకున్న రెండు కీలక సంఘటనలు చోటుచేసుకున్నాయి. దావోస్ పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేసుకోగా, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కూడా లండన్ పర్యటన విషయంలో అదే విధమైన నిర్ణయం తీసుకున్నారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం ఈ నెల 22వ తేది చంద్రబాబు నేతృత్వంలోని బృందం దావోస్‌కు వెళ్ళి, ఐదు రోజుల పాటు అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిఉంది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. అయితే, మంత్రులతో గురువారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ పర్యటనను రద్దు చేసుకోవడమే మేలన్న అభిప్రాయం వ్యక్తమైంది. టీఆర్ఎస్ నేతలు జగన్‌తో భేటీ కావడం, దగ్గుబాటి కుటుంబం వైసీపీలో చేరనుందన్న వస్తున్న వార్తలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారినిక అకస్మికంగా మార్చడం కూడా ప్రస్తావనకు వచ్చింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున రెండు పార్టీల్లోనూ వలసలు చోటుచేసుకునే అవకాశం ఉందని, ఈ కీలకమైన సమయంలో చంద్రబాబు అన్ని రోజుల పాటు రాష్ట్రానికి దూరంగా ఉండటం మంచిది కాదన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైనట్లు తెలిసింది. దీంతో, చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు చేసుకున్నారు. అయితే, లోకేష్‌తో పాటు ఇతర మంత్రుల బృందం దావోస్‌కు వెళ్లనుంది. శుక్రవారం నాటి బాబు కోల్‌కత్తా పర్యటనలో ఎటువంటి మార్పు లేదని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఇటీవల సుదీర్ఘ పాదయాత్రను ముగించిన వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి లండన్‌లో చదువుకుంటున్న తన కుమార్తె వద్దకు శుక్రవారం వెళ్లనున్నారని, అక్కడే కొద్దిరోజులు ఆయన గడపనున్నారని వార్తలు వచ్చాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు సమాచారం వచ్చిన కాసేపటికే, జగన్ టూర్‌కూడా రద్దు అయింది. అయితే, జగన్ లండన్ వెళ్లనున్నట్టు తాము అధికారికంగా ప్రకటించనే లేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

మొత్తం మీద ఈ ఇరువురు నేతలు రానున్న రోజుల్లో రాజకీయ కార్యకలాపాలనే పూర్తిగా దృష్టి సారించనున్నారు. మరోవైపు జనసేన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల కసరత్తును దాదాపుగా పూర్తిచేసింది. గురువారం సాయంత్రానికి ఈ ప్రక్రియ పూర్తయినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకటి, రెండు రోజుల్లోనూ పార్లమెంటరీ స్థాయి కమిటీలను పవన్‌కళ్యాణ్ ప్రకటిస్తారని, ఆ వెంటనే శాసనసభ నియోజకవర్గాలపై దృష్టి సారించనున్నారని సమాచారం.

భర్త కిరాతకం

నిప్పంటించిన ఘటనలో భార్య, కుమార్తె, కుమారుడు మృతి

బనగానపల్లె: కట్టుకున్న భర్తే కాలయముడయ్యాడు. పిల్లల ఆలనపాలన చూడాల్సిన కన్న తండ్రి కనికరం లేకుండా భార్య, పిల్లలపై డీజిల్ పోసి నిప్పంటించి హత్య చేశాడు. ఈ సంఘటన కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం పండ్లాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన పుట్టా శివరామయ్య, వెంకటలక్ష్మమ్మ(35) భార్యభర్తలు. వీరికి పవన్ కుమార్ (12), పావని (9) పిల్లలు ఉన్నారు.

బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య వివాదం జరగడంతో భార్య వెంకటలక్ష్మమ్మ, పిల్లలు పవన్‌కుమార్, పావనిలను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు డీజిల్ పోసి నిప్పంటించినట్లు మృతురాలి తండ్రి గోవిందరాజులు, సోదరుడు వెంకటాద్రిలు తెలిపారు. సమాచారం అందిన వెంటనే నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణ, పాణ్యం ఇన్‌ఛార్జి సిఐ రవికృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి హత్యకు గల కారణాలపై విచారణ చేశారు. మృతురాలి తండ్రి, సోదరుడు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త, అత్తలపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

టీడీపీలో చేరిన మాజీ మంత్రి అహ్మదుల్లా

- కడప ఇన్‌ఛార్జీగా అర్షద్ నియామకం

అమరావతి : కడప జిల్లాకు చెందిన మాజీ మంత్రి అహ్మదుల్లా , ఆయన కుమారుడు అర్షబ్, చిత్తూరు జిలా_ సత్యవేడు నుంచి జెడి రాజశేఖర్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో గురువారం రాత్రి ఉండవల్లిలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా అహమ్మదుల్లా మాట్లాడుతూ పేదలకు చంద్రబాబు చేస్తున్న మంచి పనులను చూసి తెలుగుదేశం పార్టీలో చేరినట్టు తెలిపారు. నిధుల కొరత ఉన్నా పది రెట్లు పెన్షన్లు పెంచడం సాహసోపేతమన్నారు. పులివెందులకు నీళ్లిచ్చారని, కడపలో హజ్ హౌస్ నిర్మిస్తున్నారని అహ్మదుల్లా తెలిపారు.. అహ్మదుల్లాతో పాటు కడప జిల్లాకు చెందిన మైనార్టీ నేతలు, టిడిపిలో చేరారు. ఈ సమావేశంలో కడప ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప ఇన్‌ఛార్జీగా అర్షద్

కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీగా అర్షద్‌ను సీఎం చంద్రబాబు గురువారం రాత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తానని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామన్నారు.

పురిటిలోనే బిడ్డ మృతి

నెల్లూరు : నెల్లూరులోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో పురిటి (మగ) బిడ్డ మృతి చెందింది. బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు. నెల్లూరులోని శ్రీలంక కాలనీకి చెందిన రవికుమార్, భార్య సోనుని కాన్పు నిమిత్తం ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో సోమవారం అడ్మిట్ చేశారు. గురువారం తెల్లవారుఝామున కాన్పు కష్టం కావడంతో ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. పుట్టిన బిడ్డకు గుండె బలహీనంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక విభాగం తరలించినట్లు తెలిపారు. గంట తరువాత బిడ్డ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించి శిశువును అప్పగించారు. కాన్పులో చనిపోయడనుకున్న బిడ్డ తలకు గాయమయ్యి రక్తస్రావం అవడం బంధువులు గమనించారు. వెంటనే మృతదేహంతో 5వ నగర పోలీసు స్టేషన్‌కు వెళ్లి వైద్యులపై రవికుమార్ ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి ఆస్పత్రికి చేరుకొని ఈ ఘటనకు చెందిన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, బాధిత బంధువులు వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న జనసేన పార్టీ స్థానిక నేతలు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు మద్దతు పలికారు.

చంద్రబాబుతో డీజీపీ అత్యవసర భేటీ

- పోలీసు కస్టడీకి కిడారి హత్య కేసు నిందితులు
- నేడు విచారణకు రానున్న జగన్‌పై దాడి కేసు

అమరావతి: రాష్ట్ర డీజీపీ ఆర్‌పి ఠాగూర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో గురువారం రాత్రి ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కీలక కేసులు ఎన్ఐఎ కోర్టులో విచారణ కొనసాగుతుండటం, జగన్‌పై దాడి కేసుకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో ఎన్ఐఎ దర్యాప్తుపై పిటిషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో వీరి భేటీ అత్యంత కీలకంగా మారింది. ప్రతిపక్షనేత, వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసును సంబంధించి చర్చించారు. జగన్‌పై దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ)కు అప్పగించడంపై హైకోర్టులో పిటిషన్ వేసే అంశం గురించి చర్చించినట్టు తెలుస్తోంది. విశాఖ జిల్లా దుంబ్రిగుంట మండలం లివిటిపుట్టు గ్రామంలో అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల హత్య కేసులో ఇద్దరు నిందితులను మరో ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎడ్డల సుబ్బారావు, ఈశ్వరి , జమ్మిల శోభన్, కొర్రా కమల, డి. ధర్మయ్యలను ఎన్ఐఎ సిబ్బంది గురువారం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల్లో ఇద్దరిని ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐదు రోజులపాటు కస్టడీకి ఇస్తున్నట్లు న్యాయమూర్తి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి పార్థసారది ఆదేశాలు ఇచ్చారు. ఈశ్వరి, కొర్రా కమలకు ఈనెల 31 వరకు రిమాండ్ విదించగా, ధర్మయ్యకు ఈనెల 24వరకు రిమాండ్ విదించారు. మరో నిందితుడు పంగి నరసయ్య తనకు అనారోగ్యం ఉన్నందున కోర్టుకు హాజరుకాలేనని కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నట్టు తెలిసింది. నిందితుల తరపున వాదిస్తున్న న్యాయవాధులు అందుబాటులో లేకపోవడంతో సుబ్బారావు, శోభన్, ఈశ్వరిలకు విజయ వాడకు చెందిన సి.మల్లికార్జున శర్మను సహాయకుడిగా నియమించారు. కొర్రా కమల, ధర్మయ్య, ఆర్, యువరాజ్‌ను న్యాయ సహాయకునిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రాష్ట్ర సీఈఓగా జికె ద్వివేది

సిసోడియా ఆకస్మిక బదిలీ

- కేంద్ర జోక్యంపై అనుమానాలు
- గతంలో పురందేశ్వరి పీఎస్‌గా గోపాలకృష్ణ



అమరావతి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ -సీఈఓ) ఆర్‌పి సిసోడియా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన సీఈఓగా ప్రస్తుతం సాధారణ పరిపాలన శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న గోపాల కృష్ణ ద్వివేది నియమితులైనారు. గురువారం అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామం కలకలం రేపింది. రాష్ట్ర ప్రభుత్వం ఉలికిపడింది. సీఈఓ బదిలీకి సంబంధించి ఎటువంటి ముందస్తు కసరత్తు జరగకపోవడంతో ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయంపైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూతన సీఈఓగా నియమితులైన గోపాలకృష్ణ ద్వివేది గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన పురందేశ్వరి వద్ద ప్రైవేటు సెక్రటరీగా పనిచేశారు. 2010 సెప్టెంబర్ నుండి 2014 సెప్టెంబర్ వరకు ఆయన ఈ బాధ్యతలు నిర్వహించారు. తొలుత మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న పురందేశ్వరి ఆ తరువాత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా మారినప్పటికీ ఆమె ప్రయివేటు సెక్రెటరీగా ద్వివేది కొనసాగారు. ప్రస్తుతం పురందేశ్వరి బీజేపీలో ఉన్న విషయం తెలిసిందే. ఆమెకు, చంద్రబాబుకు మధ్య ఉన్న రాజకీయ వైరం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా ఆమె వైసీపీలో చేరే అవకాశం ఉందన్నట్టూ వార్తలు వస్తున్నాయి. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి, నరేంద్రమోడీకి మధ్య సత్సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలూ తెలిసిన విషయమే! ఈ నేపథ్యమే గోపాలకృష్ణ ద్వివేది నియమకాన్ని సందేహాస్పదం చేసింది. మరోవైపు సీఈఓ బదిలీకి సంబంధించి ఎటువంటి ముందస్తు కసరత్తు జరగకపోవడం కూడా రాష్ట్ర ప్రభుత్వంలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సీఈఓని మార్చాలంటే ముందుగా ఎన్నికల కమిషన్‌కు ముగ్గురు అధికారులతో ప్యానెల్ పంపించాల్సి ఉంటుంది. ఆ తరువాత వారిలో ఒకరిని సీఈఓగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఖరారు చేస్తుంది. ఈ ప్రక్రియ జరగడానికి కనీసం పదిహేను రోజులైనా పడుతుంది. అటువంటి కసరత్తేమి జరగలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. తనను మార్చబోతున్నారన్న సంకేతాలు కూడా సిసోడియాకు లేవని సమాచారం.

ఇమిగ్రేషన్ బిల్లు-2019ను సమగ్రంగా తేవాలి

వెల్ఫేర్ ఫండ్‌పై స్పష్టత పెరగాలి

- విదేశాల నుంచి ఇబ్బందులతో తిరిగొచ్చే ఉద్యోగులను ఆదుకోవాలి
- మానవ అక్రమ రవాణా చేసేవారిని కఠినంగా శిక్షించాలి : రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు, చదువుకునేందుకు వెళ్లే వారికి ఉపయోగపడేలా, ఆయా దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులను ఆదుకునేందుకు ఇమిగ్రేషన్ బిల్లు-2019లో సమగ్రంగా చర్చించిన అంశాలను పొందుపర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విదేశాల్లో ప్రమాదాలు గురయ్యే వారిని, చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను ఆదుకునేందుకు వెల్ఫేర్ ఫండ్‌పై విస్తృత చర్చ జరగాలని, బడ్జెట్‌లో కేటాయింపులను కేంద్రం పెంచాలని కోరారు. మానవ అక్రమ రవాణా చేసేవారిని కఠినంగా శిక్షించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రవాసీ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ అడపా సత్యనారాయణ మాట్లాడుతూ..ఏజెంట్ మోసాలకు అడ్డుకట్ట వేయాలని, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారికి క్షేత్రస్థాయి సంస్థ పాత్ర కల్పించాలని నూతన ఇమిగ్రేషన్ చట్టంలో పొందుపర్చాలని కోరారు. విదేశాల్లో పనులు దొరక్క, ఏజెంట్ల చేతిలో మోసపోయి తిరిగివచ్చే వలసదారులను ఆదుకునేందుకు ప్రత్యేక ఫండ్ కేటాయించాలన్నారు. అడ్వకేట్ రచనారెడ్డి మాట్లాడుతూ..నేటి వరకు కూడా దేశంలో సమగ్రమైన ఎమిగ్రేషన్ విధానం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో మనకంటే శ్రీలంక, నేపాల్ దేశాలు ముందంజలో ఉన్నాయన్నారు. విదేశాలకు వెళ్లేముందు అక్కడ మనకు రక్షణ ఏవిధంగా ఉంటుంది? మనం అక్కడ వెళ్లి పనిచేసే సామర్థ్యం ఉందా? ఉండటానికి సరైన వసతి సౌకర్యం లాంటి అంశాలను ముందుగానే చూసుకుని వెళ్లాలన్నారు. తెలంగాణలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 20వేల కుటుంబాలకు చెందిన వారు ఉపాధి కోసం గల్ఫ్, తదితర దేశాలకు వెళ్లారని, అక్కడ పనులు దొరక్క కొందరు, యజమానుల వేధింపులు తాళలేక మరికొందరు, పని ఒత్తిడి భరించలేక ఇంకొందరు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, వారికి సరైన న్యాయం దక్కేలా చట్టంలో పొందుపర్చాలన్నారు. విదేశాలకు వెళ్లే వారి విషయంలో అధికారులు వలసల ప్రణాళికలను రూపొందించాలని, పరిపాలన పకడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బీఎమ్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ..సరైన వీసాలతో వెళ్లినవారు బాగానే ఉంటున్నారని, ఏజెంట్ల మోసాలకు బలై దొంగ వీసాల ద్వారా వెళ్లే వారే ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, వారి రక్షణ కోసం చర్యలు చేపట్టాలని కోరారు. సోషల్ వర్కర్ కె.నరసింహనాయుడు మాట్లాడుతూ..బయటి దేశాల్లో ఉపాధికోసం వెళ్లిన వారు చనిపోతే చందాలు వేసుకుని తీసుకురావాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వమే దీనిపై ఒక విధానం రూపొందించాలని కోరారు. చదువుకున్న వాళ్ల కంటే చదువుకోనివాళ్లే ఏజెంట్ల చేతుల్లో ఎక్కువగా మోసపోతున్నారన్నారు. ఏజెంట్ వ్యవస్థపై నిఘా పెట్టి సమగ్ర విధానం తేవాలన్నారు. గల్ఫ్ బాధితుడు చాంద్ పాషా మాట్లాడుతూ.. విదేశాలకు వెళ్లే ముందు అక్కడి చట్టాలు, పరిస్థితులు పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే వెళ్లాలని సూచించారు. విదేశాలకు వెళ్లే వారి జాబితాను గ్రామ స్థాయి నుంచే రికార్డు చేసేలా చట్టంలో పొందుపర్చాలన్నారు. విదేశాలకు వెళ్లేవారికి న్యాయ సలహాలు అందేలా చూడాలన్నారు. ఈడబ్ల్యూఎఫ్ అధ్యక్షులు ఎం. భీంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఈడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి బీఎల్ సురేంద్రనాథ్, మురళీధర్ దేశ్‌పాండే, ఆదిరెడ్డి, డ్రొమెస్టిక్ వర్కర్స్ అసోసియేషన్‌కు చెందిన సిస్టర్ లాజీ జోసెఫ్, గంగయ్య, స్వదేశ్, మహ్మద్ ఇబ్రహీం ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తో వంటేరు దోస్తీ..?

వారం క్రితమే కేటీఆర్, కవితతో చర్చలు!

- పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ
- ప్రతాప్‌రెడ్డిని అస్సలే చేర్చుకోం.. : ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

నేడు కారెక్కేందుకు ప్రతాప్‌రెడ్డి రంగం సిద్ధం



ఫైల్



నవతెలంగాణ-గజ్వేల్

సై అంటే సై అన్నట్టు కేసీఆర్‌తో తేల్చుకునేందుకు సిద్ధమైన వంటేరు ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పనున్నారా? సంచలనాలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఆయన.. రాజకీయ వైరాన్ని విడిచి కేసీఆర్‌తో దోస్తానా పెట్టుకోనున్నారా? బద్ధశత్రువు అని ప్రకటించిన కేసీఆర్ సమక్షంలోనే గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారా...? అంటే అవుననే సమాధానమే విస్తృతంగా వ్యాపిస్తున్నది. రెండు పర్యాయాలు టీఆర్ఎస్ అధినేతపై పోటీచేసి ఓడిన వంటేరు.. వారం క్రితమే కేటీఆర్, కవితతో చర్చలు జరిపినట్టు, సముచిత స్థానం కల్పిస్తామని వారు హామీనిచ్చినట్టు వార్తలు ఊపందుకుంటున్నాయి. దరిమిలా తన అనుచరులతో కలిసి నేడు గులాబీ కండువా కప్పుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది.

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ముందస్తు ఎన్నికల్లో సంచలనాలకు నెలవైన విషయం విదితమే. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి వరుసగా పోటీచేసి ఓడిపోయారు. పోలింగ్‌కు ముందు కేసీఆర్‌ను ఓడించాలని స్వయంగా హరీశ్‌రావే ఫోన్ చేశారని సంచలన వ్యాఖ్యలకు తెరలేపిన ఆయన.. టీఆర్ఎస్ బాస్‌కు గట్టిపోటీనే ఇచ్చారు. ఏకంగా హరీశ్‌రావు, టీఆర్ఎస్ నేతలందరూ గజ్వేల్‌లో పాగావేసి కేసీఆర్ గెలుపునకు తీవ్రంగా శ్రమించి యాభై వేల ఓట్ల మెజార్టీ సాధించారు. అయితే ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలంగానే ఉన్నప్పటికీ ముఖ్యనేతలను కారెక్కించి.. కాంగ్రెస్‌ను ఖాళీ కుండలా మార్చాలని టీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తున్నది. అందులో భాగంగానే భవిష్యత్తులో గట్టిపోటీ ఇచ్చే నేతలకు గాలం వేస్తున్నట్టు చర్చ నడుస్తున్నది. ఇటీవలే వంటేరును పార్టీలో చేర్చుకునేందుకు కేటీఆర్ హరీశ్‌రావుతో చర్చించినట్టు, దీనిపై ఎంపీ కవిత కూడా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. బలమైన సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో టీఆర్ఎస్ అధిష్టానం కూడా వంటేరు చేరికను ఆహ్వానిస్తున్నట్టు, పూర్తి బాధ్యతను మాత్రం సీఎం కేసీఆర్, జిల్లా నాయకులే చూసుకుంటున్నట్టు సమాచారం. అదే జరిగితే నియోజకవర్గంలోని మిగతా సామాజికవర్గాలకు చెందిన బలమైన నేతలెవరూ ఉండరని టీఆర్ఎస్ భావిస్తున్నది. ఇక వంటేరు చేరికను కొందరు నేతలు వ్యతిరేకిస్తున్నా భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా తప్పదని కేటీఆర్, కవిత వారిని సముదాయించినట్టు తెలిసింది.

చేర్చుకునే ప్రసక్తే లేదు : ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

వంటేరు ప్రతాప్‌రెడ్డిని టీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తమనీ, పార్టీలో చేరాలని ఆయనను ఎవరూ సంప్రదించలేదనీ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... దురుద్దేశంతో ప్రతాప్‌రెడ్డి ఇటువంటి ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఒకవేళ ఆయన చేరుతానన్నా.. పార్టీలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆహ్వానించబోమన్నారు. ఈ విషయమై కార్యకర్తలు, నాయకులు ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు.

అమెరికాతో చర్చలకు ఉ.కొరియా ప్రతినిధి బృందం

- విదేశాంగ మంత్రితో భేటీ

వాషింగ్టన్: ఉ.కొరియా నేత కిమ్‌యోంగ్ చోల్ నేతృత్వంలోని అణుచర్చల ప్రతినిధి బృందం అమెరికాతో చర్చల నిమిత్తం గురువారం ఇక్కడికి చేరుకున్నది. చోల్ ఇక్కడ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, ఉ.కొరియాకు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ బిగన్‌తో శుక్రవారం భేటీ అవుతారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికన్ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. అయితే ఆయన వైట్‌హౌస్‌ను సందర్శించేదీ లేనిదీ వెల్లడించలేదు. ఉ.కొరియా ప్రతినిధి బృందం అమెరికా అధికారులతో ఈ వారాంతంలో భేటీ అవుతుందని అమెరికా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇందుకు సంబంధించిన వివరాలేవీ ప్రకటించకపోవటం విశేషం. 'అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధ్యక్షుడు ట్రంప్, ఉ.కొరియా ఛైర్మన్ కిమ్‌జోంగ్ ఉన్‌ల మధ్య సత్సంబంధాలు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య తరచు చర్చలు కొనసాగుతాయి' అని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు వివరించారు.

నిర్దేశిత లక్ష్య సాధనలో ముందుకు సాగుతున్నామని, కొరియా ద్వీపకల్పంలో పూర్తి స్థాయి అణు నిరాయుధీకరణను సాధిస్తామని ఆయన చెప్పారు. ఉ.కొరియా ఛైర్మన్ కిమ్ జోంగ్ ఉన్‌తో మలి భేటీ కోసం అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని, ఇందుకు సంబంధించిన తేదీ, వేదిక ఇంకా నిర్ణయించాల్సివుందని అన్నారు. ఉ.కొరియా ప్రతినిధి బృందం అమెరికన్ అధికారులతో వాషింగ్టన్‌లో జరుపనున్న భేటీలో ఈ అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.



అమెరికన్ కాంగ్రెస్ ఇంటెలిజెన్స్ కమిటీ సభ్యుడిగా

- ఇండియన్ అమెరికన్ రాజా కృష్ణమూర్తి



వాషింగ్టన్ : ఇంటెలిజెన్స్‌పై కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా ఇండియన్ అమెరికన్ రాజా కృష్ణమూర్తి (45) నియమితులయ్యారు. అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాలను బలోపేతం చేసే శక్తివంతమైన ఈ కమిటీలో నియమితుడైన మొదటి దక్షిణాసియా జాతీయుడు ఈయనే. అమెరికన్ కాంగ్రెస్‌లో ఇల్లినాయిస్ 8వ జిల్లాకు డెమొక్రటిక్ పార్టీ తరపున ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అమెరికాకు సంబంధించి 17 ఇంటెలిజెన్స్ సంస్థల బడ్జెట్ వ్యవహారాలు, కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత హెచ్‌పిఎస్‌సిఐ (నిఘాపై కాంగ్రెస్ శాశ్వత సెలక్ట్ కమిటీ)దే. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ బుధవారం కృష్ణమూర్తి నియామకాన్ని ప్రకటించారు. కీలకమైన ఈ కమిటీ దీర్ఘకాల సాంప్రదాయమైన ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా, సమగ్రతను పరిరక్షించేలా వ్యవహరించగలదన్న ఆశాభావాన్ని పెలోసి వ్యక్తం చేశారు. అమెరికా జాతీయ భద్రతను పటిష్టపరిచేందుకు డెమొక్రాట్లు చేస్తున్న కృషికి దోహదపడేలా ఈ కమిటీ కొత్త సభ్యులు చర్యలు తీసుకోగలరని ఆశిస్తున్నట్లు తెలిపారు.

విశ్వాస పరీక్షలో నెగ్గిన గ్రీస్ ప్రభుత్వం

- త్వరలో మరో కీలక ఓటింగ్



ఏథెన్స్ : గ్రీక్ ప్రధాని అలెక్సిస్ సిప్రాస్ బుధవారం గ్రీక్ పార్లమెంట్‌లో విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. మెసిడోనియా పేరు మార్పుకు సంబంధించిన ఒప్పందాన్ని ధృవీకరించేందుకు అవసరమైన కీలకమైన ఓటింగ్ త్వరలో జరగనుంది. మొత్తంగా 300మంది సభ్యులు గల పార్లమెంట్‌లో 151మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేయగా, 148మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఒకరు గైర్హాజరయ్యారు. పొరుగున గల పూర్వపు యుగోస్లావ్ రిపబ్లిక్ మెసిడోనియా పేరుకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకు గతేడాది కుదిరిన ఈ ఒప్పందాన్ని పాలక సంకీర్ణంలోని జూనియర్ భాగస్వామి తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. దాంతో సిప్రాస్ ఆదివారం విశ్వాస పరీక్ష నిర్వహణకు పిలుపిచ్చారు. దేశ సుస్థిరత, విశ్వసనీయత పునరుద్ధరణకు ఈ విశ్వాస ఓటు ఎంతో కీలకమని ఓటింగ్ జరగడానికి ముందుగా చేసిన ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. మైనారిటీలో పడినందున వెంటనే పదవి నుండి వైదొలగి, సత్వర ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్లు వెలువడుతున్న నేపథ్యంలో సిప్రాస్ మాట్లాడుతూ, మొత్తంగా యూరప్ వ్యాప్తంగా 13 మైనారిటీ ప్రభుత్వాలు వున్నాయని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం న్యూ డెమొక్రసీ పార్టీ నాయకుడు మిస్తోటేకిస్ మాట్లాడుతూ, "పాలక సంకీర్ణం ఈ రోజుకు 151మంది ఎంపీల విశ్వాసాన్ని పొందినా వాస్తవానికి పార్లమెంటరీ గ్రూపులో వున్నది 145మంది ఎంపీలే. ఇది డీ ఫ్యాక్టో మైనారిటీ ప్రభుత్వం." అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలా అస్థిరతతో వుంటే అభివృద్ధి బాటలో పయనించడం కష్టమని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందిస్తూ సిప్రాస్, తన పదవీ కాలం ముగిసే వరకు అధికారంలో వుంటానని విశ్వాసం వ్యక్తం చేశారు.

సిప్రాస్ సర్కార్ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు

- గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ విమర్శ





ఏథెన్స్ : గ్రీస్‌లో సిప్రాస్ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఓటు వేసింది. గత ప్రభుత్వాలు కొనసాగించిన ప్రమాదకరమైన, ప్రజా వ్యతిరేక విధానాలనే ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని విమర్శించింది. అమెరికా, నాటో, జర్మనీలకు, యురోపియన్ యూనియన్‌లోని దేశీయ శక్తులకు నిర్దిష్టమైన హామీలను ఈ ప్రభుత్వం ఇచ్చిందని కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) ఒక ప్రకటనలో విమర్శించింది. ఈ హామీలన్నీ కూడా కేవలం ఎన్నికల వల్లనే పూర్తవుతాయి, అందుకే గతంలో ట్రంప్, ఇప్పుడు జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్ చేసినట్లుగా సిరిజా ప్రభుత్వం పట్ల పూర్తి స్థాయి విశ్వసనీయతను ప్రకటించడానికి ఈ విశ్వాస పరీక్ష అవశ్యమైందని కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. ప్రెస్పెస్ ఒప్పందాన్ని ఎంతో పురోగతితో కూడినదిగా ప్రభుత్వం అభివర్ణిస్తున్నప్పటికీ వాస్తవానికి అది పూర్తి భిన్నమైనదని వ్యాఖ్యానించింది. పశ్చిమ బాల్కన్ ప్రాంతంలో యూరో-అట్లాంటిక్ ప్రాంతాల మధ్య సంబంధాలను మెరుగుపర్చేందుకు, రష్యా వంటి ఇతర కేంద్రాల ప్రాబల్యాన్ని బలహీనపరిచేందుకు అవసరమైన పద్ధతిలో ఈ ఒప్పందాన్ని అమలు చేయాలని అమెరికా, నాటో, ఇయులు భావిస్తున్నాయి. ఈ శక్తులేవీ కూడా శాంతి భద్రతలకు హామీ కల్పించలేవని కెకెఇ పేర్కొంది. ఈ కారణాలన్నింటి వల్లనే సిప్రా-జేవ్ ఒప్పందానికి వ్యతిరేకంగా కెకెఇ ఓటు వేసిందని పేర్కొంది. అమెరికా, నాటో నీచపూరితమైన ఎత్తుగడలకు వ్యతిరేకంగా, ఉమ్మడి పోరాటాలను, సంఘీభావాన్ని పరిరక్షిస్తూ ఓటు వేసినట్లు కెకెఇ ఆ ప్రకటనలో పేర్కొంది.

విశ్వాసపరీక్ష నెగ్గిన మే...!

- బ్రెగ్జిట్‌పై ఏకాభిప్రాయానికి మరోసారి ప్రయత్నం



లండన్: బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే నేతృత్వంలోని ప్రభుత్వంపై బుధవారం పార్లమెంట్‌లో ప్రతిపక్ష లేబర్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. దీనితో ఐరోపా కూటమి నుండి నిష్క్రమించే (బ్రెగ్జిట్) అంశంపై పార్లమెంట్‌లో మరోసారి ఏకాభిప్రాయానికి కృషి చేసేందుకు ప్రధాని మే కు మార్గం సుగమమైంది. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొన్న మొత్తం 325 మంది సభ్యుల్లో 306 మంది తమకు మే సర్కారుపై విశ్వాసం వుందని ప్రకటించటం గమనార్హం. అంతకు 24 గంటల ముందే బ్రెగ్జిట్‌పై ప్రధాని మే ఇయుతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని భారీ మెజార్టీతో ఎంపిలు తిరస్కరించిన విషయం తెలిసిందే. కూటమి నుండి నిష్క్రమించాల్సిన గడువు మార్చి 29 దగ్గర పడుతున్న ప్రస్తుత సమయంలో గత అర్థశతాబ్దిలో ఎన్నడూ లేని రీతిలో రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న బ్రిటన్ 1973లో తాము చేరిన ఐరోపా కూటమి నుండి నిష్క్రమించాలా? వద్దా? అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రయోజనకరమైన ఒప్పందం లేకుండా బ్రెగ్జిట్‌ను నివారించేందుకు పార్లమెంట్ సభ్యుల మధ్య ఏకాభిప్రాయ సాధన, లేదా ఇయు సభ్యత్వంపై మరో రిఫరెండం కోరటం వంటి అంశాలపై తాను సీనియర్ నేతలతో మరింత విస్తృత చర్చలు జరుపుతానని ప్రధాని మే చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానంపై విజయం సాధించిన అనంతరం ఆమె తన పార్టీ ఎంపిలతో మాట్లాడుతూ ఐరోపా కూటమి నుండి నిష్క్రమించాలన్న ప్రజల తీర్పు అమలు చేస్తామన్న హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

కెన్యా హోటల్‌పై దాడిలో 21కిపెరిగిన మృతులు

ట్రంప్ నిర్ణయానికి నిరసనగానే ఈ దాడి అని ప్రకటన

- ఖండించిన ఇజ్రాయిల్ ఎంబసీ



నైరోబి : కెన్యా రాజధాని నైరోబిలో హోటల్‌పై జరిగిన దాడిలో మృతుల సంఖ్య 21కి పెరిగింది. మృతుల్లో అమెరికా, బ్రిటన్ పౌరులు కూడా వున్నారు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న చర్యకు ప్రతీకారంగా ఈ దాడికి పాల్పడినట్లు అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్ షాబాబ్ ప్రకటించింది. ఫైవ్‌స్టార్ డ్యూసిట్ డి2 హోటల్, నైరోబిలోని వాణిజ్య సముదాయంపై రాళ్ళు, గ్రెనెడ్లు విసిరింది తామేనని సోమాలికి చెందిన అల్ షాబాబ్ పేర్కొంది. దాదాపు 20గంటల పాటు హోటల్‌ను మొత్తంగా తన అధీనంలోకి తీసుకుని మారణకాండ సృష్టించారు. ఈ దాడిలో మరణించిన వారిలో అమెరికన్ సిఇఓ జాసన్ స్పిండ్లర్ (40) వున్నారు. న్యూయార్క్‌లో 9/11 దాడుల్లో బతికి బయటపడ్డ స్పిండ్లర్ ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. కాగా వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు ఉగ్రవాదులను ఏరిపారేశాయి. కాగా బుధవారం ఉగ్రవాదులు ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ తీసుకున్న తెలివితక్కువ నిర్ణయానికి మూల్యం చెల్లించినట్లు చెప్పారు. కాగా, కెన్యాలోని ఇజ్రాయిల్ ఎంబసీ ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. అమాయకులపై జరిపిన మరో దాడిగా అభివర్ణించింది. రెండు దేశాలు కలిసి ఉగ్రవాదంపై పోరు సల్పుతాయని ప్రకటించింది.

పంచాయతీ తెచ్చిన పంచాయితీ

మాజీ మంత్రి జూపల్లి ఓటమి ప్రభావం

- కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎదురుగాలి
- ఉమ్మడి పాలమూరు జిల్లాలోనూ అదే స్థితి
- అనుచరులున్నా మద్దతుపై అనుమానాలు






నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల ఓటమి ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపైనా స్పష్టంగా కనిపిస్తోంది. ఆ స్థానాల్లో గెలిచిన వారు మరింత ఉత్సాహంతో ముందుకెళ్తుండగా, ఓడిన వారు ఇంకా దాన్నుంచి తేరుకోలేకపోతున్నారు. గతంలో ఐదుసార్లు గెలిచిన నాయకుడిగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్న పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా శాసన సభ ఎన్నికల్లో ఓటమి చెందారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన భీరం హర్షవర్ధన్‌రెడ్డి రెట్టింపు ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో ముందుకెళ్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఆధిక్యత వచ్చిన గ్రామాల్లో దృష్టి సారించి అత్యధిక సంఖ్యలో సర్పంచులను గెలిపించుకోవాలని పావులు కదుపుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో 40 గ్రామాల్లో టీఆర్ఎస్‌కు ఎదురుగాలి వీస్తుండగా, మరో 20 గ్రామాల్లో నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. 40 గ్రామాల్లో మాత్రం టీఆర్ఎస్ బలపర్చిన వ్యక్తులు సర్పంచులుగా గెలిచే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో జూపల్లి అనుచరులున్నా.. ఆయన ఓటమి నేపథ్యంలో వారంతా సర్పంచ్ ఎన్నికల్లో ఎటువైపు మొగ్గు చూపుతారో తెలియని స్థితి నెలకొంది.

జూపల్లి ఓటమి ప్రభావం..


(ఫైల్)

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి జూపల్లి ఓడిపోవడంతో ఈ జిల్లాలో టీఆర్ఎస్‌కు స్థానిక ఎన్నికల్లోనూ గట్టిషాక్ తగిలే పరిస్థితి నెలకొంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో 16 గ్రామాలున్నాయి. ప్రధానంగా పట్టణంలో మొదటి నుంచి జూపల్లి పట్ల వ్యతిరేకత ఉంది. ఇక మిగతా గ్రామాల్లో జూపల్లికి అనుకూల వాతావరణం ఉన్నా.. అధికారంలో ఉన్నప్పుడు ఆయన వ్యవహరించిన తీరుపట్ల వ్యతిరేకత ఏర్పడింది. అందువల్ల ఈసారి స్థానిక ఎన్నికల్లో సగానికిపైగా కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులే సర్పంచులుగా గెలిచే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా మొలచింతలపల్లి, ఎల్లూరు, కుడికిల్ల వంటి గ్రామాల్లో జూపల్లి పట్ల పూర్తి వ్యతిరేకత ఉంది. చిన్నంబావి మండలంలో 11, వీపనగండ్లలో 14, పెంట్లవెల్లిలో 10, పెద్దకొత్తపల్లిలో 25, కోడేరులో 22, పాన్‌గల్ మండలంలో 28 గ్రామాలున్నాయి. మండల కేంద్రాలతో పాటు పెద్ద గ్రామాలు పూర్తిగా జూపల్లికి వ్యతిరేకంగా ఉన్నాయి. పెంట్లవెల్లి, మొలచింతలపల్లి, పాన్‌గల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీశైలం నిర్వాసితులు అధికంగా ఉన్నారు. వీరంతా జూపల్లి గ్రామాల్లో రాకుండా కట్టడి చేశారు. ఫ్లెక్సీలు కట్టి మరీ నిరసనలు తెలిపారు. ఈ క్రమంలోనే స్థానిక ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలోనూ..

అధికార పార్టీ టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలో 14 శాసనసభ సభ్యులకుగాను 13 మందిని గెలిపించు కున్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాస్త ఆందోళనగానే ఉంది. భూ మాఫియా, ఇసుక మాఫియా, దళారీ వ్యవస్థను నడిపి కోట్ల రూపాయలు దండుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే స్థానిక ఎన్నికల్లో సర్పంచులుగా బరిలోకి దిగుతున్నారు. దాంతో అధికార పార్టీ స్థానిక నాయకుల పట్ల ఓటర్లలో కొంత వ్యతిరేకత ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రభావం స్థానిక ఎన్నికలపై ఉండే అవకాశం లేదు. అందుకే స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవ ఫార్ములాను తీసుకొస్తున్నారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థుల ను గెలిపించుకోవడానికి ఎన్ని తాయిలాలైనా వెనుకాడరా దని హుకుం జారీ చేస్తున్నారు. మాజీ మంత్రి జూపల్లి ఓడిపోవడంతో ఆయన అనుచరులు అనేకమంది రాజకీయాలకు అంటిముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం ఉంది. దీంతో ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా పంచాయతీల్లో సర్పంచులుగా ఇతర పార్టీలు బలపర్చిన అభ్యర్థులే గెలిచే అవకాశాలున్నట్టు చర్చ సాగుతోంది.

కారు బోల్తా.. భార్యాభర్తలు మృతి

- కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ- డిచ్‌పల్లి

తీర్థయాత్రలు ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణమైన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నాకతండా వద్ద జాతీయ రహదారిపై వారి కారు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వారి కుటుంబసభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం వేకువజామున జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ వివరాల ప్రకారం..

అదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన 9 మంది కుటుంబ సభ్యులు, డ్రైవర్ ఈనెల 11న కారులో తీర్థయాత్రలకు బయల్దేరారు. యాత్రలు ముగించుకుని తిరిగి అదిలాబాద్‌కు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున డిచ్‌పల్లి మండలం నాకతండా వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గౌరీశెట్టివార్ ప్రకాశ్(74), చాంది(68) దంతపతులిద్దరూ అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. కారులో ఉన్న గౌరీశెట్టివార్ శివప్రసాద్, అతని భార్య హారిక, పిల్లలు గాయత్రి, శౌర్య, శివప్రసాద్ వదిన సుష్మిత, ఆమె పిల్లలు శితీజ్, జగన్నాథ్, డ్రైవర్ శ్రీనివాస్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వీరిని అంబులెన్స్‌లో నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతివేగం, అజాగ్రత్తే ఈ ప్రమాదానికి కారణమని శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

బీడీ యాజమాన్యాలకు తొత్తుగా ప్రభుత్వం

- కార్మికులకు 26 రోజుల పని కల్పించాలి: తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు
- మెదక్ జిల్లా నిజాంపేటలో ధర్నా



నవతెలంగాణ - నిజాంపేట

కార్మికుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం బీడీ కంపెనీ యాజమా న్యాలకు తొత్తుగా వ్యవహరిస్తోందని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు అన్నారు. ఠాకూర్ బీడీ కంపెనీ కార్మికులకు 26 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన బీడీ, సిగరెట్ల మీద పుర్రె బొమ్మ గుర్తు, జీఎస్టీ వల్ల కంపెనీలకు, కార్మికులకు నష్టం వాటిల్లింద న్నారు. నష్టాల పేరుతో కార్మికుల సమస్యలు యాజమాన్యాలు పరిష్కరిం చడం లేదన్నారు. యాజమాన్యాలతో మాట్లాడి కార్మికుల హక్కులు హరించబడకుండా చూడాల్సింది కార్మికశాఖ అని చెప్పారు. మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. దుబ్బాక, రామాయంపేట, నిజాంపేట మండలాల్లో ఎక్కువ మంది బీడీ కార్మికులున్నారని తెలిపారు. వారి పక్షాన స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తి బీడీ కార్మికుల పక్షాన నిలబడాలని కోరారు. మండలంలో కరువు ఏర్పడటం వల్ల వ్యవసాయ పనులు కూడా లేవని చెప్పారు. యాజ మాన్యం కార్మికులకు పని కల్పించాలని కోరారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడి న్యాయం చేసే వరకు కంపెనీ ఎదుట దీక్ష చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు బాలమణి, సిద్దిపేట జిల్లా నాయకులు భాస్కర్, లింగం, బండారి రాజు, తాడిమల్ల బాబు, సురేష్, రాజు, పిట్లకృష్ణ, దేవదాస్, పాలకుర్తి యాదగిరి పాల్గొన్నారు.

కూలి సమస్యను పరిష్కరించాలి

- స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్ష : తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్




నవతెలంగాణ-సిరిసిల్ల

టెక్స్‌టైల్ పార్క్ పవర్‌లూం కార్మికుల కూలి సమస్యలను ఎమ్మెల్యే కేటీఆర్ పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట టెక్స్‌టైల్‌పార్క్ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కూరపాటి మాట్లాడుతూ.. టెక్స్‌టైల్‌పార్క్ పవర్‌లూం కార్మికుల కూలీ రేట్లు పెంచాలని నెల రోజులుగా పోరాడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కూలి ఒప్పందం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా కొత్త ఒప్పందం చేయకపోవడంతోనే నిరాహార దీక్ష చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. 11 రోజుల నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మూషం రమేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పంతం రవి, టెక్స్‌టైల్‌పార్క్ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు అన్నల్‌దాస్ గంగాధర్, అధ్యక్షుడు కూచన శంకర్, కార్యదర్శి కోడం రమణ పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయమే కీలక రంగం


- రైతు రెట్టింపు ఆదాయమే లక్ష్యం: అగ్రివిజన్-2019 సదస్సులో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయమే కీలక రంగమని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా ఎంతో మంది పరోక్షంగానో, ప్రత్యక్షంగానో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. రెండు రోజులపాటు జరిగే అగ్రివిజన్-2019 సదస్సును ఆయన గురువారం హైటెక్‌సిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులను కల్పించడం వల్ల పేదరికాన్ని నిర్మూలించడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ జీడీపీలో వ్యవసాయ రంగం 18 శాతం వాటా కలిగి 50 శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తోందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిలో ప్రపంచంలోనే ఏడో స్థానం సాధించామని తెలిపారు. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, మాంసం, సముద్రపు చేపల ఉత్పత్తి చేయడంలో ముందున్న దేశాల వరుసలో ఉందన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజల విషయంలో మాత్రం వెనుకబడి ఉన్నామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారత ఆహార పరిశ్రమ ఇంకా ముందుకెళ్లాలని సూచించారు. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, రైతుల ఆదాయంపెంపు, పంటల వైవిధ్యం, ఉపాధి కల్పన, ఎగుమతుల ఆదాయం పెంచడంలోనూ వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగాల అనుసంధానంలోనూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ కీలకమన్నారు. దేశ వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న 172 దేశాల్లో భారత్‌ది ప్రత్యేక స్థానమన్నారు. అయితే ప్రపంచంలోని సాగుకు అనుకూలమైన 57.8 మిలియన్ హెక్టార్ల భూమిలో భారతదేశం కేవలం 1.5 మిలియన్ హెక్టార్ల భూమి పురాతన కాలం నుంచి పశువుల పెంపకం భారతీయ వ్యవసాయంలో అంతర్భాగమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి వి. ప్రవీణ్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పంట కాలనీల ఆలోచనకు అనుగుణంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుకూలంగా పని చేస్తున్నదని చెప్పారు. నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల నీటి లభ్యత పుష్కలంగా అందుబాటులోకి రానున్నదన్నారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయం ప్రతినిధులు, కార్మెల్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంచనాలన్నీ తారుమారయ్యాయ్..



ఎన్టీఆర్ కథానాయకుడు



వినయ విధేయ రామ



ఎఫ్ 2



పేట

సంక్రాంతి పండుగ ముగిసింది. పండగతోపాటే సినిమాల సందడి కూడా సద్దుమణిగింది. ఈ ఏడాది కూడా సంక్రాంతి బరిలోకి నాలుగు సినిమాలు విడుదలైనప్పటికీ ష్యూర్ హిట్ అని ఏ సినిమా కూడా విడుదల రోజే అనిపించుకోలేకపోయింది. ఏ సినిమాకి ఆ సినిమా బాగుందని, బాగోలేదని, అలా ఉందని, ఇలా ఉందని అటు ప్రేక్షకులు, ఇటు ఆయా హీరోల అభిమానులు రకరకాలుగా డిస్కస్ చేసినప్పటికీ మొత్తమ్మీద ఫలితం మాత్రం భేష్ అనిపించుకోలేదు. నాలుగు సినిమాలు ఒకేసారి విడుదలవ్వడం పెద్ద మైనస్ అయితే, ఏ సినిమా బాగుంది అనే కంపారిజన్ కూడా ఫర్వాలేదనిపించుకున్న సినిమాపై తీవ్ర నెగటివ్ ప్రభావం చూపింది.

ఏడాది మొత్తంలో సంక్రాంతి పండక్కి ఉండే క్రేజ్ చాలా ప్రత్యేకమైనది. సెలవులు ఎక్కువగా ఉండటంతో ఒకేసారి మూడు, నాలుగు సినిమాలు విడుదలవుతుంటాయి. అందుకు తగ్గట్టే ఫ్యామిలీ అంతా సినిమాలు చూసేందుకు ఉత్సుకతతో ఉంటారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఒక డబ్బింగ్ సినిమాతో కలిపి నాలుగు చిత్రాలు సంక్రాంతి కానుకగా సందడి చేస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచడానికి వచ్చాయి. సంక్రాంతి బరిలో ప్రేక్షకులకు కావల్సిన ఎంటర్‌టైన్‌మెంట్‌ని ఏ చిత్రం పంచింది? ఏ సినిమా జనాదరణ పొందిందనే విషయాలను ఎనాలిసిస్ చేస్తూ మొత్తమ్మీద ఏ సినిమా సంక్రాంతి విజేతగా నిలిచిందో చూద్దాం..

సంక్రాంతి సినిమా పండగ 'ఎన్టీఆర్ కథానాయకుడు'తో ఆరంభమైంది. లెజెండరీ నటుడు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా రూపొందిన రెండు భాగాల్లో ఇది మొదటిది. క్రిష్ దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్‌గా ఆయన తనయుడు, హీరో బాలకృష్ణ నటించారు. ఈ నెల 9న విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనని రాబట్టుకుంది. ఎన్టీఆర్ అభిమానుల మన్ననలు పొందినప్పటికీ సాధారణ ప్రేక్షకులను మాత్రం మెప్పించలేకపోయింది. ఎన్టీఆర్ జీవితంలోని అందరికి తెలిసిన సంఘటనలే చూపించారని, సినిమాల కోసం ఆయన పడ్డ స్ట్రగుల్స్, ఎత్తుపల్లాలు, నెగటివ్ అంశాలు చూపించకపోవడం, అంతా పాజిటివ్‌గానే సాగడంతో సినిమాలో కొత్తదనం లేదని, తెలియని విషయాలు ఏమీ చూపించలేదనే విమర్శని కూడా ఎదుర్కొంది. దీనికి తోడు యువ ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ అంతగా కుదరకపోవడంతో, ఎన్టీఆర్ మార్క్ హావభావాలు కనిపించలేదనే కామెంట్స్ కూడా వినిపించడం ఈ సినిమాకి మైనస్ అయ్యింది. స్లోగా సాగడం సినిమాకి మరో పెద్ద మైనస్. అయితే తన నటనతో బాలకృష్ణ మాత్రం నట విశ్వరూపం చూపించారని అటు ప్రేక్షకులు, ఇటు అభిమానులు సైతం ముక్తకంఠంతో చెప్పడం విశేషం. ఎన్టీఆర్ బయోపిక్ కావడంతో దీన్ని అందరూ ఓ ప్రత్యేక సినిమాగా భావించారు. కథానాయకుడిగా ఎన్టీఆర్ వైభవాన్ని కాకుండా మహానాయకుడి ప్రస్థానం వైపే దర్శక, నిర్మాతలు ఎక్కువ ఫోకస్ చేయడంతో 'ఎన్టీఆర్-కథానాయకుడి'కి న్యాయం చేయలేకపోయారు. దీంతో ఈ సినిమా టాక్ పరంగానే కాకుండా కలెక్షన్ల పరంగానూ ఆశించిన స్థాయిలో రాబట్టుకోలేకపోతోంది.

రజనీకాంత్ నటించిన అనువాద సినిమా 'పేటా' జనవరి 10న రిలీజ్ అయ్యింది. గల్లీ లీడర్, గల్లీ రాజకీయాల ప్రధానంగా రివేంజ్ యాక్షన్ డ్రామాగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా కూడా గత గురువారం విడుదలై పర్వాలేదనిపించుకుంది. తెలుగులోనే మూడు భారీ సినిమాల విడుదల ఉండటంతో థియేటర్ల కొరత సమస్యను 'పేట' ఎదుర్కొంది. అయితే సినిమా పరంగా ఓవరాల్‌గా దీనికి మంచి టాకే వచ్చింది. పాత రజనీకాంత్‌ని గుర్తు చూసేలా ఆయన మార్క్ స్టయిల్, మాస్ ఎలిమెంట్స్ ఫ్యాన్స్‌ని బాగా ఆకట్టుకుంటున్నాయి. కథ పరంగా గొప్పగా లేకపోయినా రజనీ ఇమేజ్, నటనతో మెస్మరైజ్ చేశారు. విజయ్ సేతుపతి, బాబీ సింహా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, సిమ్రాన్, త్రిష వంటి భారీ తారాగణం, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు టేకింగ్ కూడా సినిమాకి ప్లస్ అయ్యాయి. రజనీ ఫ్యాన్స్‌కి మాత్రమే ఇది విందు భోజనం లాంటి సినిమా. ప్రేక్షకులకు మాత్రం ఇదొక సాదాసీదా సినిమానే. కథ మీద కంటే రజనీ స్టయిల్, ఫైట్స్ మీదే దర్శక,నిర్మాతలు ఫోకస్ చేయడమే ఈచిత్రానికి ప్రధాన లోపం. అలాగే ఎంచుకున్న కథలో కూడా బలమైన కంటెంట్ లేకపోవడం కూడా పెద్ద మైనస్ అయ్యింది. ఈ లోపాల కారణంగా ఈ సినిమా సైతం శభాష్ అనిపించే రేంజ్‌లో కలెక్షన్లను రాబట్టలేకపోతోంది.

ఇక సంక్రాంతిని పురస్కరించుకుని రామ్‌చరణ్, బోయపాటి కాంబినేషన్‌లో తొలిసారి రూపొందిన చిత్రం 'వినయ విధేయ రామ' గత శుక్రవారం విడుదలైంది. దాదాపు 80 కోట్లతో నిర్మితమైన ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ 90 కోట్లు కావడం విశేషం. కానీ సినిమా ఫస్ట్ షో నుంచి నెగటివ్ టాక్ తెచ్చుకుంది. కథే లేకపోవడం, శృతిమించిన యాక్షన్ ఎపిసోడ్స్, లాజిక్‌కి అందని సన్నివేశాలు సినిమాకి అతి పెద్ద ప్రధాన లోపాలుగా నిలిచాయి. ప్రేక్షకుల్ని విస్మయానికి గురి చేసేలా ఈచిత్రంలోని ఫ్యామిలీ సన్నివేశాలు, ఫైట్లు, పతాక సన్నివేశాలుండటం గమనార్హం. రామ్‌చరణ్‌కి ఉన్న ఇమేజ్, మెగా అభిమానుల సపోర్ట్, సంక్రాంతి పండుగ క్రేజ్ కారణంగా సినిమా భారీ ఓపెనింగ్స్‌ని రాబట్టుకుంది. ఆ నెక్ట్స్ డే నుంచి కలెక్షన్లు డ్రాస్టిక్‌గా తగ్గిపోయాయి.

సంక్రాంతి పోటీలోకి దిగిన మరో సినిమా 'ఎఫ్2' (ఫన్ అండ్ ఫ్రస్టేషన్). వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. భార్యాభర్తల మధ్య జరిగే గొడవల వల్ల వచ్చే ఫన్, ఫ్రస్టేషన్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా సంక్రాంతిని పురస్కరించుకుని గత శనివారం విడుదలై మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. కథ పరంగా కొత్తగా లేకపోయినా, జబర్దస్త్‌కి ఎక్స్‌టెన్షన్ కామెడీ స్కిట్‌లా ఉన్నప్పటికీ వెంకటేష్ మార్క్ హాస్యం సినిమాలో బాగా పేలింది. వెంకీ ఈజ్ బ్యాక్ అనేలా తనదైన నటనతో ఆయన అబ్బురపరిచారు. సినిమాని తన భుజాలపై వేసుకుని విజయ తీరానికి చేర్చారు. తమన్నా, మెహరీన్ గ్లామర్ ఈ సినిమాకి బాగా కలిసొచ్చే అంశమైంది. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ సినిమా మంచి కలెక్షన్లని రాబడుతూ హిట్ సినిమా అనిపించుకుంటోంది. కుటుంబమంతా కలిసి చూసేలా ఉండటం ఈ సినిమాకి పెద్ద ప్లస్ అయ్యింది.

మొత్తమ్మీద ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన సినిమాలపై ప్రేక్షకులు, అభిమానుల అంచనాలన్నీ తారుమారై తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది.

నవచిత్రం

ఎల్వీ ప్రసాద్ అందరికీ ఆదర్శం

- ఎల్వీ ప్రసాద్ 111వ జయంత్యుత్సవంలో బాలకృష్ణ



వైవీఎస్ చౌదరి, రాధా ప్రసాద్, రమేష్ ప్రసాద్, బాలకృష్ణ, గీతాంజలి

'ఎల్వీ ప్రసాద్ గురించి చెప్పడమంటే సూర్యుడికి వెలుగు చూపించడమే అవుతుంది. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి' అని బాలకృష్ణ అన్నారు. ప్రముఖ దిగ్గజ సినీ దర్శకుడు, నిర్మాత ఎల్వీప్రసాద్ 111వ జయంతి గురువారం. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్‌లో ఆయన జయంతి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన బాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఎల్వీ ప్రసాద్ ఒక వ్యవస్థ. నటుడు కావాలనుకున్నారు. పలు సినిమాల్లోనూ నటించారు. ఆ తర్వాత దర్శకుడిగా మారారు. సినిమా రంగంలో తనకిష్టమైన అన్ని శాఖల్లోనూ కృషి చేశారు. ప్రసాద్ ల్యాబ్స్ అనే గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. అందుకే ఐ ఇన్‌స్టిట్యూట్‌ని ఏర్పాటు చేశారు. మద్రాస్‌లో ఉన్నప్పుడు మేం ఎదురెదురిళ్ళలో ఉండేవాళ్ళం. గతాన్ని ఎవరూ మర్చిపోకూడదు. భావి తరాలకి చెప్పాలి. ఎల్వీ ప్రసాద్ కలల్ని ఆయన తనయుడు రమేష్ ప్రసాద్ సాకారం చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'మా నాన్నకి సినిమా తప్ప మరేమి తెలియదు. ఇంట్లోవాళ్ళని కూడా ఎక్కువగా కలిసేవారు కాదు. ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకి వెళ్లే దారిలో రెస్ట్ తీసుకునేవారు. నేను ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఈ రంగంలోకి వచ్చా. అంతకు ముందే నన్ను నటుడిని చేయాలన్నది నాన్న కోరిక. 'సంసారం' సినిమా షూటింగ్‌లో చాలా సేపు స్టూడియోలో కూర్చోవడం ఇష్టం లేక ఆయన్ని విసిగించాను. అప్పటి నుంచి నాకు నటనపై ఆసక్తి పోయింది. మా ప్రసాద్ ప్రాసెసింగ్ ల్యాబ్‌కి 17 సార్లు జాతీయ పురస్కారం దక్కింది. మా నాన్నకి పృథ్వీరాజ్ కపూర్ ఫ్యామిలీ అంటే ఇష్టం. వాళ్ళలాగా మా కుటుంబం కూడా సినిమాల్లోనే ఉండాలని కోరుకునేవారు. అప్పట్లో జితేంద్రలాంటి వారు మా నాన్నగారి పాదాలను తాకేవారట. నాన్నకి ఎక్కువగా సామాజిక బాధ్యత ఉండేది' అని ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేష్ ప్రసాద్ తెలిపారు.

దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ, 'ఎల్వీప్రసాద్, ఎన్టీఆర్ ఇద్దరూ మహావృక్షాలు. సినిమా రంగంలో సంపాదించుకున్నదాన్ని సినిమాల్లోనే పెట్టారు. ఎన్టీఆర్ వారసత్వాన్ని బాలకృష్ణ, ఎల్వీప్రసాద్ వారసత్వాన్ని రమేష్ ప్రసాద్ కొనసాగిస్తున్నారు. 'లాహిరిలాహిరి లాహిరిలో' సినిమా సమయంలో నేను ప్రసాద్ ల్యాబ్స్‌కి రూ.8.75లక్షలు కట్టాల్సి ఉన్నప్పటికీ రమేష్ ప్రసాద్ సాయం చేశారు. అలాగే 'రేయ్' సినిమా ఆయన ఆశీస్సులతోనే విడుదలైంది. బాలకృష్ణ తన తండ్రి మీద బయోపిక్ తీసి అందరి మెప్పు పొందారు. ఎల్వీప్రసాద్‌పై ఆయన తనయుడు రమేష్ ప్రసాద్ ఓ బయోపిక్ తీయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో నటి గీతాంజలి, సురేష్ కొవ్వూరి, రాధాప్రసాద్, జర్నలిస్ట్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఇస్మార్ట్ శంకర్ ఆరంభానికి రెడీ



రామ్, పూరీ జగన్నాథ్

రామ్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 'ఇస్మార్ట్ శంకర్' పేరుతో ఓ సినిమా తెరకెక్కబోతున్న విషయం విదితమే. పూరీ కనెక్ట్స్ సహకారంతో పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తున్నారు. త్వరలో సినిమా ప్రారంభం కానుంది. ఆ విశేషాలను చిత్ర బృందం తెలియజేస్తూ, 'డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ఎనర్జిటిక్ స్టార్ రామ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇస్మార్ట్ శంకర్ పాత్రలో రామ్ నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌లో రామ్ తలకిందులుగా సిగరేట్ తాగుతూ కొత్తగా డిఫరెంట్‌గా ఉన్నాడు. ఆయన ఈ సినిమా కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఈ నెల 23న సినిమాని ప్రారంభించనున్నాం. 24 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ని జరుపుకోనుంది. త్వరలోనే సినిమాలో నటించే ఆర్టిస్టులు, టెక్నీషియన్ల వివరాలను తెలియజేస్తాం' అని తెలిపింది.

సానుభూతే కారణం..



నిత్యా మీనన్

'జయలలితపై, ఆమె రాజకీయ జీవితంపై నాకు సానుభూతి ఉంది. అందుకే ఆమె బయోపిక్‌లో నటించేందుకు అంగీకరించా' అని అంటోంది నిత్యా మీనన్. అలనాటి మహానటి, తమిళనాడు మాజీ సీఎం జయలలిత జీవితం ఆధారంగా తమిళంలో 'ది ఐరన్ లేడీ' పేరుతో ఓ బయోపిక్ రూపొందుతుంది. ప్రియదర్శిని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జయలలిత పాత్రలో నిత్యా మీనన్ నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్‌కి విశేషమైన స్పందన లభించింది. సినిమా అంగీకరించడానికి గల కారణం గురించి నిత్యా పై విధంగా స్పందించింది. 'జయలలిత జీవితంలో బలమైన కల్పనా శక్తి ఉంది. అది నన్ను ఇన్‌స్పైర్ చేసింది' అని తెలిపింది. ఈ సినిమాని తమిళంతోపాటు తెలుగు, హిందీలోనూ విడుదల చేయనున్నారు. మరోవైపు జయలలిత జీవితం ఆధారంగానే దర్శకుడు గౌతమ్ మీనన్ ఓ వెబ్ సిరీస్‌ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణని ఎంపిక చేశారు. దీనికిగానూ ఆమె భారీగా రెమ్యూనరేషన్ తీసుకుంటున్నారట. పాత్రకు తను యాప్ట్‌గా ఉండటంతో ఆమె అడిగినంత ఇచ్చేందుకు నిర్మాతలు సైతం అంగీకరించారట. ఈ వెబ్ సిరీస్‌ని తమిళంతోపాటు తెలుగు, హిందీ, మలయాళంలోనూ చిత్రీకరించబోతున్నారు.


అతిథిగా ప్రీ-రిలీజ్ వేడుక



ఎన్టీఆర్

ఓ హీరో సినిమా ఫంక్షన్‌కి మరో హీరో అతిథిగా రావడమనే ఆరోగ్యకరమైన వాతావరణం టాలీవుడ్‌లో నెలకొనడటం సంతోషించదగ్గ విషయం. తాజాగా అఖిల్ చిత్ర ఫంక్షన్‌కి ఎన్టీఆర్ గెస్ట్‌గా హాజరు కాబోతున్నారు. అఖిల్ ప్రస్తుతం 'మిస్టర్ మజ్ను' చిత్రంలో నటిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకని త్వరలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'థమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు ఇటీవల విడుదలై శ్రోతలని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాంగ్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను ఈ నెల 19న హైదరాబాద్‌లోని జే.ఆర్.సీ కన్వెన్షన్ సెంటర్‌లో గ్రాండ్‌గా నిర్వహించబోతున్నాం. ఈ వేడుకకి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన మా వేడుకకి అతిథిగా వచ్చేందుకు అంగీకరించడం చాలా ఆనందంగా ఉంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాని రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 25న గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం' అని తెలిపింది.

అదే నాకు దక్కిన పెద్ద గిఫ్ట్..



జాక్వెలిన్ ఫెర్నాండేజ్

'బాలీవుడ్‌లో నటించడమనేది నాకు దక్కిన పెద్ద గిఫ్ట్. కెరీర్ పరంగా నాకెలాంటి అసంతృప్తి లేదు' అని అంటోంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్. మోడల్‌గా కెరీర్‌ని ప్రారంభించిన జాక్వెలిన్ ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 'హౌస్‌ఫుల్ 2, 3', 'మర్డర్ 2', 'కిక్', 'బ్రదర్స్', 'డిష్యూమ్', 'రేస్ 2', 'జుడ్వా 2' వంటి విజయవంతమైన సినిమాల్లో నటించి బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈ సందర్భంగా తన కెరీర్ గురించి జాక్వెలిన్ ఎనాలిసిస్ చేస్తూ, 'ఈ జర్నీ నాకొక బహుమతి లాంటిది. ఎన్నో మంచి అవకాశాలు నన్ను వరించాయి. పెద్ద దర్శకులు, భారీ చిత్రాల్లో నటించే ఛాన్స్ వచ్చింది. సక్సెస్‌తోపాటు ఫెయిల్యూర్ కూడా ఎదుర్కొన్నాను. జయాపజయాలు నా కెరీర్‌ని బ్యాలెన్స్ చేయడంతోపాటు నిలకడగా సాగేలా చేశాయి. ప్రస్తుతం నేనున్న స్థానంలో చాలా హ్యాపీగా ఉన్నా. ఈ జర్నీకి కారణం నా ఆలోచనలు, కెరీర్ విషయంలో ఎలాంటి అసంతృప్తి లేదు. కొత్త వ్యక్తుల్ని కలిసినప్పుడు కొత్త అనుభవం వస్తుంది. కొత్త పాఠాలెన్నో నేర్చుకుంటాం. జీవితానికి కొత్త దారి దొరుకుతుంది. అభిమానులు, ప్రేక్షకుల ప్రేమే నాకు అతి పెద్ద అస్సెట్. ఇప్పటి వరకు నా కెరీర్‌లో ఎంతో అభిమానగణాన్ని సంపాదించాను. అందుకు చాలా హ్యాపీగా ఉంది' అని తెలిపింది. ప్రస్తుతం 'డ్రైవ్' చిత్రంలో జాక్వెలిన్ నటిస్తోంది.

ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు..



బ్రహ్మానందం

'నాన్న (బ్రహ్మానందం) ఆరోగ్యం నిలకడగా ఉంది. నాన్న పట్ల అభిమానులు చూపుతున్న ప్రేమకి, అభిమానానికి కృతజ్ఞతలు' అని బ్రహ్మానందం తనయుడు, హీరో గౌతమ్ అన్నారు. హాస్యనటుడు బ్రహ్మానందంకి హార్ట్ ఆపరేషన్ అయినట్టు వార్తలు వచ్చిన విషయం విదితమే. దీనిపై ఆయన తనయుడు గౌతమ్ స్పందించారు. 'కొన్ని నెలలుగా ఛాతిలో అసౌకర్యంగా అనిపించడంతో హైదరాబాద్‌లోని ప్రముఖ డాక్టర్‌ని సంప్రదించారు. వారి సలహా మేరకు శస్త్ర చికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. దేశంలోనే అత్యుత్తమమైన ముంబయిలోని ఏషియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం గుండె ఆపరేషన్ విజయవంతంగా పూర్తయ్యింది. ప్రముఖ హృదయ చికిత్స నిపుణులు శ్రీ రమాకాంత్ పాండా నాన్నకి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఐసీయు నుంచి సాధారణ గదికి మార్చారు. నాన్నగారికి ఆపరేషన్ జరిగిందని తెలిసి అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమలోని ప్రముఖులు ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సుల వల్ల నాన్నగారి ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉంది. వారిందరికీ థ్యాంక్స్' అని గౌతమ్ తెలిపారు.

నయా సినిమా షూటింగ్ షురూ..



కార్తికేయ

'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం విదితమే. జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, స్ప్రింట్ టెలీ ఫిల్మ్స్ పతాకాలపై అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హీరో కార్తికేయ మాట్లాడుతూ, "ఆర్‌ఎక్స్100' తర్వాత చాలా కథలు విన్నా. వాటిలో అర్జున్ జంధ్యాల చెప్పిన ఈ కథ బాగా నచ్చింది. ఆడియెన్స్‌కి చెప్పడానికిది మంచి కథ అనిపించింది. గురువారం నుంచి ఒంగోలులో రెగ్యులర్ షూటింగ్‌ని జరుపుతున్నాం' అని అన్నారు. 'నేను బోయపాటి శ్రీను వద్ద దర్శకత్వ శాఖలో పనిచేశాను. ఆయన నాకు గురువు మాత్రమే కాదు, సోదర సమానులు. కార్తికేయ నన్ను, నా కథని నమ్మారు. ఆయన వల్లే సినిమా త్వరగా పట్టాలెక్కుతుంది. ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్ దొరికారు. కథానుగుణంగా ఒంగోలులో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తాం' అని దర్శకుడు తెలిపారు. నిర్మాతలు చెబుతూ, 'ఈ చిత్రంతో నిర్మాతలుగా అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. గురువారం నుంచి ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో తొలి షెడ్యూల్‌ని చిత్రీకరిస్తాం. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను తెరకెక్కిస్తాం. త్వరలోనే చిత్ర టైటిల్‌ని ప్రకటిస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: చైతన్య భరద్వాజ్, కెమెరా: రామ్, ఆర్ట్: జీ.ఎం.శేఖర్.

మహిళలు ఉద్యోగాలు కోరుకోవడంలేదా?

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాలను సృష్టిస్తు న్నప్పటికీ... ఒక అబద్ధపు, నమ్మదగని గణాంకాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.

దేశంలో మహిళలు - ఉపాధి

. వాస్తవానికి.. లేబర్ బ్యూరో అసంఘటితరంగంపై 2015 వరకూ సమాచారాన్ని క్రమం తప్పకుండా విడుదలచేసేది. అయితే, దేశంలో నిరుద్యోగం రేటును కొలిచే ఉద్యోగం, నిరుద్యోగంపై నిర్వహించే సర్వేను నిలిపివేయాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 2016-17 గణాంకాలు విడుదల కాలేదు. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం.. 2004 నుంచి దేశంలో విభిన్న రంగాల్లో మహిళా ఉద్యోగినుల సంఖ్య రానురాను తగ్గిపోతున్నది. 2004 నుంచి 2012 జనాభా లెక్కల ప్రకారం దేశంలో రెండు కోట్ల మంది మహిళలు ఉద్యోగాల నుంచి అర్ధంతరంగా తప్పుకున్నట్టు వెల్లడైంది. 1993-94లో 42శాతం మంది మహిళా కార్మికులు ఉండగా.. అది 2011-12కి ఈ సంఖ్య 31శాతానికి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల సంఖ్య 49శాతం నుంచి 37.8శాతానికి పడిపోయింది.

మహిళా కార్మిక భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏండ్లలోపు (1000 మంది ఉద్యోగుల సంఖ్యలో) 1992లో 33.0శాతం, 2011లో 25.3శాతం ఉన్నారు. పట్టణ మహిళల్లో ఇదే గణాంకాలను పరిశీలిస్తే... 1993లో 16.5శాతం నుంచి 2011లో 15.5 శాతానికి తగ్గింది. ఈ గణాంకాలను కేంద్ర మంత్రిత్వ శాఖ తిరస్కరించలేదు, దీనికి ఆయన ఒక సరళమైన వివరణ కూడా ఇచ్చారు. ఈ మహిళలు కేవలం పని చేయకూడదనే ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడంలేదనీ, అందువల్ల వారు దేశంలో నమోదైన నిరుద్యోగుల సంఖ్యతో లెక్కించరాదని ప్రభుత్వం చెబుతున్నది.

కేవలం ఏదో ఒక ఉద్యోగం

కుటుంబం ఒక నిర్దిష్ట ఆదాయ స్థాయికి చేరుకున్న తర్వాత పనిచేయకూదని మహిళలు నిర్ణయానికి వస్తారన్నది తరచుగా వినిపించే వాదన. ఒక పురుషుడు ఉద్యోగం చేయాలనుకుంటే.. ఆయనకు ఎవరి అనుమతీ అక్కరలేదు. మరోవైపు ఒక యువతి లేదా మహిళ ఉద్యోగం చేయాలనుకుంటే మాత్రం.. ఆమెకు తండ్రి, సోదరుడు, భర్త, ఇతర కుటుంబసభ్యులు.. కొన్ని సందర్భాల్లో గ్రామ పంచాయతీల అనుమతిని కూడా తీసుకోవాల్సిన పరిస్థితులు మన దేశంలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'నాణ్యమైన ఉపాధి' మహిళలకు మరింత ముఖ్యం. ఇది సురక్షితమైనదీ, ఇంటికి సమీపంలో, స్థిరమైన పని గంటలు ఉండే విధంగా ఉండాలి. ఈ అవసరాలు తీర్చగల ఉద్యోగం లభించనప్పుడు మహిళలు శ్రమశక్తిలో భాగస్వాములు కావడంలేదన్నది మరోవాదన. దేశంలో వేతనాల చెల్లింపులోనూ లింగవివక్ష తీవ్ర స్థాయిలో వున్నది. 2018లో అజీమ్ ప్రేమ్జీ యూనివర్సిటీ ప్రచురించిన నివేదిక ప్రకారం.. ఉద్యోగం, విద్య స్థాయిని బట్టి పురుషుడి వేతనంతో పోలిస్తే మహిళల వేతనాలు 35నుంచి 85శాతం మధ్యలో ఉంటున్నది.

పరిశీలకులను ఆశ్చర్యపరిచే వాస్తవం ఏమిటంటే.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిలో భాగంగా కఠినమైన శారీరక శ్రమకు సైతం మహిళలు ముందుకు రావడం. వాస్తవానికి, 2005లో ఈ పథకం అమలు ప్రారంభమైన తర్వాత ప్రజానిర్మాణ పనుల్లో మహిళా కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వర్కింగ్ ఇండియా నివేదిక ప్రకారం, 'దాదాపు 5.8 మిలియన్ల సాధారణ స్థితిగల మహిళా కార్మికులు గ్రామీణ నిర్మాణ రంగంలో చేరారు. 2004-05 నుండి 2011-12 వరకు వీరిలో 50శాతం మంది ప్రజా నిర్మాణ పనుల్లో ఉన్నారు'. సమానపనికి సమానవేతనం, మెరుగైన పని పరిస్థితుల ప్రాముఖ్యతను విస్మరించరాదని ఇది నిరూపించింది.

నిటి ఆయోగ్ ప్రచురించిన ఒక పరిశోధనా పత్రం ఈ వాదనను సమర్థించింది. గ్రామీణ భారతంలో 'నిరుత్సాహకరమైన పని పరిస్థితులు' గ్రామీణ మహిళా కార్మికులపై పడుతున్నది తెలిపింది. మహిళా కార్మిక శక్తిని పెంపొందించే సాంప్రదాయిక విధానాలు (విద్య, నైపుణ్యాలు, చట్టపరమైన నిబంధనలు వంటివి) తగినంతగా లేవు.

పని ఏమిటి?

మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం తగ్గడానికి పని పరిస్థితులది ప్రధాన పాత్ర. కుటుంబంలో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం, లింగవివక్ష మరో అంశం. శ్రామిక శక్తిలో లేని స్త్రీలు పని చేయకూడదనుకుంటున్నారన్నది జవదేకర్ వాదన. వాస్తవానికి 'పని'గా గుర్తించని శ్రమలో గృహ కార్మికులు చాలా బిజీగా ఉన్నారు. సాంకేతికత, పిల్లల సంరక్షణ వసతులు మహిళలు ఇంటి బయట పనిచేసే పరిస్థితులను పశ్చిమ దేశాల్లో కొంతవరకు కల్పించాయి. కానీ, మన దేశంలో మహిళల శ్రమను 'పని'గా గుర్తించే పరిస్థితులు లేవు. సమానపనికి సమానవేతనం లేదు, విద్యా, ఉద్యోగాల్లో మెరుగైన పని పరిస్థితులూ లేవు.

ఒకవైపుకుటుంబ బాధ్యతలు.. మరోవైపు ఉద్యోగ బాధ్యతలు రెండూ చూసుకోవటం మహిళలకు కష్టమైన పని అయినప్పటికీ ఇబ్బందులను భరిస్తూ ఎంతోమంది ఉద్యోగాలు చేస్తున్నారు.


సామాజిక సమస్యలే కారణం..

మహిళా ఉద్యోగులు తగ్గిపోవటానిక సామాజిక సమస్యలే కారణమని వెల్లడైంది. పెళ్లికాని అమ్మాయిల కంటే పెళ్లయిన వాళ్లే ఎక్కువగా ఉద్యోగాలు చేస్తున్నారు. అవివాహితుల్లో కేవలం 21శాతం మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తుంటే పెళ్లయినవారిలో మాత్రం 41శాతం మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరు అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తప్పుకోవటానికి ప్రధాన కారణం పెళ్లి. కాన్పుల సమయంలో చాలామంది ఉద్యోగాలను వదులుకుంటున్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు పెళ్లికాని యువతులను వారి తల్లిదండ్రులు ఉద్యోగాల కోసం బయటకు పంపడం లేదని నిపుణులు చెబుతున్నారు. వేతనాలలో వ్యత్యాసం, రెగ్యులర్ ఉద్యోగాలు కాకపోవటంతో మహిళలు చాలామంది ఉద్యోగాలు చేయటానికి ఇష్టపడటం లేదని తెలిసింది.

ఇతర దేశాలతో పోలిస్తే..

ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ సర్వే ప్రకారం మహిళా ఉద్యోగులు విధుల నుంచి తప్పుకోవటానికి కారణాలు అనేకం అయినప్పటికీ 131 దేశాలలో సర్వే నిర్వహించగా.. మనదేశం రేటు 121 ఉన్నది. ప్రస్తుతం అమెరికా కన్నా జపాన్‌లోనే మహిళలు ఎక్కువగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పటికీ ప్రపంచంలోకెల్లా చిన్న దేశమైన డెన్మార్క్‌లోనే ఎక్కువ మంది మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు. డెన్మార్క్ తర్వాత స్థానాల్లో జర్మనీ, కెనడా, బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు ఉన్నాయి. మహిళా ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాల్లో మాతత్వంతో పాటు పితత్వ సెలవులు కూడా ఇవ్వడం గమనార్హం.

కొలువు దీరారు



(మొదటిపేజీ తరువాయి)

నాగేందర్ (టీఆర్ఎస్)కు కూడా ఇదే సమస్యతో ఉన్నారు. అసెంబ్లీ సిబ్బంది సాయంతో నడుచుకుంటూ లోనికి వచ్చారు. ఎమ్మెల్యేందరికీ అసెంబ్లీకి సంబంధించిన నియమ నిబంధనలు, ప్రొసీడింగ్స్, రూల్స్‌ను తెలిపేందుకు వీలుగా బుక్‌లెట్స్‌ను ముద్రించారు. వాటితో కూడిన బ్యాగులను వారికి అందించారు. ఒక్కొక్కరికి ఒక్కో ల్యాప్‌ట్యాప్ కూడా అందజేసినట్టు తెలిసింది.

గన్‌పార్కు వద్ద నివాళులు...

శాసనసభ ప్రారంభానికి ముందు గన్‌పార్కు వద్ద గల అమర వీరుల స్థూపానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయన వెంట హోం మంత్రి మహమూద్ అలీ ఉన్నారు. అనంతరం టీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ అమర వీరుల స్థూపానికి నివాళులర్పించారు.

అంతటా బారికేడ్లు...

శాసనసభా సమావేశాల ప్రారంభం.. గన్‌పార్కు వద్ద నివాళుల కార్యక్రమం సందర్భంగా అసెంబ్లీ చుట్టుపక్కలగల రోడ్లన్నింటినీ పోలీసులు బ్లాక్ చేశారు. బషీర్‌బాగ్ చౌరస్తా, బాబూ జగ్జీవన్‌రామ్ కూడలి, వ్యవసాయశాఖ కమిషనరేట్ తదితర ప్రాంతాలన్నింటినీ బారికేడ్లతో మూసేశారు. దీంతో అరగంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సీఎల్పీ నేతగా భట్టి?

నేడు సస్పెన్స్‌కు తెర

- ఎంపిక బాధ్యత రాహుల్‌దే...
- ఏకవాక్య తీర్మానం పంపిన నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎల్పీ నేత ఎవరనే సస్పెన్స్‌పై శుక్రవారం తెరపడనుంది. శాసనసభా పక్ష నేతగా మధిర శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క పేరును అధిష్టానం ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్షం కమిటీ (సీఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కెసి వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా, జాతీయ కార్యదర్శులు సలీం అహ్మద్, శ్రీనివాసన్ హాజరయ్యారు. సీఎల్పీ నేత ఎవరనేదానిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ముఖాముఖి భేటీ అయ్యారు. 19 మంది ఎమ్మెల్యేల్లో ఇద్దరు మినహా 17 మంది ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క పేరు చెప్పినట్టు సమాచారం. అనంతరం సీఎల్పీ ఎంపిక బాధ్యతను ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీకి కట్టబెడుతూ సభ్యులు ఏక వాక్య తీర్మానం చేసి, అధిష్టానానికి పంపించారు. దీనిపై తుది నిర్ణయాన్ని అధిష్టానం శుక్రవారం ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ నేత ఒకరు తెలిపారు. సమావేశానంతరం కెసి వేణుగోపాల్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ శాసనసభ్యులతో సమావేశం నిర్వహించామన్నారు. సీఎల్పీనేత ఎంపిక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీకే వదిలి పెడుతూ పార్టీ శాసనసభాపక్ష కమిటీ ఏక వాక్య తీర్మానం చేసిందని తెలిపారు. ఈ అంశంపై పార్టీ సీనియర్ నాయకులు, కోర్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీలతోపాటు పీసీసీ ఇన్‌చార్జి కుంతియాతోనూ సంప్రదింపులు జరిపినట్టు చెప్పారు. అతి త్వరలోనే రాహుల్‌గాంధీ సీఎల్పీనేతను ఎంపిక చేస్తారని తెలిపారు.

అంతా మా ఇష్టం

(మొదటిపేజీ తరువాయి)

పత్రాలను సమర్పించకుండానే కొనసాగుతుండటం గమనార్హం. రెండేండ్లు వరుసగా ఆర్థిక నివేదిక సమర్పించలేదు.

గతేడాది ఆగస్టులో ప్రచురితమైన ఓ పత్రిక కథనం ప్రకారం.. 2016కల్లా ఒక ప్రయివేటు బ్యాంక్, మరొక కో-ఆపరేటివ్ బ్యాంక్, ఒక ప్రభుత్వ సంస్థ నుంచి కుసుమ్ ఫైన్‌సర్వ్ రూ. 97.35 కోట్ల రుణ సదుపాయాన్ని పొందింది. ఇందులో అహ్మదాబాద్‌లో అమిత్ షా యాజమాన్యం కలిగిన రెండు స్థిరాస్తుల తనఖా కింద కలుపూర్ కమర్షియల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ నుంచి రూ. 25కోట్ల రుణాన్ని జయ్ షా కంపెనీ పొందింది. ఈ రెండు ప్లాట్ల ఓనరుగా అమిత్ షా అని కచ్చితంగా అందులో పేర్కొన్నారు. దీంతో కుసుమ్ ఫైన్‌సర్వ్‌కు అమిత్ షా ఆస్తి కాంటిజెంట్ లయబిలిటీగా ఉన్నట్టు అవగతమవుతుంది. విచిత్రంగా 2017లో రాజ్యసభ సీటు కోసం అమిత్ షా దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో దీని ప్రస్తావనే లేదు. ఇది రిప్రెజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ కింద నేరమవుతుంది. ఆయన నామినేషన్‌ను తిరస్కరించవచ్చు కూడా.

గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2017లో జయ్ షా కంపెనీకి లీజు ఇచ్చిన 15,754.83 చదరపు మీటర్ల భూమి తనఖాపై కుసుమ్ ఫైన్‌సర్వ్ రూ. 17కోట్ల రుణాన్ని పొందింది. సనంద్ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌లోని లీజుకు ఇచ్చిన ఈ భూమిలో ప్రస్తుతం ఓ ఫ్యాక్టరీ ఉంది. బ్యాంకు దస్తావేజులు.. ఆ ఫ్యాక్టరీ పీపీ, హెచ్‌డీపీఈ, జంబో బ్యాగ్‌లను తయారు చేస్తున్నట్టుగా పేర్కొంటుండటం గమనార్హం. అయితే ప్రస్తుతం జయ్ షా కంపెనీ నెట్‌వర్త్, మ్యాన్యుఫాక్చరింగ్ సదుపాయం పొందడంపైనా ఆ కంపెనీ ఆర్థిక నివేదిక సమర్పిస్తేనే పూర్తి స్పష్టత వస్తుంది. అయితే ఈ నివేదిక సమర్పించడంలో కుసుమ్ ఫైన్ సర్వ్ విఫలమైనందుకు ఏవైనా చర్యలు తీసుకున్నారా అనే విషయాన్ని ఆరా తీసేందుకు అహ్మదాబాద్ ఆర్‌ఓసీ, జయ్ షాలనూ సంప్రదించగా.. సమాధానం రాలేదని 'ది కారవాన్' పత్రిక తెలిపింది.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఇల్లందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నాయక్ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. తనను ఎన్నుకున్నందుకు నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పోడు భూములు, బయ్యారం స్టీల్ ప్లాంట్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడనని స్పష్టం చేశారు.

బీజేపీకి విరాళాల వాటా 93శాతం

(మొదటిపేజీ తరువాయి)

రూ.164.30 కోట్లమేర విరాళాలు అందించిన సంస్థ ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్. ఇందులో బీజేపీకి రూ.154.30 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.10 కోట్లు ఆ సంస్థ అందించింది. బీజేపీకి అందిన మొత్తంలో ఈ సంస్థ నుంచి అందింది 35 శాతం కాగా, కాంగ్రెస్‌కు 38 శాతం. ఈ రెండు పార్టీలకు కార్పొరేట్ సంస్థల నుంచే అధిక మొత్తం అందాయి. కార్పొరేట్ల నుంచి బీజేపీకి రూ.400.23 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.19.29 కోట్లు అందాయి.

బీజేపీకి 2977మంది, కాంగ్రెస్‌కు 777మంది,సీపీఐ(ఎం)కు 196మంది, సీపీఐకి 176మంది,ఎన్‌సీపీకి 42మంది, తృణమూల్‌కు 38మంది విరాళాలు ఇచ్చారు. బీజేపీకి ఢిల్లీలోనే విరాళాలు అధికంగా (రూ.208.56 కోట్లు) వచ్చాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో రూ.71.93 కోట్లు, గుజరాత్‌లో రూ.44.02 కోట్లు, కర్నాటకలో రూ.43.67 కోట్లు, హర్యానాలో రూ.10.59 కోట్లు వచ్చాయి.

హెచ్‌సీయూలో ఉద్రిక్తత

రోహిత్‌వేముల వర్ధంతి సభకు అంతరాయం

- ప్రజాసంఘాల నేతలను వర్సిటీ గేటు వద్ద ఆపేసిన పోలీసులు
- రోహిత్ తల్లి రాధికకు అనుమతి నిరాకరణ
- విద్యార్థుల ఆందోళనతో అనుమతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో మరోసారి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల మూడో వర్ధంతి సభకు హాజరయ్యేందుకు రోహిత్ తల్లి రాధిక వేములతో పాటు వివిధ దళిత, ప్రజాసంఘాల నేతలు వర్సిటీకి వచ్చారు. దీంతో వారిని పోలీసులు వర్సిటీ గేటు వద్ద అడ్డుకున్నారు. వర్సిటీలోకి బయటి వ్యక్తులకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం నెలకొన్నది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు గేటు వరకూ భారీర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున్న వీసీ అప్పారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు విద్యార్థినేతలతో చర్చలు జరిపి, ముఖ్యనేతలను వర్సిటీలోకి పంపించేందుకు అనుమతించారు. దీంతో రాధిక వేములతో పాటు పలువురు దళిత నేతలు వెలివాడ వరకూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం రోహిత్ వేముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాధిక వేముల మాట్లాడుతూ...తనకొడుకు రోహిత్ చావుకు వీసీ అప్పారావే కారణమని ఆరోపించారు. అతన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడుతున్నాయని చెప్పారు. రోహిత్ మతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మూడేండ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వర్ధంతి సభలో ఫాతిమా నఫీజ్ (జేఎన్‌యూ విద్యార్థి నజీబ్ తల్లి), మ్యాదరి రాజు(మ్యాదరి వెంకటేశ్ సోదరుడు), అడ్వకేట్ జై భీంరావ్, పుల్యాల రవి(పుల్యాల రాజు సోదరుడు), పెరుమల్ల బాలస్వామి(ప్రణయ్ తండ్రి), అనూప్ కుమార్, డాక్టర్ కేవీ రత్నం, జేబీరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

పౌరసరఫరాల సంస్థ

చైర్మెన్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు నేడు

నవతెలంగాణ బ్యూరో - హైదరబాద్

పౌరసరఫరాల సంస్థ చైర్మెన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత సిద్దిపేట జిల్లాకు శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ పౌరసరఫరాల సంస్థ చైర్మెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి హెూంమంత్రి మహమ్మద్ అలీ, తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు, ఎంఎల్‌ఏ టి. హరీష్‌రావులతో పాటు మాజీ మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్పొరేషన్ చైర్మెన్‌లు హాజరుకానున్నారు.

ప్రయివేటు బీమా కంపెనీలకు లాభాలు 3000 కోట్లు..

(మొదటిపేజీ తరువాయి)

కింద ఇచ్చింది రూ.8,831 కోట్ల 78 లక్షలు మాత్రమే. అంటే ప్రయివేట్ కంపెనీలకు చేకూరిన లబ్ది రూ.3000 కోట్లు. మరోవైపు అదే ఆర్థిక సంవత్సరం ప్రభుత్వరంగ(పీఎస్‌యూ) బీమా సంస్థలు రూ.4085 కోట్లమేర నష్టపోయాయి. పీఎస్‌యూలు ప్రీమియం కింద వసూలు చేసింది రూ.13,411 కోట్ల 10 లక్షలు కాగా, రైతులు క్లెయిమ్ చేసింది రూ.17,496 కోట్ల 64 లక్షలు. అంటే పీఎస్‌యూలు ప్రీమియం కింద వసూలు చేసినదానికన్నా రైతులకు నష్టపరిహారంగా చెల్లించిందే అధికమని అర్థం.

ప్రధానమంత్రి పంటల బీమా పథకం(పీఎంఎఫ్‌బీవై)లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం కింద 98 శాతం చెల్లిస్తాయి. రైతులు చెల్లించాల్సింది 2 శాతం మాత్రమే. అల్ప వర్షపాతం, వరదలు, తుఫాన్ల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ఈ పథకం కింద బీమా కంపెనీల నుంచి నష్టపరిహారం పొందే వీలున్నది. అయితే, ప్రభుత్వ బీమా కంపెనీలు రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో ముందుండగా, ప్రయివేట్ సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఈ లెక్కల్ని చూస్తే ఎవరికైనా అర్థమవుతోంది.

ఉద్యోగాల పేరుతో 161మందికి కుచ్చు టోపి

- మెట్రో, ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలంటూ మోసం
- బాధితుల నుంచి రూ.80లక్షలు వసూలు
- ఇద్దరు అరెస్టు, పరారీలో మరో ఇద్దరు

నవతెలంగాణ- హయత్‌నగర్

ఉద్యోగాల పేరుతో దాదాపు 161మంది నుంచి సుమారు రూ.80లక్షల వరకు వసూలు చేసి మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో మరోటి వెలుగుచూసింది. బాధితులు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం బయటపడింది. గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ మురళీధర్ భగవత్ ఎల్బీనగర్‌లోని తన కార్యాలయంలో నిందితుల వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వెలగపూడి రామకృష్ణ అంబర్‌పేట తిలక్‌నగర్‌లో ఉంటున్నాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మహాలక్ష్మి హైదరాబాద్‌లోని ఎర్రమంజిలి కాలనీలో ఉంటోంది. వీరిద్దరితోపాటు ఫతేనగర్‌కు చెందిన అడ్వకేట్ గడ్డం శ్రీధర్‌రెడ్డి, బండారు లక్ష్మణ్‌రావు కలిసి గ్రూపుగా ఏర్పడ్డారు. రామకృష్ణ, లక్ష్మణ్‌రావులు బావబామ్మర్దులు. లక్ష్మణ్‌రావు మంచిర్యాల జిల్లాలో మిషన్ భగీరథ డీఈగా విధులు నిర్వహిస్తున్నాడు. నిరుద్యోగ యువతీ, యువకులను టార్గెట్ చేసుకుని ఎల్‌అండ్‌టీ మెట్రోతో పాటుగా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశలు కల్పిస్తామని నమ్మబలికారు. 161మందిని మోసం చేసి బాధితుల నుంచి రూ.80లక్షలు 3564072063గల ఖాతాలో వేసుకుని నలుగురు పంచుకున్నారు. తరువాత భాదితుల నుంచి తప్పించుకునేందుకు ఫోన్ సిమ్ కార్డులు మార్చేవారు. రామకృష్ణకు కొంత మిమిక్రీ కూడా వచ్చు. దాంతో ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, హెచ్ఆర్‌ల వాయిస్‌తో భాదితులతో ఫోన్‌లో మాట్లాడేవాడు. నకిలీ ఐడీ తయారు చేసి మెయిల్ ద్వారా బాధితులకు నకిలీ అపాయిట్‌మెంట్లు పంపించారు. దీంతో అపాయిట్‌మెంట్ అందుకున్న బాధితులు మెట్రో ఎండీ, హెచ్ఆర్‌ను కలువగా తాము ఎవరికీ ఉద్యోగాలు ఇస్తామని అపాయిట్‌మెంట్లు ఇవ్వలేదని చెప్పారు. దీంతో మోసపోయినట్టు గ్రహించిన ఉప్పల్‌కు చెందిన లావణ్య మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు రామకృష్ణ, మహాలక్ష్మిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కారు, రెండు సెల్ ఫోన్లు, 161 నకిలీ ఆర్డర్ కాపీలు, రూ.70వేలు స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. గడ్డం శ్రీధర్‌రెడ్డి, బండారు లక్ష్మణ్‌రావు పరారీలో ఉన్నారు.

స్పీకర్‌గా పోచారం

- ఒకే ఒక నామినేషన్
- ఏకగ్రీవం లాంఛనమే...
- కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ మద్దతు
- సుదీర్ఘ రాజకీయ అనుభవానికి పెద్దపీట

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక లాంఛనం కానుంది. అధికార టీఆర్ఎస్ నుంచి పోచారం ఒకరే నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో ఇందుకు అవకాశం ఏర్పడింది. శుక్రవారం శాసనసభలో ప్రొటెం స్పీకర్ అధికారికంగా స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఎన్నికైనట్టు ప్రకటించే అవకాశం ఉన్నది. కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ పార్టీలు ఆయనకు మద్దతు తెలిపాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలంతా కలిసి అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. మొత్తం ఆరు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, కాంగ్రెస్ సీనియర్ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమా ర్కతోపాటు ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాల, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేఖా నాయ క్, అబ్రహం, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదత రులు పోచారం అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో శాసనసభ స్పీకర్‌గా పోచారం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ సందర్భం గా పలువురు ఎమ్మెల్యేలు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయ ప్రస్థానం..

పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో ఆరుసార్లు పోటీ చేసి, ఐదుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అందరికన్నా సీనియర్ నేత. 1976లో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఆయన 1977లో దేశాయిపేట సింగిల్‌విండో చైర్మన్‌గా మొదటిసారి ఎన్నికయ్యారు. 1987లో డీసీసీబీ చెర్మెన్‌గా పనిచేశారు. 1994లో తొలిసారి బాన్సువాడ నుంచి టీడీపీ తరుపున పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1998లో గహనిర్మాణశాఖ మంత్రిగా పనిచేశారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది గనులు, భూగర్భ జలవనరులశాఖ మంత్రి గా పనిచేశారు. కొంత కాలం పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కూడా ఉన్నారు. 2004 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 2009లో టీడీపీ అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 2011లో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో 49 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బాన్సువాడ నియోజకవర్గం నుంచి తిరిగి ఎమ్మెల్యేగా ఆయన భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ నెల 18న ఆయన శాసనసభాపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇంధనాన్ని పొదుపుగా వాడాలి

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆకున్ సబర్వాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి ఒక్కరు ఇంధనాన్ని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉన్నదని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. ఇంధన పొదుపుతో ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో 'ఇంధనం సంరక్షణ క్షమత మహోత్సవం-2019' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇండ్లలో తొందరగా వంట చేసేందుకు ప్రెజర్ కుక్కర్‌ను వాడాలని సూచించారు. వండుటకు ముందు బియ్యాన్ని, తృణ ధాన్యాలను నానబెట్టాలన్నారు. శుభ్రమైన చిన్న బర్నర్‌పై వంట చేస్తే ఎల్పీజీని పొదుపు చేయవచ్చన్నారు. నీలిరంగు మంట ఉండేట్లు చూడాలన్నరు. వ్యవసాయ రంగంలో సెకనుకు ఒక డీజిల్ చుక్క లీకైతే ఏడాదికి 2 వేల లీటర్లు వృథా అవుతుందని చెప్పారు. ట్రాక్టరును ఆపినపుడు ఇంజన్ ఆఫ్ చేయాలని, ఎల్లప్పుడు సరైన గేర్‌లోనే నడపాలన్నరు. క్రమం తప్పకుండా ట్రాక్టర్/పంప్ సెట్‌ను సర్వీస్ చేయించాలన్నారు. క్రమం తప్పకుండా ఎయిర్ ఫిల్టర్‌ను శుభ్రం చేయాలని తెలిపారు. పాడైన టైర్లు లాగుదల శక్తిని తగ్గిస్తాయన్నారు. రవాణ రంగంలో వాహన వేగం గంటకు 45-55 కి.మీ ఉండాలని సూచించారు. తరచుగా బ్రేకులు వేయరాదన్నారు. వీలైనంత వరకు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించాలని సూచించారు. ట్రాఫిక్‌లో సిగ్నల్ పడినప్పుడు ఇంజన్‌ను ఆపాలని అన్నారు. ఇంజన్ పనిచేస్తూ ఉంటే ప్రతి గంటకు 1 లీటర్ కంటే ఎక్కువ డీజిల్ వృథా అవుతుందన్నారు. ఇంధన ట్యాంకు, ఇంధన పంప్, ప్యూయల్ ఇంజక్టర్, ప్యూయల్ లైవ్‌లో లీకేజీ ఉందేమో తెలుసుకోడానికి జాయింట్లు చెక్ చేయాలని సూచించారు. ప్రతి నిమిషనికి ఒక బొట్టు లీక్ అయితే ఏటా 2 వేల లీటర్లు వరకు డీజిల్ వృథా అవుతుందన్నారు. పొగ వదులుతున్న వాహనం ఎక్కువ ఇంధనాన్ని ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఆయిల్ కంపెనీల ప్రతినిధులు. పౌరసరఫరాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అత్యంత సీనియర్ కేసీఆర్...

ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీఎం

- అత్యంత పెద్ద వయస్కుడు వనమా
- అత్యంత పిన్న వయస్కురాలు బానోతు హరిప్రియ
- మొత్తం ఆరుగురు మహిళా సభ్యులు
- పూర్తిగా కొత్తవారు 23 మంది
- నూతన శాసనసభ ప్రత్యేకతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురువారం నూతనంగా కొలువుదీరిన శాసనసభలో అత్యంత సీనియర్ సభ్యుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ రికార్డులకెక్కారు. ఇప్పటి వరకూ ఆయన ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన తర్వాత ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యా నాయక్, ముంతాజ్ అహ్మద్‌ఖాన్ సీనియర్లుగా ఉన్నారు. మరోవైపు ప్రస్తుత శాసనసభ ఎన్నో ప్రత్యేకతలకు వేదికైంది. రాష్ట్ర తొలి అసెంబ్లీ(2014-2019)కి ప్రాతినిధ్యం వహించిన 76 మంది ఎమ్మెల్యేలు తిరిగి ఎన్నికయ్యారు. 23 మంది తొలిసారి శాసనసభలో అడుగు పెట్టారు. ఉప ఎన్నికతో కలిపితే హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్ ఆరుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎక్కువ వయసున్న (73) సభ్యుడు కాగా, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ (29) అత్యంత పిన్న వయస్కురాలు. మరోవైపు ప్రస్తుత శాసనసభలో టీఆర్ఎస్ నుంచి పద్మా దేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, అజ్మీరా రేఖానాయక్, కాంగ్రెస్ నుంచి సబితా ఇంద్రారెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), బానోతు హరిప్రియ.. మొత్తం ఆరుగురు మహిళా సభ్యులున్నారు.

రాష్ట్ర శాసనసభలో మొత్తం 119 శాసనసభ స్థానాలకు గాను 88 మంది టీఆర్ఎస్ సభ్యులు, కాంగ్రెస్ నుంచి 19, ఎంఐఎం నుంచి 7, టీడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ తరపున ఒక సభ్యుడు ఉన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా మరొకరు శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో నలుగురు వేర్వేరు చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించిన వారు ఉండటం గమనార్హం. మేడ్చల్ నుంచి ఎన్నికైన మల్లారెడ్డి, చెన్నూరు నుంచి గెలిచిన బాల్క సుమన్ లోక్‌సభ సభ్యులుగా పనిచేశారు. మునుగోడు నుంచి ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో లోక్‌సభ, శాసనమండలికి ప్రాతినిధ్యం వహించారు. కొడంగల్ నుంచి గెలుపొందిన పట్నం నరేందర్‌రెడ్డి కూడా ఎమ్మెల్సీగా పనిచేశారు. ఈ నలుగురిని మినహాయిస్తే మిగతా 23 మంది తొలిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు. తెలంగాణ తొలి అసెంబ్లీలో లేకుండా.. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన 16 మంది ఈసారి మళ్లీ ఎన్నికయ్యారు. మొదటి శాసనసభకు నామినేట్ అయిన స్టీఫెన్‌సన్ మళ్లీ నామినేట్ అయ్యారు.

ప్రస్తుత శాసనసభ సమగ్ర స్వరూపం...

పూర్తిగా కొత్తవారు	23 మంది
ఎంపీలుగా ఉండి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు	02
ఎమ్మెల్సీలుగా ఉండి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు	03
గత అసెంబ్లీ పనిచేసి.. మళ్లీ ఎన్నికైనవారు	76
ప్రస్తుత అసెంబ్లీకి ఎన్నికైన వారు	16
మహిళా సభ్యులు	06
ముస్లి మైనారిటీ సభ్యులు	08
ఆంగ్లో ఇండియన్లు	01
ఎక్కువసార్లు ఎన్నికైన ఎమ్మెల్యే	కేసీఆర్
అత్యంత పెద్ద వయస్కుడు	వనమా వెంకటేశ్వరరావు
అత్యంత పిన్న వయస్కురాలు	బానోతు హరిప్రియ

సీబీఐ నుంచి విమానయానశాఖకు...

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో బలవంతపు సెలవుపై పంపిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవలే తిరిగి సీబీఐ డైరెక్టర్‌గా విధుల్లో చేరిన అలోక్‌వర్మను కేంద్ర ప్రభుత్వం ఒక్క రోజులోనే అగ్నిమాపక దళంలోకి బదిలీ చేసింది. అందుకు నిరసనగా విధుల్లో చేరకుండా ఉద్యోగానికి రాజీనామా చేసిన అలోక్‌వర్మ ఇంటిదారి పట్టారు.

సెన్సెక్స్ ▲ 52	నిఫ్టీ ▲ 15	డాలరుకు రూపాయి విలువ	బంగారం (10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్డు (వందకి)			
36,374	10,905	71.24	రూ. 32,266	రూ. 39,440	హైదరాబాద్	433	విజయవాడ	441
					ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
					వరంగల్	433	ముంబయి	484

రేపటికల్లా రూ.100 కోట్లు చెల్లించండి..

- లేదంటే ఎండీ అరెస్టు.. ఆస్తుల జప్తు
- ఫోక్స్‌వ్యాగన్ ఎన్‌జీటీ ఘాటు హెచ్చరిక

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్‌వ్యాగన్‌పై 'జాతీయ హరిత ట్రైబ్యునల్' (ఎన్‌జీటీ) గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్గారాల కేసులో ట్రైబ్యునల్ ఆదేశించినా డబ్బు ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించింది. ఈ కేసులో ఇంకా సమయం ఇచ్చేది లేదని.. కేవలం 24 గంటల్లోగా రూ.100 కోట్లు జమ చేయాల్సిందేనని ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. ఫోక్స్‌వ్యాగన్ డీజిల్ కార్లలో ఉపయోగించే ఓ పరికరం కారణంగా పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని సంస్థపై ఉద్గారాల కేసు నమోదైంది. దీనిపై విచారించిన ఎన్‌జీటీ గతేడాది నవంబరు 16న ఫోక్స్‌వ్యాగన్‌కు జరిమానా విధించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఖాతాలో రూ.100 కోట్ల జమ చేయాలని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను పక్కనబెట్టిన సంస్థ ఇంతవరకూ ఆ డబ్బును జమ చేయలేదు. దీంతో ఈ వ్యవహారంపై గురువారం మరోసారి విచారణ చేపట్టిన ఎన్‌జీటీ.. ఫోక్స్‌వ్యాగన్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 'ఎన్‌జీటీ ఇచ్చిన తీర్పుపై ఎలాంటి స్టే లేకపోయినా మీరు డబ్బు ఎందుకు జమ చేయలేదు. ఇక మీకు ఎలాంటి గడువు ఇవ్వబోం. 24 గంటల్లోగా రూ. 100కోట్లు జమ చేయాల్సిందే. డబ్బు జమ చేసినట్లు శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేయండి' అని ఎన్‌జీటీ చైర్‌పర్సన్ ఆదర్శ్ కుమార్ గోయెల్ నేతృత్వంలోని ధర్మాసనం ఫోక్స్‌వ్యాగన్‌ను ఆదేశించింది. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. గడువు లోగా డబ్బు జమ చేయకపోతే ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ఎండీని అరెస్టు చేయాల్సి వస్తుందని, అంతేగాక.. భారత్‌లోని కంపెనీ ఆస్తులను జప్తు చేస్తామని తీర్పులో స్పష్టం చేసింది.

మెప్పించే ఫలితాల్ని ప్రకటించిన సైయెంట్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ఐటీ సేవల సంస్థ సైయెంట్ డిసెంబరుతో ముగిసన త్రైమాసికానికి మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో సంస్థ నికర ఏడాది ప్రతిపదికన లెక్కించి చూస్తే 4.9 శాతం మేర పెరిగి రూ.92.1 కోట్లకు చేరుకుంది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.87.8 కోట్లుగా నమోదు అయింది. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల కాలంలో సంస్థ ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.983.4 కోట్ల నుంచి రూ.1,187.6 కోట్లకు చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సైయెంట్ సంస్థ డిసెంబరు ముగింపు నాటికి రూ.1,230 కోట్ల మేర నగదు నిల్వలను ప్రకటించింది. సంస్థ గతంలో మాదిరిగానే డివిడెండ్ పాలసీకి కట్టుబడి ఉండనున్నట్టుగా సైయెంట్ వెల్లడించింది. డిసెంబరు మాసంలో వరుస సెలవులతో పాటు వివిధ ఇతర కారణాల వల్ల స్తబ్దత కనిపిస్తుందని అయినా స్థిర కరెన్సీ మారకం ప్రాతిపదికన ఇయర్ ఆన్ ఇయర్‌తో పోలిస్తే సంస్థ 10.7 శాతం వృద్ధిని నమోదు చేసినట్టుగా సైయెంట్ సంస్థ ఎండీ, సీఈవో కృష్ణా బోధనపు వెల్లడించింది. రానున్న త్రైమాసికంలో మెరుగైన వృద్ధిని నమోదు చేయనున్నట్టు ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

మూడు నెలల్లో ..10,251 కోట్ల లాభం..!

రికార్డు లాభాలను ప్రకటించిన రిలయన్స్

- దేశంలోనే తొలిసారిగా భారీ లాభపు ప్రకటన
- దన్నుగా నిలిచిన రిఫైనరీ, వైర్‌లెస్ వ్యాపారం
- 28 కోట్లకు చేరువైన జియో ఇన్ఫోకామ్ సేవలు
- భవిష్యత్తులో మరింత విస్తరిస్తాం: ముఖేశ్ అంబానీ



న్యూఢిల్లీ: భారత కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) సరికొత్త రికార్డును నమోదు చేసింది. దేశంలోని ఏ ఇతర ప్రయివేటు సంస్థ ఇప్పటి వరకు ప్రకటించని విధంగా కేవలం మూడు నెలల కాలానికి రికార్డు స్థాయిలో రూ.10,251 కోట్ల లాభాన్ని ఆ సంస్థ ప్రకటించింది. చమురు నుంచి టెలికాం వరకు బహుళ వ్యాపారాలను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి ఇంతటి రికార్డు లాభాలను నమోదు చేయడం విశేషం. 8.8 శాతం వృద్ధితో రూ.10,251 కోట్ల నికర లాభాలు సాధించినట్టుగా సంస్థ తెలిపింది. పెట్రో కెమికల్స్, రిటైల్, టెలికాం వ్యాపారాలు మెరుగైన ప్రగతిని కనబరచడం వల్లే మెరుగైన లాభాలు సాధ్యపడినట్టుగా ఆర్ఐఎల్ తెలిపింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంల (2017-18) డిసెంబరు త్రైమాసికంలో సంస్థ లాభం రూ.9,420 కోట్లుగా నమోదు అయింది. డిసెంబరు త్రైమాసికంలో సంస్థ ఆదాయం ఏకంగా 55.9 శాతం పెరిగి రూ.1.71 లక్షల కోట్లుగా నమోదయ్యింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రిల్ రూ.1.4 లక్షల కోట్ల రెవెన్యూతో రూ.9,600 కోట్ల లాభాలు ప్రకటించే అవకాశం ఉందని తొలుత పలు మార్కెట్ విశ్లేషణలు వచ్చాయి. ఈ అంచనాలు మించి భారీ రెవెన్యూతో.. రికార్డు లాభాలను సాధించడం మార్కెట్ వర్గాలను కూడా ఆశ్చర్యపరిచింది.. తమ అన్ని విభాగాలు రిటైల్, జియో వేదికలు అత్యధిక లాభదాయకతను నమోదు చేశాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మెన్ ముఖేశ్ అంబానీ పేర్కొన్నారు. వైర్‌లెస్ వ్యాపారం భారీ వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2018 డిసెంబర్ ముగింపు నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అప్పులు రూ.2.74 లక్షల కోట్లకు చేరాయి. 2018 మార్చి 31 నాటికి ఈ అప్పులు రూ.2.18 లక్షల కోట్లుగా ఉన్నాయి.

జియోకు రూ.831 కోట్ల లాభాలు..


రిలయన్స్‌కు చెందిన టెలికాం సంచలనం జియో ఇన్ఫోకమ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 65 శాతం వృద్ధితో రూ.831 కోట్ల లాభాలను నమోదు చేసింది. అంతక్రితం త్రైమాసికంలో సంస్థ రూ.681 కోట్ల లాభాలు నమోదు చేయగా, 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జియో రూ.504 కోట్ల లాభాలు ప్రకటించింది. డిసెంబరు త్రైమాసికంలో ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి రూ.130గా నమోదయ్యిందని.. జియో కుటుంబం 28 కోట్లకు చేరిందని ముఖేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ డాటా నెట్‌వర్క్ స్థాయికి ఎదుగుతోందన్నారు. తమ తర్వాత తరం ఫైబర్ టు ద సబ్‌స్క్రైబర్ జియో గిగాఫైబర్ ద్వారా గృహాలు, సంస్థల కనెక్టివిటీ సొల్యూషన్స్‌లోకి రానున్నామన్నారు. క్రితం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జియో ఆదాయం 21.2 శాతం పెరిగి రూ.21,317 కోట్లుగా నమోదు అయింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17,580 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. పెట్రో కెమికల్ విభాగం డిసెంబరు త్రైమాసికంలో 37.1 శాతం వృద్ధితో రూ.46,246 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. రిటైల్ బిజినెస్ 89.3 శాతం శాతం వృద్ధితో 18,798 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. గురువారం మార్కెట్లు ముగిసిన తర్వాత రిలయన్స్ ఆర్థిక ఫలితాలను వెల్లడించింది.

జెట్‌లో 700 కోట్ల పెట్టుబడికి సిద్ధమే..



న్యూఢిల్లీ: నిధుల లేమితో తీవ్ర ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటోన్న జెట్ ఎయిర్‌వేస్ సంస్థలో రూ.700 కోట్ల మేర అదనంగా పెట్టుబడి పెట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టుగా ఆ సంస్థ చైర్మెన్ నరేశ్ గోయెల్ వెల్లడించారు. జెట్ ఎయిర్‌వేస్‌కు రుణాలు అందించిన రుణ దాతల బృందానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్‌బీఐ చైర్మెన్ రజనీశ్ కుమార్‌కు ఆయన దీనికి సంబంధించి ఒక లేఖ రాశారు. సంస్థను నిలబెట్టే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే జెట్‌ఎయిర్‌వేస్‌లోని మరో వాటాదారు అయిన ఎతిహాద్ 49శాతం వాటాల కొనుగోలు చేసేందుకు పలు షరతులు విధించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా సంస్థ చైర్మెన్ గోయెల్ ఒక లేఖ రాస్తూ తన మొత్తం షేర్లను తనఖా పెట్టి రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు తాను సిద్ధమేననితెలిపారు. కానీ, ఈ మొత్తంతో కంపెనీలో తన వాటా 25 శాతానికి తగ్గకూడదని ఆయన షరతు విధించారు. "ఇది ఒక వేళ సాధ్యంకాకపోతే నేను కంపెనీలో పెట్టుబడులు పెట్టడం, షేర్లను తాకట్టు పెట్టడం సాధ్యంకాదు. లేకపోతే టేకోవర్ నిబంధనలు అమలు చేయకుండా కంపెనీలో నా వాటా షేర్లను 25శాతానికి పెంచుకొనేలా సెబీ మినహాయింపును ఇవ్వాలి" అని ఎస్‌బీఐ చైర్మెన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

కీలక వడ్డీరేట్లు తగ్గిస్తే మేలు..



ముంబయి: భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్‌తో గురువారం ప్రముఖ పారిశ్రామిక వర్గాల వారితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భాగంగా పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి శక్తికాంత వారిని అడిగి తెలుసుకున్నట్టుగా సమాచారం. సమావేశంలో భాగంగా పరిశ్రమ వర్గాలు ఆర్బీఐ గవర్నర్‌తో ముచ్చటిస్తూ కీలక వడ్డీ రేట్లను తగ్గించాలని కోరినట్టుగా సమాచారం. వృద్ధికి మద్దతునివ్వడానికి రుణాలపై వడ్డీ రేట్లను మరింత అందుబాటులోకి తేవాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ), ఫిక్కీ ప్రతినిధులు కోరారు. దీనికి తోడు నగదు నిల్వల నిష్పత్తిలో (సీఆర్ఆర్)లో 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించాలని చర్యలు తీసుకోవాలని సీఐఐ సూచించింది. ఇప్పటికే ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నందున వడ్డీ రేట్ల తగ్గిస్తే బాగుంటుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఫిబ్రవరి 7న ఆర్బీఐ ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది.ప్రస్తుతం సీఆర్ఆర్ 4 శాతంగా, ఆర్బీఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై విధించే రెపో రేటు 6.5 శాతంగాను ఉంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు విత్త సమస్యలను ఎదుర్కొంటున్నాయని సీఐఐ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లింది. వ్యక్తిగత గ్యారంటీతో ఈ రంగాలకు రుణాలు ఇవ్వాలని కోరింది.

త్వరలో 'వ్యాపార సంస్థల రిజిస్టర్'


- ఎకనామిక్ సెన్సెస్‌లో భాగంగా డేటా సేకరణ
- నిత్యం నవీకరణలకు ఏర్పాట్లు..



న్యూఢిల్లీ: దేశంలోని వ్యాపార సంస్థల వివరాలన్నింటినీ క్రోఢీకరిస్తూ 'వ్యాపార సంస్థల రిజిస్టర్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2019-20లో చేపట్టనున్న ఎకనామిక్ సన్సెస్ (జాతీయ ఆర్థిక కార్యకలాపాల లెక్కల సేకరణ) కార్యక్రమంలో భాగంగా సర్కారు ఈ వ్యాపార సంస్థల రిజిస్టర్‌ను రూపొందించాలని భావిస్తున్నట్టుగా జాతీయ గణాంకాలు, ప్రభుత్వ పథకాల అమలు శాఖ కార్యదర్శి ప్రవీణ్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా ఏర్పాటు చేసిన ఒక వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతిపాదిత 'వ్యాపార సంస్థల రిజిస్టర్'లో దేశంలోని అన్ని వ్యాపారాల సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు.. దానిని అనునిత్యం నవీకరించేలా రూపొందించనున్నట్టు ఆయన తెలిపారు.రిజస్టర్‌లోని సమాచారాన్ని భాగస్వామ్య సంస్థలతో సహా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వివిధ అవసరాలకు వాడుకొనేలా రూపొందించనున్నట్టుగా శ్రీవాస్తవ తెలిపారు. ఇందుకు గాను సీఎస్‌సీ ఎస్‌పీవీని టెక్నాలజీని వినియోగిస్తున్నట్టుగా ఆయన వివరించారు. తాము సమీకరించే సమాచారంతో విలువైన, నాణ్యమైన డేటా అందుబాటులోకి రానుందని ఆయన తెలిపారు. ఆర్థిక లెక్కల సేకరణ వల్ల సమయానుకూలంగా సమాచార సేకరణతో పాటు జాతీయ స్థాయిలో ఉన్న అస్తుల విలువ లెక్కించేందుకు వీలు పడుతుందని.. తద్వారా వివిధ విధాన స్థాయిల్లో అవసరం మేరకు జోక్యానికి వీలుకలుగుతుందని ఆయన అన్నారు. సీఎస్‌సీ దేశ వ్యాప్తంగా మూడు లక్షల సాధారణ సేవా కేంద్రాలను నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. వీటిని రానున్న రోజుల్లో ఆర్థిక సర్వే కార్యక్రమానికి వినియోగించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఒక్కో కేంద్రం నుంచి దాదాపు ఐదుగురు ఎన్యుమరేటర్లకు శిక్షణనివ్వనున్నట్టుగా ఆయన తెలిపారు. ఆర్థిక గణాంకాల సేకరణకు దాదాపు రూ.300 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. ఎకనామిక్ సేన్సెస్ కోసం లోతైన సర్వే, డేటా సంగ్రహానం జరపాల్సిన అవసరం ఉన్నందున ప్రభుత్వం 1977 నుంచి ఇప్పటి వరకు కేవలం ఆరు సార్లు మాత్రమే ఎకనామిక్ సెన్సెస్ కార్యక్రమాన్ని చేపట్టింది.

వలస కార్మికులపై జాతీయ విధానం రూపొందించాలి

- కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ సూచన



న్యూఢిల్లీ: దేశం నుంచి ప్రపంచ మార్కెట్‌లోకి వలస వెళ్తున్న కార్మికులపై ఓ విధానాన్ని రూపొందించాలని కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ(స్థాయీ సంఘం) సిఫారసు చేసింది. విదేశాలకు వలస వెళ్తున్న కార్మికుల వివరాలు తెలిపే సరైన యంత్రాంగం, డేటా లేకపోవడాన్ని కమిటీ తన నివేదికలో గుర్తు చేసింది. వలస కార్మికుల హక్కులు, భద్రత కోసం ప్రభుత్వపరంగా తగిన ఏర్పాట్లు లేకపోవడం పట్ల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. నైపుణ్య కార్మికులు 36 దేశాలకు వలస వెళుతుండగా, ఇతర కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నట్టు కమిటీ తన తాజా నివేదికలో తెలిపింది. ఈ నెలలోనే కమిటీ తన నివేదికను విదేశాంగశాఖకు అందించింది.



2017 ఏప్రిల్‌లో అప్పటి విదేశాంగశాఖ కార్యదర్శి ఎస్.జయశంకర్ తెలిపిన ప్రకారం అంతకుముందు ఎమిగ్రేషన్ పాస్‌పోరు (ఈసీఆర్)తో వెళ్లిన వలస కార్మికుల వివరాలు మాత్రమే ప్రభుత్వం వద్ద ఉండేవి. ఆ తర్వాత ఎమిగ్రేషన్ పాస్‌పోర్టు లేకుండా(ఈసీఎన్ఆర్) వెళ్లినవారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. దాంతో, 12 నెలల్లో ఈసీఆర్‌తో వెళ్లినవారికన్నా ఈసీఎన్ఆర్ కార్మికుల సంఖ్య 5 రెట్లు ఉన్నట్టు తేలింది. 4 లక్షలమంది ఈసీఆర్‌తో విదేశాలకు వెళ్లగా, 19 లక్షలమంది ఈసీ ఎన్ఆర్‌తో వెళ్లారు. వీరి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయడం ద్వారానే ఖచ్చితమైన వివరాలు అందుబాటులోకి వస్తాయని వలస కార్మి కులపై అధ్యయనం చేసిన నిపుణుడు ఎస్ ఇరుదయరాజన్ సూచిం చారు. ఎమిగ్రేషన్ పత్రాలులేని కారణంగా బతుకుదెరువు కోసం విదేశాల కు వెళ్లిన కార్మికులు పలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే.

నేటి నుంచి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ జాగృతి ఆధ్వర్యాన శుక్రవారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు కొనసాగే ఈ సదస్సుకు నగరంలోని హెచ్ఐసీసీలోగల నోవాటెల్ హోటల్ వేదిక కానుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సదస్సు ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. శనివారం జరిగే ప్రారంభ సదస్సుకు పద్మభూషణ్ అన్నాహజారే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ తాపా ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. 20న సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు.

కోటా పెంపు సరే.. విద్యార్థుల ఫీజు కట్టేదెవరు..?

- ప్రయివేటు వర్సిటీలలో రిజర్వేషన్ల పెంపుతో కొత్త చిక్కులు...
- ఇలాగైతే.. 'తామూ విజయ్ మాల్యాలమే' అంటున్న యాజమాన్యాలు



న్యూఢిల్లీ: గత నెలలో ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి, త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోడీ సర్కారు పదిరోజుల క్రితం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును తీసుకొచ్చింది. ఇందులో భాగంగా వారికి విద్య, ఉద్యోగాలలో పదిశాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంది. అయితే దీనికి ఎలాంటి చట్టబద్ధత లేకున్నా పార్లమెంట్‌లో తనకున్న సంఖ్యాబలంతో ఆగమేఘాల మీద మోడీ సర్కారు ఈ బిల్లును ఆమోదింపజేసుకుంది. ఇప్పటివరకూ బాగానే ఉంది. అయితే వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రయివేటు వర్సిటీలలోనూ ఈ రిజర్వేషన్లను వర్తింపజేస్తామని, దీనికోసం ఈ బడ్జెట్ సమావేశాలలోనే బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ మూడు రోజుల క్రితం వెల్లడించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లను అమలు చేస్తే ప్రయివేటు విద్యా సంస్థలలో చదివే విద్యార్థులకు ఫీజులు కట్టేదెవరన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలలో అమలవుతున్న ఉచిత విద్య, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాల కారణంగా పలు ప్రయివేటు విద్యా సంస్థలకు ప్రభుత్వాలు భారీగా బకాయిలు పడ్డాయి. వీటిని చెల్లించడానికే రాష్ట్ర ప్రభుత్వాలు నానా తంటాలు పడుతున్న నేపథ్యంలో తాజా ప్రతిపాదనతో విద్యా సంస్థలతో పాటు విద్యార్థులూ ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. 2017-18 గణాంకాల ప్రకారం దేశంలో 32,426 ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థలు, 900 విశ్వ విద్యాలయాలున్నాయి. వీటన్నింటిలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుంది.

కేంద్రం సొంతంగా అమలుచేస్తోందా..?

సాధారణంగా విద్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అంశం. కేంద్రం ఈ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ, దీనికి సంబంధించిన ఏదైనా ఉత్తర్వులను కేంద్రం ప్రతిపాదించి రాష్ట్రాలకు పంపినపుడు వాటిని అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంది. అయితే, దేశంలో ఉన్న కొన్ని ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థలు స్థానికత ఆధారంగా 25 శాతం రిజర్వేషన్లను అమలుచేస్తున్నాయి. కేంద్రం తీసుకురాబోతున్న తాజా బిల్లుతో అన్ని ప్రయివేటు వర్సిటీలు రిజర్వేషన్లు అమలుచేయాల్సి ఉంటుంది. దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి మార్గదర్శకాలు రాకపోగా దీని అమలుపైనా విధి విధానాలను కేంద్రం ఇప్పటివరకూ ప్రకటించలేదు. రిజర్వేషన్ల అమలుకు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల ఆధారంగా నడుస్తున్న విద్యా సంస్థలను కేంద్రం పరిధిలోకి తీసుకొస్తారా అన్నది ప్రశ్నార్థకం.

'రిజర్వ్‌డ్' విద్యార్థులకు ఫీజులెవరు చెల్లిస్తారు..?

కేంద్రం తీసుకురాబోతున్న కొత్త బిల్లులో ఇదే కీలకాంశంగా ఉంది. ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలేవీ తమ వద్దకు వచ్చే విద్యార్థి ఫీజు చెల్లించకుండా రావాలని కోరుకోవు. అయితే కేంద్రం ప్రతిపాదనతో ప్రయివేటు విద్యా సంస్థలలో విద్యనభ్యసించే విద్యార్థులకు రిజర్వేషన్ అమలుచేయాల్సి వస్తోంది. కానీ, దీనిపై ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. తాము బ్యాంకుల వద్ద కోట్ల కొలది రుణం తీసుకువచ్చి సంస్థలను నడుపుతామని.. కానీ, రిజర్వేషన్ల అమలు కారణంగా సంబంధిత విద్యార్థులు ఫీజులు చెల్లించరని ఎడ్యూకేషన్ ప్రమోషన్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పి. పలనివేల్ అన్నారు. విద్యా సంస్థలను ఏర్పాటు చేసే సమయంలో అవి తీర్చడానికి బ్యాంకులకు తాము వాటిని ఎలా తీర్చుతామో తెలపాల్సి ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి రూ. 60 వేల నుంచి రూ. 1 లక్ష వరకు జీతాలు, కళాశాల నిర్వహణ ఖర్చులు, విద్యార్థులను ఆకర్షించడానికి చేసే ప్రకటనల ఖర్చులు కలిసి తడిసి మోపెడవుతున్నాయని తెలిపారు. ఇలాగైతే తాము కూడా బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలు ఎగ్గొట్టి విజయ్ మాల్యా వలే దేశం విడిచి వెళ్లిపోవాల్సి వస్తుందని వెల్లడించారు. మోడీ సర్కారు తీసుకురాబోతున్న ఈ బిల్లుతో కొన్ని బడా కార్పొరేట్ విద్యా సంస్థలకే లాభం చేకూరుతుందని.. తమ వంటి చిన్న ప్రయివేటు విద్యా సంస్థలు తీవ్రంగా నష్టపోతాయని పలినివేల్ ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్రం సహకరిస్తేనే...

తాజా ప్రతిపాదనపై ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థల యజమాన్యాలు చర్చలు జరుపుతున్నాయి. రిజర్వేషన్లు పొందే విద్యార్థులకు రీ ఎంబర్స్‌మెంట్ ద్వారా ఫీజులు చెల్లిస్తుందా లేదా కేంద్రం స్పష్ట చేయాలని కోరుతున్నాయి. తాజా బిల్లును అమలుచేయాలంటే కేంద్రం తమకు సహకరించాలని దక్షిణాది రాష్ట్రాలలో పేరు మోసిన ప్రయివేటు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఒకరు తెలిపారు. లేదంటే ప్రయివేటు వర్సిటీలను ఏదైనా ప్రభుత్వ విశ్వవిద్యాలయానికి లేదా రాష్ట్ర ప్రభుత్వానికి అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. దీని ద్వారా ఫీజులు నిర్ణయించే విధానం యూనివర్సిటీ పరిధిలోకి వస్తుందని.. ఇది ఢిల్లీ వంటి రాష్ట్రాలలో అమలవుతోందని తెలిపారు. ఢిల్లీలో ఉన్న ప్రయివేటు ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలన్నీ గురుగోబింద్ సింగ్ ఇంద్రపరిషత్ యూనివర్సిటీ కింద పనిచేస్తాయి.


అలా ఫొటోలు తీస్తే జైలే

- ఆడవాళ్ల స్కర్టులను రహస్యంగా చిత్రీకరిస్తే..



లండన్: ఆడవారి స్కర్టులను రహస్యంగా ఫొటోలు తీయడంపై నిషేధం విధిస్తూ బ్రిటిష్ ఎంపీలు చట్టాన్ని తెచ్చారు. దీనికి అప్‌స్కర్టింగ్ నిషేధచట్టం అని పేరుపెట్టారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా మహిళలు స్కర్టులను ధరించే వాటినిరహస్యంగా ఫొటోతీసినా, పంపిణీ చేసినా రెండేండ్ల జైలుశిక్ష విధిస్తారు. రహస్య ఫొటోల బాధితురాలు గినా మార్టిన్ నిర్వహించిన ప్రచారోద్యమం ఫలితంగా ఈ చట్టం ముందుకు వచ్చింది. మంగళవారం ఎగువసభ హౌస్ ఆఫ్ లార్డ్స్ ఆమోదంతో చట్టం పార్లమెంటు సంపూర్ణ ఆమోదం పొందింది. ఇక రాణి ఆమోదముద్ర వేయడం తరువాయి. చట్టం ఇలా తుదిఘట్టానికి చేరుకోవడంపై గినా మార్టిన్ హర్షం వ్యక్తం చేశారు. లివర్‌పూల్ నుంచి ఓ మ్యూజిక్ పెస్టివల్‌లో పాల్గొనేందుకు లండన్ వచ్చిన గినా హైడ్‌పార్కులో తిరుగుతుండగా ఓ వ్యక్తి దగ్గరగా వచ్చి రాసుకుంటూ వెళ్లాడు. దూరంగా ఇంకో వ్యక్తి కెమెరా ఎక్కుపెట్టాడు. తర్వాత సంగతేంటని గినా వారిని నిలదీస్తే వారికి చెందిన ఫోన్‌లో ఓ అమ్మాయి నడుముభాగం ఫొటో ఉంది. డ్రెస్సును బట్టి ఆ ఫొటో తనదేనని గినా గ్రహించింది. పోలీసులకు పిలిచి చూపితే తాము ఏమీ చేయలేమని చేతులు ఎత్తేశారు. దాంతో సామాజిక మాధ్యమాల్లో ఆమె ఈ దిగజారుడు ప్రవర్తనకు వ్యతిరేకంగా ప్రచారోద్యమం చేపట్టింది. 18 మాసాల కృషి ఫలించి పార్లమెంటు చట్టం చేసింది. సమాజం, రాజకీయాలు ఓమంచి పనికోసం జతకట్టడంగా ఆమె ఈ పరిణామాన్ని అభివర్ణించారు. ప్రధాని థెరెసా మే ఈ చట్టానికి వ్యక్తిగతంగా మద్దతు తెలిపారు.

బ్యాలెన్స్ తప్పితే...



అకారణంగా బరువు పెరిగిపోవడం, ఎంత తిన్న చిక్కిపోవడం వంటి సాధారణ సమస్యలు మొదలు సంతానోత్పత్తి వరకు అనేక ఆరోగ్యసమస్యలకు కారణం హార్మోన్లు. మన శరీరంలోని వేర్వేరు అవయవాలు వాటి విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు ఇవి ఉపయోగపడుతాయి. ఈ హార్మోన్లను స్రవించే గ్రంథుల పనితీరు, హార్మోన్ల మోతాదుల మీదే మన శరీర జీవక్రియలన్నీ ఆధారపడి ఉంటాయి. ఇటీవల కాలంలో హార్మోన్ల లోపం, హార్మోన్ల ఇన్‌బ్యాలెన్స్ అన్న పదాలు తరుచుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హార్మోన్ల గురించి సమగ్ర సమాచారం..

శరీరంలోని ఎండోక్రైన్ గ్రంథుల నుంచి వెలువడే స్రావాలను హార్మోన్లు అని పిలుస్తారు. ఇవి ఎండోక్రైన్ గ్రంథుల నుంచి నిరంతరంగా స్రవిస్తూనే ఉంటాయి. ఈ హార్మోన్లు అవయవాల పనితీరును ప్రభావితం చేస్తాయి. రక్తంలో కలిసిపోయి అవి పనిచేయాల్సిన అవయవంలోకి చేరుకుని అవి సక్రమంగా చేసేలా ప్రేరేపిస్తాయి. ఇవి శరీరంలో మెసెంజర్లుగా పనిచేస్తూ జీవక్రియలు సక్రమంగా జరిగేలా, క్రమం తప్పకుండా ఉండేలా చూస్తాయి. శరీర ఎదుగుదల, పునరుత్పత్తి వంటి కీలక శరీరధర్మప్రక్రియల్లో చురుకైన పాత్ర పోషిస్తాయి. వీటితోపాటు హార్మోన్లు మన శరీరం శక్తిని నిల్వ ఉంచుకునే, ఖర్చు చేసే తీరుల మీద కూడా ప్రభావం చూపిస్తాయి. శరీరంలో లవణాలు, చక్కెర స్థాయిలను నియంత్రించడంలో హార్మోన్లు కీలకం. ఏ కారణం చేతనైనా హార్మోన్లలో హెచ్చుతగ్గులు వస్తే ఆరోగ్యసమస్యలు వస్తాయి.

ప్రతి కణం మీద ప్రభావం..

శరీరంలోని ఒక్కో హార్మోన్ ఒక్కో అవయవాల పనితీరును నిర్ధారిస్తుంది. కొన్ని హార్మోన్లు ఒకే అవయవం పై ప్రభావం చూపిస్తే.. మరికొన్ని హార్మోన్లు రెండు అంతకు మించి అవయవాలతో పాటు పూర్తి శరీరం మీదే ప్రభావం చూపిస్తాయి. ఇందుకు మంచి ఉదాహరణ థైరాయిడ్ హార్మోన్. ఇది పిట్యూటరీ గ్రంథిలో తయారయ్యే 'థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్' శరీరంలో ప్రతి కణం మీద ప్రభావాన్ని చూపిస్తుంది.

- పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్ పిట్యుటరీ గ్రంథిలో తయారవుతుంది. ఈ హార్మోన్ ప్రొటీన్ తయారీకి, శరీర ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.
- పిట్యుటరీ గ్రంథిలో తయారయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్ ప్రసవ సమయంలో, బిడ్డకు పాలిచ్చేటప్పుడు తల్లి శరీరంలో అందుకు అనుగుణంగా రావల్సిన శరీర మార్పులకు తోడ్పడుతుంది.
- థైరాయిడ్ గ్రంథి స్రవించే హార్మోన్ శరీర జీవక్రియల వేగాన్ని(మెటబాలిజం) సమంగా ఉంచుతుంది.
- ఎడ్రినల్ గ్రంథి స్రవించే కార్టిసోల్ హార్మోన్ కండరాల సామర్థ్యం మీద ప్రభావం కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయి, రక్తపోటులను నియంత్రిస్తుంది.
- అండాశయాల్లో తయారయ్యే ఈస్ట్రోజెన్ హార్మోన్ స్త్రీ లక్షణాలు, పునరుత్పత్తి అవయవ నిర్మాణంలో ఉపయోగపడుతుంది.
- అండాశయాల్లో తయారయ్యే ప్రొజెస్టరాన్ హార్మోన్ గర్భస్థ సమయంలో పిండం గర్భాశయ గోడలకు అతుక్కుని ఎదిగేలా చేస్తుంది.

హార్మోన్లు లోపిస్తే..


గ్రంథులకు సంబంధించిన సమస్యలు వాటి స్రావాలో హెచ్చుతగ్గుల వల్లే తలెత్తుతాయి. అంటే అవసరానికి మించి ఎక్కువగా స్రవించినా లేదా అవసరానికి సరిపడా స్రవించకపోయినా ఆరోగ్య సమస్యలు తప్పవు. కాబట్టి లక్షణాలను బట్టి ఏ హార్మోన్ స్రావంలో తేడాలున్నాయో కనిపెట్టి ఆ హార్మోన్ స్రవించే గ్రంథుల్లో సమస్యను సరిదిద్దే చికిత్స తీసుకోవాలి. వయసు, ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపం, వంశపారంపర్యం గా హార్మోన్లలో అవకతవకలు తలెత్తవచ్చు.

పెరుగుదలపై ప్రభావం..

శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపే గ్రోత్ హార్మోన్‌ను పిట్యుటరీ గ్రంథి స్రవిస్తుంది. ఈ స్రావం తగ్గితే ఎదుగుదల లోపాలు కనిపిస్తాయి. ఈ లోపం పెద్దల్లో కంటే పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. పిల్లలకు వయసుకి తగిన ఎత్తు, బరువు పెరగకపోతే ఈ హార్మోన్ లోపం ఉందని గుర్తించాలి. ఈ హార్మోన్ లోపం ఉన్న పిల్లలు కౌమార దశకు ఆలస్యంగా చేరుకుంటారు. ఈ సమస్యను తగిన సమయంలో గుర్తించి చికిత్సనందిస్తే పిల్లల్లో ఎదుగుదల తిరిగి పుంజుకుంటుంది.

గ్రోత్ హార్మోన్‌లో లోపాలు సాధారణంగా గ్రహణం మొర్రి పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తాయి. మరికొందరిలో పుట్టుకతోనే పిట్యుటరీ గ్రంథి లేకపోవటం కారణమైతే ఇంకొందరిలో మెదడులో ట్యూమర్ వల్ల సమస్యలు వస్తాయి. ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయం కావడం, కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా ఈ హార్మోన్‌లో లోపాలు వస్తాయి.

ఈ సమస్య ఉన్న పిల్లలు ఎత్తు తక్కువగా ఉంటారు. కొందరు పిల్లల్లో లైంగికపరమైన ఎదుగుదల కూడా లోపిస్తుంది. ఎముకల బలహీనత, శక్తి లోపించటం, చల్లదనం, వేడికి తట్టుకోలేకపోవటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. డిప్రెషన్, ఏకాగ్రతాలోపం, ఆందోళన, ఒత్తిడికి లోనుకావడం లాంటి మానసిక సమస్యలు ఉంటాయి.



వయసును బట్టి..

లింగనిర్ధారణలో, లైంగికపరమైన ఎదుగుదలతో పాటు సంతానోత్పత్తిలో కీలకపాత్ర పోషించేవి ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్. వీటిని సెక్స్‌హార్మోన్లు అంటారు. ఈస్టోజన్ స్త్రీలలో ఎక్కువగా, ప్రొజస్టరాన్ తక్కువగా ఉంటే పురుషుల్లో ఈ రెండు హార్మోన్ల స్థాయిలు వ్యతిరేకంగా ఉంటాయి. స్త్రీలలో అండాశయాల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ తయారవుతుంది. యుక్త వయసు లక్షణాలకు ఈ హార్మోనే కారణం.

ఈస్ట్రోజన్ హార్మోన్‌లో మూడు రకాలున్నాయి. వయసును బట్టి, శరీరం అవసరాల మేరకు ఆయా హార్మోన్లు తయారవుతూ ఉంటాయి.

- ఎస్ట్రాడియోల్ అనే హార్మోన్ గర్భం దాల్చే వయసులో విడుదలవుతుంది.
- ఎస్ట్రియోల్ హార్మోన్ గర్భంతో ఉన్నప్పుడు విడుదలవుతుంది.
- ఈస్ట్రోజన్ అనే హార్మోన్ మెనోపాజ్ దశలో విడుదలవుతుంది.

పుట్టుకతో లోపం వల్ల హార్మోన్ స్రావం లేకున్నా లేదా గర్భనిరోధక మాత్రలు లేదా హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ ద్వారా అవసరానికి మించి ఈస్ట్రోజన్ శరీరంలో చేరుకున్నా సమస్యలు మొదలవుతాయి. మెనోపాజ్ వల్ల లేదా సర్జరీ ద్వారా ఓవరీస్ తొలగించినా సమస్యలు తలెత్తవచ్చు.

ఈ హార్మోన్ తక్కువైతే రుతుక్రమంలో అవకతవకలు లేదా పూర్తిగా ఆగిపోవటం, ఒంట్లో వేడి ఆవిర్లు, నిద్ర సమస్యలు, లైంగికాసక్తి లోపించటం, చర్మం పొడిబారడం లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువైతే బరువు పెరగటం, పిరుదులు, నడుము, కాళ్లలో కొవ్వు పేరుకోవటం, నెలసరిలో మార్పులు వస్తాయి. అలసట, డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు కనిపిస్తాయి.

చికిత్స

హార్మోన్ లోపాలను రక్త పరీక్షతో తేలికగా గుర్తించే వీలుంది. పరీక్షలో వెలువడిన ఫలితాన్నిబట్టి చికిత్స తీసుకుని హార్మోన్ సమస్యను మందులకు సరిచేయవచ్చు.

టెస్టోస్టెరాన్

పురుషులకు ఒక సంపూర్ణ అస్తిత్వాన్నిచ్చేవి ఈ టెస్టోస్టెరాన్ హార్మోన్లే. వ షణాల్లోంచి ఇవి ఉత్పన్నమవుతాయి. కండరాలను, ఎముకలను పటిష్టపరచడం, ఎర్రరక్తకణాలను సమస్థాయిలో ఉంచడంతో పాటు లైంగిక వ్యవస్థను చైతన్యవంతంగా ఉంచేందుకు ఈ హార్మోన్లు ఉపయోగపడుతాయి. ఏ కారణంతేనైనా టెస్టోస్టెరాన్ హార్మోన్‌లో లోపాలు వస్తే లైంగిక శక్తితో పాటు ఇతర వ్యవస్థలు బలహీనపడతాయి. టెస్టోస్టెరాన్ హార్మోన్ తగ్గిన వారికి రిప్లేస్‌మెంట్ థెరపీ అందుబాటులో ఉంది.

జీవితాంతం చికిత్స అవసరమయ్యే హార్మోన్ లోపాలు..

కొన్ని రకాల హార్మోన్ లోపాలను కొద్దిరోజుల చికిత్సలో సరిచేయవచ్చు. మరికొన్ని లోపాలకు మాత్రం జీవితాంతం చికిత్స అవసరం అవుతుంది.

ఇన్సులిన్

రక్తంలోని గ్లూకోజ్ నియంత్రణలో ఉండాలంటే ఇన్సులిన్ హార్మోన్ అవసరం. అదే లేకపోతే రక్తంలో గ్లూకోజ్ నిలువలు పెరిగిపోయే హైపర్‌గ్లైసీమియా సమస్యగానీ, గ్లూకోజ్ నిలువలు బాగా తగ్గిపోయే హైపోగ్లైసీమియా సమస్య గానీ రావచ్చు. ఆహారం తీసుకోగానే రక్తంలో షుగర్ నిలువలు హఠాత్తుగా పెరుగుతాయి. షుగర్ నిలువల్లో హెచ్చు తగ్గులు ఏర్పడకుండా ఇన్సులిన్ ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ ఉంటుంది. ఎప్పుడైనా షుగర్ నిలువలు బాగా పెరిగిపోయినప్పుడు క్లోమగ్రంధి మరింత ఎక్కువ ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. శరీరం అవసరమైనంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేనప్పుడు రక్తంలో షుగర్ నిలువలు పెరిగడంతో మధుమేహం వస్తుంది. రక్తంలోని షుగర్ నిలువల్ని నియంత్రించకపోతే, రక్తం చిక్కబడి రక్త ప్రసరణలో అంతరాయాల కారణంగా గుండె, కిడ్నీలు, లివర్, కళ్లు ఇలా శరీరంలోని కీలకావయవాలన్నీదెబ్బ తినే ప్రమాదం ఉంది.

థైరాయిడ్

శరీరంలోని అత్యంత కీలకమైన గ్రంథుల్లో ఇదొకటి. దీని నుంచి విడుదల అయ్యే హార్మోన్లు, శక్తి వినియోగ క్రమాన్ని, జీవక్రియల వ్యవస్థను నియంత్రిస్తాయి. శ్వాసక్రియ, గుండెస్పందన, నాడీ వ్యవస్థ, శరీరం బరువు, కండరాల పటిష్టత, శరీర ఉష్ణోగ్రత, కొలెస్ట్రాల్, స్త్రీలల్లో రుతుక్రమం వంటి అనేక అంశాలపై థైరాయిడ్ ప్రభావం ఉంటుంది. ఆహార పదార్థాల్లోంచి అయోడిన్‌ను గ్రహించే శక్తి కూడా ఈ థైరాయిడ్ గ్రంథికి ఉంది. ఈ అయోడిన్ ద్వారానే థైరాయిడ్ గ్రంథి టి-3 (ట్రీయోడో థైరోనిన్), టి-4 (థైరాక్సిన్) అనే రెండు రకాల హార్మోన్లను ఉత్పత్తి చేయగలుగుతుంది. ఎప్పుడైనా టీ-3, టీ-4 హార్మోన్ నిలువలు తగ్గిపోతే గుండె కొట్టుకునే వేగం సహజస్థాయికన్నా పడిపోతుంది. పెరిగిపోతే గుండె వేగం పెరిగిపోవడం, డయేరియా, శరీరం బరువు తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆందోళన, చికాకు, విపరీతంగా చెమటలు రావడం, శరీర ఉష్ణోగ్ర త పెరిగిపోవడం, చేతులు వణకడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటితో పాటు జుత్తు రాలిపోవడం, కండరాలు, కీళ్లల్లో నొప్పులు, ఏకాగ్రత్త కొరవడటం, చర్మం, జుత్తు పొడిబారడం, తొందరగా అలసిపోవడం, నీరసం, తరుచూ జలుబు, జ్వరాలకు లోనుకావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. థైరాయిడ్ ప్రొఫైల్ ద్వారా సమస్య ఉన్నట్లు ఒకసారి నిర్ధారణ అయితే ఎండోక్రినాలజిస్టును సంప్రదించి చికిత్స జీవితాంతం తీసుకోవలసి వస్తుంది.

డాక్టర్ స్వామి అల్వాల్,
ఎం.బి.బిఎస్(ఉస్మానియా),
ఎండీ(నేచరోపతి)
సీనియర్ మెడికల్ ఆఫీసర్, సీజీహెచ్‌ఎస్(రిటైర్డ్)
మల్లునరసింహా రెడ్డి స్మారక ప్రజా వైద్యశాల
ఎం.హెచ్.భవన్, అజామాబాద్,
హైదరాబాద్



ఇవి తప్పనిసరి




జీవనశైలిలో మార్పులతో ఆధునిక జీవనానికి అలవాటు పడేవారు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతాబాగానే ఉన్నాం అను కుంటూ సరైన పోషకాహారం తీసుకువడంతో అలసత్వం చూపిస్తారు. శారీరక శ్రమ లేకపోవడంతో అధికబరువు, రక్తపోటు సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ముఖ్యంగా నాలుగుపదులు దాటిన వయసులో జాగ్రత్తలు తీసుకోకపోతే.. భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలకు ఆహ్వానం పలికినట్టే.

సాధారణంగా నలభై దాటిన ఏజ్‌గ్రూప్ వారు ఏదో ఒక ఉద్యోగం, ఉపాధిలోనూ ఉంటారు. వారి దైనందిన కార్యక్రమాలే పెద్ద ఎక్సర్‌సైజ్‌గా భావిస్తారు. రోజూ అరగంట నడవడానికి కూడా బద్ధకిస్తారు. ఇలాంటివారిలో కీళ్ల సమస్యలు, రక్తపోటు, మధుమేహం ఎక్కువగా వస్తాయి. వీళ్లు రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు రెగ్యులర్‌గా హెల్త్‌చెకప్స్ చేయించుకోవాలి. మహిళలు తప్పకుండా పాప్‌స్మియర్, మమోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలి. బరువు పెరగకుండా చూసుకోవాలి. శరీరబరువు పెరిగితే ఎముకలు అరిగిపోతాయి అన్న విషయం గుర్తుంచుకోవాలి.

శరీరంలో శక్తి ఉన్నప్పుడు బయటపడని అనేక అనారోగ్యసమస్యలు తమ విశ్వరూపాన్ని చూపించేది 45 నుంచి 60 మధ్య వయసులోనే. ఆహారం విషయంలో పరిమితులు పాటించాలి. బి.పి, మధుమేహం ఉన్నవారు కనీసం మూడు నెలలకు ఒకసారైనా వైద్యపరీక్షలు చేయించుకోవాలి. కాల్షియం సప్లిమెంట్స్, మల్టీవిటమిన్స్ తప్పనిసరిగా డాక్టర్ సూచనల మేరకు తీసుకోవాలి. ఇక అరవై తర్వాత కీళ్లనొప్పులు, మగవారిలో ప్రోస్టేట్ సమస్యలు ఎదురవుతాయి. వీటిని నివారించడానికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళల్లో మెనోపాజ్ వస్తుంది. హార్మోన్ ఇన్‌బ్యాలెన్స్ వల్ల వచ్చే అనారోగ్యసమస్యలపై అవగాహన పెంచుకోవాలి. రెగ్యులర్ చెకప్స్ తప్పనిసరి.


కాస్త తగ్గించండి



కంప్యూటర్ మీద పనిచేసేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఇటీవల వస్తున్న కొన్ని రకాల ఆరోగ్యసమస్యలకు కంప్యూటర్ మీద ఎక్కువ సేపు కూర్చోవడం కారణం అవుతుంది. ఎక్కువ సేపు కూర్చొని పని చేసే వారికి చూపు మందగిస్తుంది. వెన్నునొప్పి వేధిస్తుంది. ఇలాంటి సమస్యల నుండి కొంతమేరకైనా విముక్తి పొందాలంటే.. కొన్ని ఆరోగ్య చిట్కాలు పాటించడంతో పాటు కంప్యూటర్ వాడకాన్ని కాస్త తగ్గించండి అంటున్నారు ఆరోగ్యనిపుణులు..

- కంప్యూటర్ దగ్గర ఎక్కువ సేపు కూర్చొని పనిచేసే వారు ప్రతి అరగంటకు లేదా గంటకు ఒకసారి విశ్రాంతి నిచ్చి దూరపు చూపు చూస్తూ విశ్రాంతి తీసుకోవాలి.
- వెలుతురు సరిగ్గా లేని చోట...చీకటిలో కంప్యూటర్ వాడటం మానుకోవాలి. ఏసీ, వెంటిలేటర్‌ల నుండి వచ్చే గాలి నేరుగా ముఖంపై వచ్చి పడకుండా చూసుకోవాలి.
- వాహనంలో వెళ్లే సమయంలో ల్యాప్‌టాప్, టాబ్ వంటివి ఉపయోగించవద్దు. కంటిపై ఎక్కువ శ్రమ పడుతుంది.
- కంప్యూటర్‌ను కనీసం అరమీటర్ దూరంలో ఉంచాలి.
- నిటారుగా కూర్చోవాలి. ప్రతి గంటకు ఒకసారి ఐదు నిమిషాలు బ్రేక్ ఇవ్వాలి.

జీర్ణశక్తి పెంచే..!



మనం రోజూ ఆహారంలో తీసుకునే రకరకాల కూరగాయలు మనకు ఎంతో మేలు చేస్తాయి. వాటిలోని ప్రత్యేకగుణాలు శరీరధర్మప్రక్రియలను వేగవంతం చేస్తాయి. చాలామంది తినడానికి ఇష్టపడని ముల్లంగిలో ఎన్నో ఔషధగుణాలున్నాయి.

- మూత్రపిండాల్లోని రాళ్లను కరిగించడంలో ముల్లంగి బాగా పనిచేస్తుంది. ముల్లంగిని ఆకులతో సహా వండుకుని తింటూ ఉంటే రాళ్లు ఏర్పడే అవకాశమే ఉండదు.
- ముల్లంగి జ్యూస్‌ని తరుచూ సేవిస్తూ ఉంటే కాలేయ సంబంధ వ్యాధులు రాకుండా ఉంటాయి.
- పచ్చి ముల్లంగి దుంపలు, ఆకుల రసాన్ని వారానికి ఒకసారి తాగితే జీర్ణశక్తి పెరుగుతుంది. కాలేయం సమర్థవంతంగా పనిచేస్తుంది. కొన్ని రకాల లివర్ వ్యాధులు తగ్గుముఖం పడతాయి.
- ఆగకుండా వెక్కిళ్లు వస్తున్నప్పుడు కాస్తంత ముల్లంగి రసం తాగితే వెంటనే తగ్గిపోతాయి.
- విపరీతమైన జలుబు, దగ్గు, ఆయాసంతో బాధపడుతున్న వారు ముల్లంగి రసం తాగితే వెంటనే ఉపశమనం లభిస్తుంది.
- ముల్లంగి విత్తనాలను బాగా ఎండబెట్టి, మెత్తగా దంచి, ఆ పొడిని అన్నంలో రోజూ కలుపుకుని తింటూ ఉంటే స్త్రీలల్లోని రుతు సంబంధ వ్యాధులు నయమవుతాయి.
- ముల్లంగి రసానికి నాలుగో వంతు నువ్వుల నూనె కలిపి, నూనె మాత్రమే మిగిలేలా కాచి భద్ర పరుచుకోవాలి. ఈ నూనెను వడబోసి చెవిపోటు బాధిస్తున్నప్పుడు, చెవిలో హోరులాంటి సమస్య ఉన్నప్పుడు చెవిలో కొన్ని చుక్కలు వేస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది. కీళ్లవాపులు, నొప్పులు ఉన్న చోట ఈ నూనెతో మర్ధన చేస్తే ఆ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- ముల్లంగి ఆకుల్ని, దుంపని ఎండబెట్టి, మెత్తగా దంచి, ఆ పొడిని తేనెతో కలిపి రోజుకు ఒక చెంచా చొప్పున తీసుకుంటే, శరీరంలోని ఏ అవయంలోనైనా వాపు, నొప్పి ఉంటే తగ్గిపోతాయి.

ముందుజాగ్రత్తగా..!

జబ్బు రాకుండా ప్రివెంట్ చెయ్యడం చాలా మంచి విషయం. ముఖ్యంగా డయాబెటీస్ హెరిడిటీగా ఉన్నవారు ముందుగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. డయాబెటీస్ రాకుండా ఉండాలంటే లైఫ్‌స్టయిల్ ఒక క్రమంలో ఉండాలి. ఎప్పుడైతే గాడి తప్పుతుందో అప్పుడు లైఫ్ స్టయిల్ వ్యాధులు వచ్చే అవకాశం పెరుగుతుంది. మీ జీవన శైలిని ఒకసారి పరీక్షించుకుని చూడండి. వెంటనే ఎక్కడ జాగ్రత్త పడాలో తెలుస్తుంది. దానికి తగిన చర్యలు చేపట్టి, అవసరమైతే డాక్టర్‌ను కలిసి సరైన డైట్, లైఫ్‌స్టైల్ అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. డయాబెటీస్ రాకుండా నివారించవచ్చు.



- ఆహారంలో పీచు పదార్థం బాగా ఉండేట్టు చూసుకోవాలి. ముఖ్యంగా తృణధాన్యాల నుంచి వచ్చే ఫైబర్ షుగర్ లెవల్స్‌ని నార్మల్‌గా ఉండేట్టు చేస్తుంది. తృణధాన్యాలు అంటే తృణధాన్యాల పిండి, బ్రౌన్ రైస్, అన్ని రకాల మిల్లెట్స్. ఒక తృణధాన్యాల పిండి, ఏదైనా ఒక కూరగాయ, ఒక పండు మీ ఆహారంలో తప్పనిసరిగా ఉండేట్టు చూసుకోవాలి. ఆహారం సమతుల్యంగా ప్లాన్ చేసుకుని తీసుకోవాలి.
- టైమ్ ప్రకారం ఆహారం తీసుకోవడం ముఖ్యం.
- ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. కనీసం పదినిమిషాల పాటు వాకింగ్ అయినా చేయాలి. కొంచెం హార్ట్‌బీట్ రేట్ పెరిగేట్టు వాకింగ్ చేస్తే మెటబాలిక్ యాక్టివిటీ సక్రమంగా ఉంటుంది.
- సమయానికి నిద్రపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. లేట్‌నైట్ వల్ల మెటబాలిక్ యాక్టివిటీలో మార్పులు వచ్చి డయాబెటిక్‌కు దారితీస్తాయి.
- క్రానిక్ ఒత్తిడి వల్ల ఆరోగ్యం చెడుతుంది. ఒత్తిడిని అధిగమించడానికి ఎవరికి వారే ఒక సూత్రం కనిపెట్టుకోవాలి. యోగా, పెంపుడు జంతువులతో ఆడుకోవడం, మొక్కలు పెంచడం, పుస్తకాలు చదవడం, చక్కటి సువాసనలతో వేడి నీళ్ల స్నానం చెయ్యడం మొదలైనవి.



మరో సిరీస్‌పై కన్నేసిన టీమిండియా

• నేడు ఆస్ట్రేలియాతో చివరి వన్డే • ఉదయం 7.50 ని.ల నుంచి స్టార్ సిక్స్‌లో ప్రసారం

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ 2-1తో చేజిక్కించుకొని నయా చరిత్ర సృష్టించిన టీమిండియా ఇప్పుడు మరో రికార్డుపై కన్నేసింది. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి వన్డేలో టీమిండియా గెలిస్తే కొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. ఇప్పటివరకూ ఆస్ట్రేలియా గడ్డపై ఒక్క ద్వైపాక్షిక వన్డే సిరీస్‌నూ టీమిండియా గెలిచిన సందర్భం లేదు. గతంలో రెండుసార్లు ఆస్ట్రేలియాపై వన్డే ఫార్మాట్‌లో సిరీస్‌లు సాధించినప్పటికీ అవి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు కావు. ఒకటి 1985లో జరిగిన వరల్డ్ చాంపియన్ షిప్ ఆఫ్ క్రికెట్ టైటిల్ కాగా, రెండోది మూడు దేశాలు పాల్గొన్న సీబీ సిరీస్.

దాంతో ఒక ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో తొలిసారి ఆసీస్‌ను వారి దేశంలో ఓడించే అవకాశం టీమిండియా ముంగిట ఉంది. ఈ మేరకు కసరత్తులు చేస్తున్న కోహ్లీ సేన ఆసీస్ పర్యటనకు ఘనమైన ముగింపు ఇచ్చే యోచనలో ఉంది. శుక్రవారం మెల్‌బోర్న్ వేదికగా ఇరుజట్ల మధ్య సిరీస్ నిర్ణయాత్మక ఆఖరివన్డే జరుగనుంది. భారత్-ఆసీస్‌లు తలో వన్డే గెలిచి సమంగా నిలవడంతో మూడో వన్డేకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొలి వన్డేలో ఆసీస్ 34 పరుగుల తేడాతో గెలవగా, రెండో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఆసీస్‌ను ఓడించింది. నేటిమ్యాచ్‌లో భారత్ గెలిచిన పక్షంలో ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్‌ను కోల్పోకుండా ముగించినట్లు అవుతుంది. మూడు టీ20ల సిరీస్ 1-1తో సమం కాగా, నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1తో టీమిండియా గెలుచుకున్న విషయం తెలిసిందే.

వరల్డ్‌కప్‌కు రిషభ్ ఎంపిక భారమే : సచిన్

వచ్చే వరల్డ్‌కప్‌లో భారత క్రికెట్ జట్టులో యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు అవకాశం దక్కే అవకాశాలు సంక్లిష్టమని సచిన్



టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ రిషభ్ పంత్ తమ వరల్డ్ కప్ ప్రణాళికల్లో ఉన్నాడంటూ చెప్పుకొచ్చాడు. అయితే దీనిపై సచిన్ మాత్రం పెదవి విరిచాడు. రాబోయే వరల్డ్‌కప్‌లో రిషభ్ పంత్‌కు చోటిస్తే మాత్రం అది జట్టు కూర్పుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నాడు. ఇప్పటికే ఇద్దరు స్పెషలిస్టు వికెట్ కీపర్లు ఎంఎస్ ధోని, దినేశ్ కార్తీక్‌లు వన్డే జట్టులో ఉండగా, మరొక స్పెషలిస్టు వికెట్ కీపరైన పంత్‌కు చోటు కల్పించడం జట్టుకు భారంగా మారుతుందన్నాడు. ధోనీ గాడిలోపడితే అతను ఏమి చేయాలనుకున్నాడో అది ఖచ్చితంగా చేసి చూపెడతాడన్నాడు. గేమ్‌ను ఫినిషింగ్ చేసే విధానంలో ధోని దిట్ట. ఇక దినేశ్ కార్తీక్ కూడా మంచి బ్యాట్స్‌మన్. మ్యాచ్‌పై ఒత్తిడిని తగ్గిస్తూ స్ట్రైక్ రొటేట్ చేయడంలో కార్తీక్‌కు మంచి అనుభవం ఉంది. ఈ తరుణంలో రిషభ్ వరల్డ్‌కప్ ఎంపిక అనేది సరైనది కాకపోవచ్చని' సచిన్ పేర్కొన్నాడు.

భారతజట్టు : విరాట్ కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తీక్, ఎంఎస్ ధోనీ(వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్/చాహల్, రవీంద్ర జడేజా/కేదర్ జాదవ్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమి, సిరాజ్/విజయ్ శంకర్.

ఆస్ట్రేలియాజట్టు : అరోన్ ఫించ్(కెప్టెన్), బెహ్రెన్‌డోర్ఫ్, క్యారీ(వికెట్‌కీపర్), హ్యాండ్స్‌కోంబ్, ఉస్మాన్ ఖావాజా, లియాన్, మిచెల్ మార్ష్/షాన్ మార్ష్, మ్యాక్స్‌వేల్, రిచర్డ్‌సన్, సిడెల్/టర్నెర్, స్టాన్‌లేక్/స్టోనిస్, ఆడమ్ జంపా.

క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్



కౌలాలంపూర్ (మలేసియా): భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లో మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండోరౌండ్ మ్యాచ్‌లో కిదాంబి 23-21, 8-21, 21-18 పాయింట్ల తేడాతో వింగ్-కి-విన్సెంట్(హాంకాంగ్)పై, మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ 21-14, 21-16 తేడాతో యిప్ పుయ్ యిన్(హాంకాంగ్)పై గెలిచి క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. పారుపల్లి కశ్యప్ 17-21, 23-25 పాయింట్ల తేడాతో విక్టర్ అక్సెల్సన్ చేతిలో వరుససెట్లలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 18-21, 17-21 పాయింట్ల తేడాతో ఇండోనేషియా జోడీ చేతిలో ఓడింది. తొలిరౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు కెంటో మొమోటోపై 15-21, 21-14, 20-22 పాయింట్ల తేడాతో గెల్చిన నిషిమోటో రెండోరౌండ్‌లో 15-21, 17-21 పాయింట్ల తేడాతో లీ-జి(మలేషియా) చేతిలో ఓడాడు. శుక్రవారం శ్రీకాంత్ మాజీ ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు హో-సన (కొరియా)తోనూ, సైనా నెహ్వాల్ ఒకుహారా(జపాన్)తోనూ క్వార్టర్‌ఫైనల్లో తలపడనున్నారు.

సెలక్టర్‌గా సర్దార్‌సింగ్



న్యూఢిల్లీ: ఇటీవలే ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్దార్‌సింగ్ ఇక సెలక్టర్ పాత్ర పోషించనున్నాడు. 13 మంది సభ్యుల భారత హాకీ సెలక్షన్ కమిటీలో సర్దార్‌కు చోటు దక్కింది. ఈ విషయాన్ని సర్దార్‌సింగ్ ధ్రువీకరించాడు. సర్దార్‌తో పాటు హర్బిందర్ సింగ్, సయ్యద్ అలీ, సుబ్బయ్య, ఆర్‌పీ సింగ్, రజనీశ్ మిశ్రా, జోయ్‌దీప్ కౌర్, సురేందర్‌కౌర్, అసుంత లాక్రా, హై పర్ఫామెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్, భారత సీనియర్ పురుషుల, మహిళల జట్ల కోచ్‌లు ఇతర సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీకి 1975 హాకీ ప్రపంచ కప్ విజేత జట్టులో సభ్యుడైన బీపీ గోవింద సారథిగా వ్యవహరిస్తున్నాడు.

వారికి ఓ అవకాశమివ్వండి : గంగూలీ

ముంబయి: టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెండైన హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లు తప్పు తెలుసుకొన్నారు కాబట్టి వారి తప్పును సరిదిద్దుకోవడానికి ఓ అవకాశమిస్తే మరింత మెరుగవుతారని గంగూలీ అభిప్రాయపడ్డాడు. 'పొరపాట్లు చేయడం సహజమని, వాటిపై తీవ్రంగా స్పందించొద్దు. తప్పు చేసినవారు దాన్ని తెలుసుకొని మరింత మెరుగైన వ్యక్తిగా మారతారని నమ్మకముంది. తప్పు చేయకుండా ఉండటానికి మనమేమీ యంత్రాలం కాదు మనుషులం. ఇక ముందుకెళ్లి మరోసారి ఇలాంటిది జరగకుండా చూసుకోవాలి' అని గంగూలీ కోరాడు. ఈ తరం క్రికెటర్లలో విరాట్ కోహ్లీ, ధోనీలు ఆదర్శనీయులు. ఒకప్పుడు గవాస్కర్, ఆ తర్వాత సచిన్ టెండూల్కర్ కెరీర్ ముగియంగానే తర్వాత ఎవరు? అని ఆలోచించారు. ఇప్పుడా ప్రశ్నకు జవాబు విరాట్. చాలామంది క్రికెటర్లు స్వతహాగా మంచి మనుషులు. మధ్య తరగతి నుంచి పోరాడి ఈ స్థాయికి వస్తారు. కోట్ల మంది క్రికెట్ ఆడేవారిలో 11 మందిని ఎంపిక చేస్తారంటేనే మనం ఊహించుకోవచ్చు' అని గంగూలీ అన్నారు.



పూసింది.. పూసింది.. కొమ్మాన పూత



జనగామ జిల్లా లింగాలఘనపురం మండల కేంద్రానికి చెందిన రైతు మేడ తిరుమలయ్య వ్యవసాయ బావి వద్ద ఉన్న మామిడిచెట్టు ఆకులు కూడా కనిపించనంతగా విరపూసి కొమ్మలు నేలను తాకుతూ ఆకర్షిస్తోంది.

- ఫొటో : ఎం. వీరస్వామి, నవతెలంగాణ.

మరిన్ని విజయాలు సాధించాలి..

- సీఎం కేసీఆర్‌కు సింగపూర్ మంత్రి ఈశ్వరన్ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సింగపూర్ మంత్రి ఈశ్వరన్ గురువారం లేఖ రాశారు. తెలంగాణ సీఎంగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్ మరిన్ని విజయాలు సాధిం చాలని ఆయన ఆకాంక్షించారు. కేసీఆర్ పనితీరుకు ఈ విజయమే నిదర్శనమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో సింగపూర్-తెలంగాణ ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూల వాతావరణం ఉందని భావిస్తున్నామని తెలిపారు. మరిన్ని పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్‌లో తెలంగాణ ఆర్థిక అభివృద్ధిలో సింగపూర్ కంపెనీలు భాగస్వాములు అవుతాయని పేర్కొన్నారు. చెన్నైలోని రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ కాన్సులెట్ జనరల్ రాయ్ ఖో కూడా సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. రెండోసారి విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు.

ఫెడరల్ ఫ్రంట్ అంటేనే బాబుకు వణుకు...

- తలసాని ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫెడరల్ ఫ్రంట్ పేరు వింటేనే ఏపీ సీఎం చంద్రబాబుకు వణుకు పుడుతున్నదని మాజీ మంత్రి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ... 'ఇటీవల నేను ఏపీకి వెళ్లాను. అయితే అక్కడి దుర్గ గుడి వద్ద నేను రాజకీయాలు చేశానంటూ చంద్రబాబు విమర్శించారు... ఆయనలాగా దేవాలయాల వద్ద రాజకీయాలు చేసే అలవాటు నాకు లేదు. నాకు అక్కడ బంధువులున్నారు. బంధుత్వాలు, బంధాల విలువ చంద్రబాబుకు తెలియదు. హరికృష్ణ చనిపోతే అక్కడ కూడా రాజకీయాలు మాట్లాడిన నీచ సంస్కృతి చంద్రబాబుది...' అని విమర్శించారు.

విష పురుగులు కాషాయ మతోన్మాదులు

రోహిత్ వేముల వర్థంతి సభలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ- రాంనగర్

విద్యాలయాల్లో కాషాయ మతోన్మాదులు విషపురుగుల్లా తయారయ్యారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల మూడో వర్థంతి సభ నిర్వహించారు. చర్చల ప్రతినిధి చంద్రన్న రోహిత్ వేముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాడిగల్ల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. కాషాయ మతోన్మాదులు ఉన్నత విద్యాలయాల్లోని మేధావులపై దాడులు చేస్తూ, యూనివర్సిటీలో భావ ప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతసామరస్యం, ప్రగతిశీల భావాలను అభివద్ధి చేయడం, మతోన్మాదులను ప్రతిఘటించడం వల్లే రోహిత్ వేముల ఆశయాలను ముందుకు తీసుకెళ్లగలమన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతులను, మేధావులు, జర్నలిస్టులను మట్టు పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి 17, 2016 హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో అంబేద్కర్ భావాలకు ప్రతినిధిగా ఉన్న రోహిత్ వేములను, ఆయనతో పాటు మరో నలుగురిని ఆ కారణంగా వీసీ అప్పారావు సాంఘిక బహిష్కరణ చేశారని గుర్తు చేశారు. యూనివర్సిటీలో తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చినందుకు రోహిత్ వేములను ఏబీవీపీ శక్తులు మానసికంగా వేధించి వ్యవస్థీకతంగా హత్య చేశాయన్నారు. జేఎన్‌టీయూలో విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్‌పై రాజ ద్రోహం కేసు, మద్రాసు అంబేద్కర్ పూలే స్టడీ సర్కిల్‌పై మతో న్మాదుల దాడులు జరిగాయన్నారు. నేడు ఆర్ఎస్ఎస్ ఛాందస భావాలన్నింటినీ విద్యారంగంలో ప్రవేశపెట్టి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞా నాన్ని కూడా మూఢత్వంలో ముంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైన్స్ కాంగ్రెస్‌లో ఆంధ్ర యూనివర్సిటీ వీసీ అజ్ఞానపు వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల స్మతి చిహ్నంగా ఉన్న వెలివాడను తొలగించడం సిగ్గుచేటన్నారు. మతోన్మాదులను సామాజికంగా ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్, ఏపీఎస్పీ రాష్ట్ర అధ్య క్షులు శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మ నాయక్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.రమణ, ఇతర ప్రజాసంఘాల నాయకులు ఎం.కపాసాగర్, జగదీష్, బాలు, జావేద్, గోవింద్, ఎల్లయ్య, కిరణ్, మహేందర్, విజయ్ పాల్గొన్నారు.



దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

- 8వ తరగతి విద్యార్థుల్లో 50 శాతంకుపైగా సులభ భాగాహారాలు చేయలేని దుస్థితి
- నలుగురిలో ఒకరు రెండో తరగతి పాఠాలు చదవలేకపోతున్నారు

న్యూఢిల్లీ: ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు లోపించాయని జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. పదేండ్ల క్రితంతో పోలిస్తే 6-14 ఏండ్ల వయసు విద్యార్థుల నమోదు పెరిగింది(96 శాతం). బడి మానివేస్తున్న విద్యార్థుల సంఖ్య తగ్గింది. కానీ, విద్యార్థుల సామర్థ్యం పదేండ్ల క్రితంతో పోలిస్తే తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. 8వ తరగతి చదివే విద్యార్థుల్లో ప్రతి నలుగురిలో ఒకరు రెండో తరగతి పాఠాల్ని చదవలేకపోతున్నారు. 50 శాతంకుపైగా సులభ భాగాహారాలు చేయలేకపోతున్నారు.

దేశవ్యాప్తంగా 596 జిల్లాల్లో 3,54,944 ఇండ్లలోని 3-16 ఏండ్ల మధ్య ఉన్న 5,46,527మంది విద్యార్థులను సర్వే చేసి విద్యపై వార్షిక నివేదిక (ఏఎస్ఈఆర్)పేరుతో వివరాలను వెల్లడించారు. ప్రథమ్ అనే స్వచ్ఛంద సంస్థ 15,998 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించింది.

2008లో నిర్వహించిన శాంపిల్ సర్వే ప్రకారం 84.4 శాతంమంది 8వ తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్య పుస్తకాల్ని చదవగలిగేవారు. 2018లో ఇది 72.8 శాతానికి పడిపోయింది. ఐదో తరగతి విద్యార్థుల విషయంలో(రెండో తరగతి పుస్తకాల) పఠనా సామర్థ్యం 2008లో 53.1 శాతం ఉండగా, 2018లో 44.2 శాతానికి పడిపోయింది. ప్రయివేట్ పాఠశాలల విషయంలో 2008లో ఐదో తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యం 68 శాతం ఉండగా, 2018లో అది 65 శాతానికి తగ్గింది.



అయితే, డ్రాపవుట్స్ విషయంలో గతంతో పోలిస్తే తగ్గడం మంచి పరిణామంగానే నివేదిక వెల్లడించింది. 2018లో 15-16 ఏండ్ల విద్యార్థుల్లో డ్రాపవుట్స్ బాలికల్లో 13.5 శాతం, బాలురిలో 12.6 శాతంగా నమోదైంది. 11-14 ఏండ్లవారిలో డ్రాపవుట్స్ బాలికల్లో 4.1 శాతం, బాలురిలో 3.3 శాతంగా నమోదైంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.